శ్రీ చిదంబర గ్రంథమాలా తృతీయరత్నము.

శ్రీ రామాంజనేయము.

(నాటకము.)


చిదంబర ప్రణీతము.

శ్రీ శ్రీ శ్రీ వేంకటగిరి సంస్థాన యువరాజ
సర్వజ్ఞ కుమార కృష్ణ యాచేంద్ర
బహూకృతి పాత్రము.

ద్వితీయ ముద్రణము.
1000.

కాకినాడ:
ఇది ప్రథమాంకమునుండి ద్వితీయాంకమువఱకు
సుజనరంజనీ ముద్రాక్షరశాలలోను తక్కినభాగము
శ్రీ సావిత్రీ ముద్రాక్షరశాలను ముద్రింపఁబడియె.
1922.

 [వెల 1 [illegible]



చిదంబరకవిః.

కృతజ్ఞత.

సీ॥ వెలుగోటి సంతతి ♦ కలశాబ్ధి దినదినా
భ్యుదయ మందెడి జన్మ ♦ మొందినాఁడు
తన పూర్వికులయందుఁ ♦ దగిన భక్తి శ్రద్ధ
లినుమడించిన బుద్ధి ♦ నెనసినాఁడు
మంచి చెడ్డలు గను ♦ నించి వర్తిలు శక్తి
నలరారు నేర్పున ♦ నమరినాఁడు
ప్రాజ్ఞ సంతతు లనా ♦ రతము సంతోషింపఁ
గలిగిన గుణముచే ♦ వెలసినాఁడు

గీ॥ మహిని నట్టి సర్వజ్ఞ కు ♦ మార కృష్ణ
యాచ భూపాల మణికి బు ♦ ధాబ్జ ఘృణికి
ధారణీ స్థలి నాచంద్ర ♦ తారకముగ
శ్రేయములు గల్గు నట్టు లా ♦ శీర్వదింతు.

గ్రంథకర్త.

విజ్ఞాపనము.

శ్రీరామాంజనేయమున కిది ద్వితీయ ముద్రణావతారము. పఠనములగు కొన్ని క్రొత్త మార్పు లిందుఁ జేయఁబడినవి. నే నిది బాల్యమందు రచించిన దగుటవలన నెట్లుండినను శుకవాక్యంబు చందమున సహృదయ మనోరంజకము గాకపోదని నానిశ్చయము. బ్రహ్మాండమున నుండు నేతత్కథాసంవిధానము కొంత స్థాలీ పులాక న్యాయముగాఁ బ్రకటింపఁబడినది.

....

రాజా యయాతి స్స్వగరా తీరి దేశ ముపాగమత్
తత్రాసన్ మునయ శ్శ్రేష్ఠా వసిష్ఠ బ్రహ్మజాదయః॥
ప్రణనామ స తాన్ దృష్ట్వా ప్రథమం విహితాంజలిః
వసిష్ఠాయ పిశిష్టాయ కౌశికాయ తతః పరం॥
సర్వేషా మపి హృష్టేన చేతసా ప్రణనామచ
తదాంతరే మహాతేజా దండ తాడిత నాగవత్॥
విశ్వామిత్ర స్సముద్వేగా ద్గచ్ఛ గచ్ఛ నృపాధమ॥
బ్రహ్మర్షీం త్సకలా న్నత్వా గచ్ఛాస్మద్వందనేన కిం॥
అగ్రగా అపి కిం మూర్ఖ నయంతే దృష్టి గోచరాః

....

నారదస్తు తత స్సర్వం ప్రోవాచ ధరణీ భృతే
రామోద్యోగం కౌశికేన చోదితంచ శనై శ్శనైః॥
ఉక్త్వా దైన్య సమావిష్టం రుదంతంచ ముహుర్ముహుః
కృపావాం శ్చోదయామాస హనూమద్దర్శనాయ వై॥

....

హనూమతోపి రామస్య సంగ్రామోఽభూ ద్భయం కరః

....

తతః ప్రసన్నో భగవాం చ్ఛంకరో లోక శంకరః
కౌశికేన పున ర్బాధం భీత చిత్తేన తత్క్షణాత్॥
నివారయామాస పున స్సంగరం దృఢ సంగరం

....

చిదంబర కవిః

కథాసంగ్రహము.

ప్రథమాంకము.

యయాతి నృపాలుండు మృగయాలోలుండై సరయూ నదీ తీరమున నేగుట, మహర్షులకుఁ బ్రణమిల్లుట. విశ్వామిత్రుం డాతని నాగ్రహించుటయు.

ద్వితీయాంకము.

విశ్వామిత్రుండు శ్రీరాముని కడకేగి యాతనిచే నా యయాతిని జంపునట్లు ప్రతిజ్ఞ చేయించుకొనుట శ్రీరాముఁడు తన ముఖ్యభక్తుండగు యయాతిని వధింపఁజాలక దుఃఖించుటయు.

తృతీయాంకము.

శ్రీరాముఁడు ప్రతిజ్ఞగట్టిన క్రమమంతయు నారదుఁడు యయాతికెఱింగించి రామేశ్వరమునఁ దపంబాచరించుచుండు నాంజనేయుని కడ కాతనిం బంపుట.

చతుర్థాంకము.

యయాతి జాంబవదాది సహేతుండగు నాంజనేయుని శరణుజొచ్చి తన ప్రాణరక్షణముచేయునట్లు వాగ్దానముం దీసికొని తన వృత్తాంత మెఱింగించుటయు నాంజనేయుండు మిగుల దుఃఖించి రాముని కడ కంగదుని రాయబారమునకుఁ బంపుటయు.

పంచమాంకము.

అంగదుఁడు రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల కడ కేగి రాయబారము నడుపుట.

షష్ఠాంకము.

శ్రీరాముఁ డాంజనేయున కేకాంతమునఁ దనశక్తికొలందియు యయాతిని విడుచునట్లు సామదానభేదోపాయముల బోధించుట.

సప్తమాంకము.

రామలక్ష్మణ భరతశత్రుఘ్నులతో నాంజనేయ జాంబవదంగద సుగ్రీవులకు ఘోరయుద్ధమగుటయు. మహేశ్వర ప్రత్యక్షము. విశ్వామిత్రుఁడు తన ప్రతిజ్ఞ మరలించుకొనుటయు, పుష్పవృష్టి, భరతవాక్యము.

నాటకపాత్రములు.

1. సూత్రధారుఁడు.
2. యయాతి.
3. విశ్వామిత్రుఁడు.
4. నారదుఁడు.
5. వసిష్ఠుఁడు.
6. రాముఁడు.
7. లక్ష్మణుఁడు.
8. భరతుఁడు.
9. శత్రుఘ్నుఁడు.
10. విభీషణుఁడు.
11. కుశుఁడు.
12. లవుఁడు.
13. సుశీలుఁడు.
14. విశారదుఁడు.
15. ఆంజనేయుఁడు.
16. అంగదుఁడు.
17. జాంబవంతుఁడు.
18. సుగ్రీవుఁడు.
19. మహేశ్వరుఁడు.
20. గంధర్వమిథునము.
21. శాంతిమతి.
22. నటి.



శ్రీరామాంజనేయము

ప్రథమాంకము.

నాంది.

(సూత్రధారుఁడు ప్రవేశించుచున్నాఁడు)

శా. శ్రీకల్యాణగుణాకరుండు భువన ♦ క్షేమంకరుం డార్తలో
కైకత్రాణపరాయణుండు సకల ♦ జ్ఞేయుండు వాఙ్మానసా
లోకాతీతుఁడు నిర్వికారుఁడు దయా ♦ ళుండైన విశ్వాత్మకుం
డాకల్పాంతము మీకు మాకుఁ బరమా ♦ హ్లాదంబుఁ జేకూర్చుతన్.

(పుష్పాంజలిం జల్లి)

ఉ. ఝుమ్మని లేచి గ్రమ్ముకొని ♦ షట్పదబృందము సారసారఝం
ఝుమ్మని తేనెలానుచును ♦ సోలుచు నాదవినోదముల్ సెలం
గమ్మురి పమ్మి మనుగ ♦ గానము సేయ వికాస మొసఁగు పు
ష్పమ్ము లొసంగు సౌరభమ్ము సర ♦ సమ్ముగ మీకు శుభమ్ము లీవుతన్.

ఆహా! కాలమతిక్రమించుచున్నది. రూపకావలోకన కౌతుక త్వరమాణమానసు లగు సభాసదు లీయాస్యమున కోర్తురా! ప్రియసి యింత జాగొనరించెఁ గారణ మేమి?

నటి—(ప్రవేశించి) ఆర్యపుత్రా! వందనము

సూత్ర—కలికీ! సహృదయులగు సామాజికులు పంపిన కమ్మ చూడఁదగినది.

నటి—ఏది ? యేదీ ? (తీసికొని)

తే. గీ. శ్రీ ద్వితీయమ్ము భావ గా ♦ జద్విలాస
మార్యనామాంకితమ్ము చా ♦ తుర్య భాజ
నమ్ము నూత్నప్రయోగ సే ♦ యమ్ము నాడి
చూపుఁడీ ! యసమానమా ♦ రూపకమ్ము.

సూత్ర—మానినీ! దీనియందేది యేని రూపకము తేట పడినదా ?

నటి—ఆర్యపుత్రా ! యెంతయాలోచించినను నాబుద్ధికారూపక మేదియో గోచరింప కున్నయది. ఇందేరూపకమును జెప్పఁబడి యున్నట్లు నాకుఁ దోఁపదు.

సూత్ర—గోలా ! తెలియఁజాలక యట్లంటివిగాని యీపద్యమునందు రూపక నామము విస్పష్టముగాఁ జెప్పఁబడి యున్నదినుమా ?

నటి—ఏవీ ? యిందే యున్నదియా ? ఆశ్చర్యమాశ్చర్యము ! !

సూత్ర—(చిఱునవ్వుతో) ప్రేయసీ ! " స్త్రీణాంద్విగుణ ఆహారో బుద్ధిశ్చాపి చతుర్గుణా " యనునార్యోక్తిలో ద్వితీయపాద మీకాల స్త్రీలకుఁ జెల్లదేమో?

నటి—(సిగ్గుచే) పరిహాసములకేమి? యారూపక మేదియో సెలవిమ్ము.

సూత్ర—చెప్పవలయునా? మరలఁ జదువుము.

నటి—తే. గీ. శ్రీ ద్వితీయమ్ము భావగా ♦ జద్వలాస
మార్యనామాంకితమ్ము చా ♦ తుర్యభాజ
నమ్మునూత్నప్రయోగసే ♦ యమ్మునాడి
చూపుఁడీ ! యసమానమా ♦ రూపకమ్ము.

సూత్ర—మొదటి యక్షరము తోడ తొనిమిది యక్షరముల కొక్కొక్క యక్షరము చొప్పున లెక్కఁ బెట్టికొనుము

నటి—(లెక్కఁబెట్టి) నాథా ! శ్రీరామాంజనేయమా ? ఏమి మీ కౌశల్యము.

సూత్ర—లలనా! నాకౌశల్యము గాదది యారూపక కౌశల్య మట్టిది.

నటి—నవీనమగు నీరూపకము రచియించి లోకమునకు బ్రహ్మానందముంగూర్చిన కవి చంద్రునినామమునొక్కపరి వక్కాణించి శ్రోత్ర సాఫల్య మొనరింపుము.

సూత్ర—అళివేణీ ! వినుము

సీ. బాల లీలలు దన్నుఁ ♦ బాయకుండిననాఁడె
కీర్తిముగ్ధను గన్ను ♦ గీఁటినాఁడు
కావ్యపంచకము గ ♦ తుల కెక్కి డిగు నాఁడె
వైదుషీమధ్య కే ♦ ల్పట్టినాఁడు
నూనూఁగు మీసముల్ ♦ రాని కాలమునాఁడె
ధారణాప్రౌఢ మేల్ ♦ గోరినాఁడు
పువ్వుఁబోఁడి కెమ్మోవి ♦ చవి నెఱుంగని నాఁడె
కవితాలతాంగితోఁ ♦ గలిసినాఁడు

తే. గీ. ఉభయభాషలఁ బాండిత్య ♦ మూనినాఁడు
భువి భరద్వాజకులమునఁ ♦ బొడమినాఁడు
శతవధాన విధా సమ ♦ జ్ఞా విశేష
గౌరవుండు చిదంబర ♦ కవివరుండు.

నటి—ఆర్యపుత్రా! శ్రీమన్మహీశూరమహారాజాస్థాన విద్వత్కవి వరుండగు చిదంబర సుధీమణి రూపక మభినయించుట వలన మన భరత విద్యా వైశద్య మనవద్య మయ్యెడునని నా విశ్వాసము.

సూత్రి—సందియమేమి? కలికీ! నిర్ణీత సమయము మాసన్నమైనది. యింక సామాజికుల మనంబులు పల్లవితంబు లగు నట్లొంచుక ఋతువర్ణన గావింపుము.

నటి—చిత్తము (మానిని)

పంకము లేదు ధరాతలమందు వి ♦ భాసురమయ్యె నభంబు గడున్
బొంకములై కనుపట్టె సరోవర ♦ ముల్ విమల ప్రభ తోడుత నే
శాంక కళా నివహంబు వెలింగెడి ♦ నచ్ఛములయ్యె దిగంతము లా
తంకము వోయె జనంబులకున్ శర ♦ దాసమయాధిపు రాకమెయిన్.

సూత్రి—నటీ! నీ గానము వలన యయాతిన్నపాలుండిట్లు వచ్చుచున్నట్లు సూచింపఁబడుచున్నది. మన మనంతర కరణీయమునకు సన్నద్ధులము గావలయు.

(నిష్క్రమింతురు)

ప్రస్తావన

శ్రీ రామాంజనేయము.

వనప్రదేశము.

(యయాతి నృపాలుఁడు ప్రవేశించుచున్నాఁడు)

యయా—ఆహా! మృగయావినోదమున నలసుండనైన నాకీ నిరంతరతరంగితపరిమళ పరంపరలు స్వాగతం బొసంగుచున్నట్లున్నవి. ఏమీ! మలయమారుతపోత సంస్పర్శము వలన నామోదము పరవశంబగుచున్నది

ఉ. ఎల్లెడ వల్లికాంచుఁ బ్రవ ♦ హించు మకరంద ము లానియాని సం
స్ఫుల్లములైన యానముల ♦ పొంతఁ గసించి వసించి మెల్లనన్
వల్లుల వల్లిబిల్లుల నొ ♦ వర్రి యొనర్చి విలాసమొప్ప న
ల్లల్లన వీచుచున్నయవి ♦ హా! యనఁ జల్లని పిల్లతెమ్మెరల్.

(ముందుఁ జూచి) ఇది సరయూమహానది. ఆహా! నా భాగ్యమేమో? యున్నదితీరమున మహర్షిరాకృతపుణ్యవశంబున మునిపుంగవులు నాకుఁ బ్రసన్నులైనట్లు కన్పట్టుచున్నది. ఇదిగో నిప్పుడే నే నమ్మునిపుంగవుల దర్శించి తదాగ్రవచనపాత్రుండ నయ్యెద (కుడికన్ను దరుగాని) కటకటా! యేమిది!! యెడమ కన్నదరుచున్నయది. ఏమైనను నేమిచేయఁగలము. అమంగళము ప్రశమించుఁగాక (పరిక్రమించి) ఆహా! యీ ఋషిచంద్రుల దర్శనమువలన నిప్పుడుగదా నాజన్మము కృతార్థమైనది. (దోసిలొగ్గి)

శా. భూనాధుండను రామచంద్ర చరణా ♦ భోజ ద్వయాచంచల
ధ్యాన ప్రాభవుఁడన్ భవాదృశ మునీం ♦ ద్రాశీః ప్రభావాప్త వి
జ్ఞానాఢ్యుండ యయాతినామకుఁడ యం ♦ ప్రత్యుత్థితుండనే నను
ష్ఠానస్థాతకు నీకు మ్రొక్కెద నహో ♦ ప్రా! బ్రహ్మవంశాగ్రణీ!

వసి—దీర్ఘాయుష్మాన్ భవ.

యయా—(ప్రక్కకుఁ దిరిగి) నూతన స్వర్గ నిర్మాణ సంవిధాన సముజ్జృంభిత ప్రతిష్ఠా గరిష్ఠుండగు నీ విశ్వామిత్ర మహర్షి పాదారవింద సంస్పర్శమున నింక నా మస్తకము ప్రశస్తము కావలయు. (పరిక్రమించి)

మ. అనయంబున్ రఘురామ మంత్ర జప వి ♦ న్యాసంబులన్ జిత్తమం
దున భావించుచుఁ గాలముం గడపుచున్ ♦ యుష్మత్పదాంభోజ సే

ననకు జీవనమంచు నొసంగిన మహీ ♦ పాలుండు శిష్యుండు నీం
డనఘా ! నీకు యయాతి లోకంబిచ్చెను వి ♦ శ్వామిత్రమౌనీశ్వరా !

విశ్వా—ఋషిమాత్రులమగు మా నమస్కారముల కేమి ? మిగిలిన బ్రహ్మ
వంశాగ్రణుల కందఱకు నమస్కరించి రమ్ము.

యయా—నాయందేమియైనఁ దప్పులున్న యెడ శిష్యవాత్సల్యమున క్షమింపవలయుఁ
గాని మీరిట్లాడఁ జనదు మహాత్మా !

విశ్వా—రాజా ! నీయందుఁ దప్పులున్నను మేము క్షమించుట కంతటివారము.

యయా—మునీంద్రా ! యెంతమాట యెంతమాట ! !

ఉ. భూరమణుల్ త్రిశంకుని స ♦ మున్నత లోకము నొక్కఁ జేయఁగా
వేరొక స్వర్గ మేర్పఱుచు ♦ వేళ విధిప్రముఖుల్ చలించి గం
భీరముగా నుతింప విర ♦ మించితి నట్టి విచిత్ర శక్తులన్
మీఱిన మిమ్ము బోఁటి మహ ♦ నీయుల కిట్టులఁ బల్కఁ జెల్లునే ?

విశ్వా—(కోపముతో) అట్టి నాయసమానశక్తు లన్నియుం దెలిసియేనా ? యిట్టి
యపచారములకు సమకట్టితివి గర్వాంధా !

హరి—(స్వగతము) ఆబ్బబ్బా ! మరల నొక్కటి కిట్టి వివాదము కల్గానందములో
శక్తికలకాలము సంప్రాప్తించినది. నాకు నిజమతమునా నాధికర్త్రము
లెట్లుండెనను మంటికలపోయరముం బెంచి దీని ఫలంబు లాగించు దనుక
ప్రాణములు నిలుచునట్లు లేవు. కానిమ్ము కొంతఁ జూచి పైన నాలోచించెద.

యయా—(స్వ) దైవమా ! విషమకాలమానందము కలిచి యాయాయు విపరీతము గు
నటు కిదియేనా కారణము. కటకటా ! యీమునికోపమునకంతమునొక్కక్క
మెట్టె కల్గుచున్నది. యిమ్మహానీయుఁడేమి చేయుఁ దలంచినఁ జేయలేఁడు ?

చ. కులమె నశించునో ? యతని ♦ కోప దవానల దీప్తిచే మహా
జ్వలనమె పుట్టునో ? భువన ♦ వర్తనమే చెడునో ? మహోమ కోఁ
గలుగునో ? యెట్టులో నో ? త్రిజ ♦ గంబుల నంతటిపానికైన నీ
యతఁడు శపంబు ప్రభావము ♦ నా యశక్యము గాదు దైవమా !

(ప్రకాశము) దేవా ! మహాయుడనే నేమి యపచారము నొనరించితి ?

విశ్వా—దురాత్మా! నీతప్పు నీకుఁదెలిసియే యున్నది. నాచేత నింకను శ్రేలింప నెంచితివా? జాతిమాత్రమున నీవును నేనును సమానుల మనియే నీ దురహంకారము. లేకున్న నాకుముందేల నమస్కరింపకుందువు. ఛీ! నీ మొంగము చూడ రాదావలకుఁ బొమ్ము.

నార—(స్వ) ఓహో! ఇప్పటికిఁగదా? దైవము నా కనుకూలించినది. ఇప్పుడే యీ విశ్వామిత్రుని క్రోధాగ్ని కింకను నొకటిరెండు సమిధలు తగిలింపవలయు (ఆలోచించి) వలదువలదు సమిధలు లేకుండఁగనే మండుచున్నయది.

యయా—(స్వ) అయ్యో? నే నీ మహానీయుని క్రోధ దవానల జ్వాలలకు శలభంబ నగుదునా యేమి? (ప్ర) స్వామీ!

చ. అతుల తపః ప్రభావ మహిమాతిశయంబున దేశికుండవై
సతతము నిర్జరోత్తముల సన్నుతులం గయికొంచు నిందు న
ద్భుత చరితుండవైన నినుఁ బూజ్యతముం బొడగంటి మదీయ దు
ష్కృత పరిపాక మేమొ? దరిసింపక పోతి ననుగ్రహింపవే.

వసి—రాజా! నీకు వచ్చిన భయము లేదు భయపడకుము.

యయా—బ్రహ్మర్షితిలకమా! మీ యాశీర్వచన మెట్లగునో?

విశ్వా—(స్వ) దురాత్మా! యాతనిఁ బిలిచినట్లు నన్నుఁ బిలుచుటకు నీకు నోరురాదా? (ప్ర) నిన్నాతపోధనమ్మన్యుని యాశీర్వచనము రక్షింపఁగలదు పొమ్ము.

వసి—నాయాశీర్వచనము గాకున్న నీ యాశీర్వచనము రక్షింపఁగలదా?

మ. సతతంబుం రఘురామచంద్ర చరణాబ్జ ద్వంద్వ నిశ్చిత సం
గతచిత్తుండు స్వకీయ పుణ్యపరిపాక ధ్వస్త నిస్తంద్ర దు
ష్కృతజాలుండగు నీయయాతి నెవఁడే నీ యెగ్గు గావించు దు
ర్మతి చేఁ దేఁటి కనుంగొనంగలఁడె? జాల్మా! సిగ్గులేదేమిరా?

విశ్వా—ఛీ! పౌరోహిత్య పక్షపాతము ప్రకటింప వచ్చితివా? నోరుమూయుము.

వసి—దురాత్మా! నోటికి వచ్చినట్లెల్లఁ బ్రేలకుము.

విశ్వా—(కోపముతో) (మత్తకోకిల)

కన్నుఁగానక వాఁగఁబోకుమ బ్రాహ్మణాధమ నింటఁ గా
పొన్నముల్ దిని కండక్రొవ్వున వాడుచుంటివి దుష్టుఁడా!

వసి— నిన్ను నేమన నేర్తు క్షత్రియ * నీతిఁదప్పి విశేషహీ
నోన్నతిన్ జెలరేఁగి యోగ్యమ * యోగ్యమెన్నవు భ్రష్టుఁడా!

విశ్వా—(ఆటోపముతో) (సుగంధి)
పైశునమ్ముతోడ వీనిఁ * బైనఁ బూనికొంచు రా
లేశమైన నీకు బుద్ధి లేదఁటోరి న్యూనుఁడా !

వసి— నాశమొందెదింక నీవు * న్యాయ మెన్న వీ గురా
వేశమేటి కింత దుర్వి * వేక మేల ? హీనుఁడా !

విశ్వా—(సంరంభముతో) (పంచచామర)
చరాచరంబు లడ్డమైన సైఁప నిన్నుఁ జూడరా

వసి—దురాత్మ ! రమ్ము చూతు నింత దుర్వికార మేలరా ?

విశ్వా—పరాభవం బొనర్తు నీకుఁ బల్వురెన్న దుష్టుఁడా !

వసి—నిరాకరింతు నింతఁగొన్న నీ మదంబు భ్రష్టుఁడా !

యయా—దేవా! నాదురదృష్ట మిట్లుండ నాకొఱకు మీ రేల ? కలహించెదరు.

వసి—రాజా !

చ. జలధులు పొంగుఁగాక రవి చంద్రుల పోకడ మాఱుఁగాక తా
రలు ధరణీతలంబు పయిఁ రాలెడుఁగాక మహేమి యైన స
త్యలఘుతరాస్మదీయ వచ నార్భటి తప్పదు గాన నింక నీ
వలమట నొందఁబోకు మన * ఘా ! యెవఁడేమి యొనర్పఁ జూచెడిన్.

యయా—మహాత్మా ! ప్రసాదము

విశ్వా—వీని ప్రసాదమా నిన్ను రక్షించు ననుకొంటివే ?

మ. ఖలుఁడా ! యీతనివాక్కుసార మొకటే * కాదా? నిజమదాంధుఁడై ధరా
తలనాథాధమ నీ క్షణంబున సము ద్యద్రిక్త దృష్టిచ్ఛటా
వలనాభీల మదీయ కోప బహుళ * జ్వాలా కరాళాగ్నిలోఁ
శలభంబుం బొనరింపకున్న నిఁక వి * శ్వామిత్రుఁడన్ గానురా.

యయా—(స్వ) కటకటా !! యీతపోధనుఁడు నిలువునఁ బ్రాణములు తీయునా
యేమి ? సందేహమేల ? ఈ ప్రతిజ్ఞచేఁ ద్రియక మానునా ? (పైనఁజూచి)

శా. భీముండై ఋషిచంద్రుఁ డిట్టు లతిగం * భీర ప్రతిజ్ఞా విధిన్
నేమం బెంచక చేసె నేమి గతి దీ * నిం బాప దిక్కెవ్వఁడీ

భూమిజా నీ శోకహరుఁడు దశ్వ నీక శౌం * పూర్ణానుశా గరంబుకతా
శాకా! భక్తనీనుపరా వరద! రామ రా! నన్నుఁ బాలింపరా!

(పరి) మునిచంద్రా! రక్షింపవే (పాదములపైఁబడుచున్నాఁడు)

విశ్వా—ఛీ ఆవలకుఁ బొమ్ము దురాత్మా! (ముకుటముఁదన్నుచున్నాఁడు)

యయా—హావిధి! యెంతకుఁదెచ్చితివి?

గ. అనిగిన నీకు నేను నెవఁ డైవను లక్ష్యమె? నన్నుఁదన్ని నం
దులకు విచార మింత యూను దోఁవదు కరభూశమైన నా శిర
స్థలమును దాఁకి నీ మృదు పదంబు నపించెనో? నొచ్చెనో? తపో
నిలయ! మహానుభావ! కరుణించి మునీశ్వర! నన్ క్షమింపవే.

విశ్వా—(విననట్లభినయించి పండ్లు గొఱుకుచు) ఓరీ! కులపాంసనా!

ఉ. పలికి లందఱుం గలిసి యేకముగాఁ జనుదెంత్రిగాక
పాలిటి మాటలాడు బుద్ధి బాంధవులుందురుగాక యోరి! భూ
పాల కులాధమా! వినుము పట్టెడి దున్నది యున్న యట్లు
గాలిని నిన్ను భస్మముగఁ జేసెద నన్నెవఁడడ్డగించునో!
ఓహో ఓహో (లేవఁ బోవుచున్నాఁడు)

నార—(లేచి చేయిబట్టికొని) విశ్వామిత్రా! నిరుమానుము పిమ్మట బ్రహ్మాస్త్ర
మేయ నుంకించినక్రీతని పయినా? నీ క్రోధాగ్నిం బ్రజ్వలింపఁ జేయుట.

విశ్వా—నారదా! యిప్పుడడ్డుపెట్టకుము. అట్లనియే యింతవఱకు నాఁగినది. లేకున్న
నా క్రోధాగ్నికిరింద నింకను నీతఁడిట్లుండు నాఁడా?

నార—మహాత్మా! నీవుఁ దెలియని దేమున్నది? శాంతింపుము శాంతింపుము.

వసి—(శాంతముతో) రాజా! నీవింక నీ నగరమున కరుగుము.

యయా—(విచారముతో) (మాలిని)

హా రఘునందన! హా శ్రితచందన హా భవబంధన మోచనా!
హా రమణీయశరీర! పరాత్పర! హా జగదేకవిభూ! యిటులీ
ఘోర విపద్ఘన నీరధిలోఁబడి కొందల మందుచు నుండిననన్
జేరఁగఁదీసి విచారము మాన్పవె నిన్నది నమ్మితి దాశరథీ!

(నిష్క్రమించుచున్నాఁడు)

విశ్వా—నారదా ! చూచితివా ? ఈ భ్రష్టుని గర్వాలాపములు.

నార—(స్వ) వీరి కిద్దఱికిం గూడ బుద్ధి వచ్చునట్లు సమాధానముఁ జెప్ప వలయు.
(ప్ర) శమధనుల మగు మనకు వృథా కలహములతో లాభ మేమి ?

ఉ. కోపము నచ్చునేని ? యిది ♦ కూడదు కూడు నటం చొకింతయుఁ
దోఁపదు క్రిందుమీఁదు లని ♦ తోఁపదు వాచ్య మవాచ్య మేనియుఁ
దోఁపదు పిన్న పెద్ద యని ♦ తోఁపదు గావున నోర్పుతోడ నా
కోపము నాఁపి శాంతిఁ గయి ♦ కొన్న నరుండె నరుండు కౌశికా !

విశ్వా—నీ వీ విషయమున ననుభవజ్ఞుఁడవు గావు.

నార—నిజము నిజము !! కోపానుభవము నీ కున్నంత నాకు లేదు.

విశ్వా—(అమర్షముతో) పరిభవ సమయమునఁ గోపము లేని వాఁడు పురుషుఁడే కాఁడని నా నిశ్చయము. మహాత్ముల తేజము బూది గప్పిన నిప్పు వలె నుండియుఁ బరిభవ సమయమునఁ బ్రళయానలం బగు నని నీవు వినలేదా ?

నార—" బుద్ధేః ఫల మనాగ్రహః " అను న్యాయము నీవు వినలేదా ?

విశ్వా—" పరాక్రమః పరిభవే " అను వాక్యమున కేమి గతి ?

నార—అది జ్ఞాని విషయము గాదు.

విశ్వా—ఎవరి విషయము.

నార—దేహాభిమానము చావని వారి విషయము.

వసి—నారదా ! నాకుఁ గూడఁ దగిన బుద్ధిఁ జెప్పితివి.

నార—మీకుఁ జెప్పుటకు నే నెంత వాఁడను.

విశ్వా—నారదా ! ముందుఁ గలహ భోజనుండవగు నీకు దేహాభిమానము చచ్చినదా?

నార—నా సంగతి మీ కేందుకు ? ముందుఁ గందమూలముల సంగతి చూచుకొందము.

(అందఱు నిష్క్రమింతురు.)

గద్య. శ్రీమత్పరమ పవిత్ర భారద్వాజస గోత్రాపస్తంబసూత్ర యజుశ్శాఖా
పాత్ర సీతారామ పుత్ర కనకాంబా గర్భ శుక్తి ముక్తాఫల
పరమేశ్వర ప్రసాద సముపలబ్ధ ఘటికాశత గ్రంథ
కవన సామ్రాజ్య చిదంబర కవీంద్ర ప్రణీత
శ్రీరామాంజనేయ నాటకము.

ప్రథమాంకము.

శ్రీరామాంజనేయము

ద్వితీయాంకము

విష్కంభము.

(నారద విశ్వామిత్రులు ప్రవేశించుచున్నారు.)

విశ్వా—మిత్రమా నారదా!

మ. గౌనముల్ లేని దురాత్ముఁ డా పశువు సం ♦ కోచింపకారీతిఁ జే
సిన దౌర్మార్గ్యము గాంచికొన్నయెడ ని ♦ స్సీ! కందమూలాదులన్
దిన నోరాడదు పండ నిద్దురయు రా ♦ దే యుండఁ గాలాడ దే
మని నేఁ జెప్పుదు నింక దీనికి నుపా ♦ యం బొందు త్రోవం జూపుమా !

నార—నిజము నిజము మహర్షుల మగు మనబోంట్ల మందఱము నుండఁగా నాతఁ డా వసిష్ఠు నొక్కనినే మొదట గౌరవించుట మనల నందఱ నవమానించినట్లు కాదా ? ఇంతకు ముందు నేనాడిన మాటలన్నియు వసిష్ఠునకు బుద్ధిరావలయు నని గాని నిన్నుద్దేశించి కాదు. దేహధారినగు నాకు మాత్రము దేహాభిమానము లే దనుకొంటివా ?

విశ్వా—(సంతోషముతో) నారదా ! నే నప్పుడే యా నృపాలాధముని నాశము చేయఁ దలంచితిఁ గాని నీ వంతటిలో నా క్రోధాగ్నిం జల్లార్చితివి.

నార—(స్వ) అప్పుడే యా యయాతి నిహతుఁడైనచోఁ గలహ మేమున్నది ? నా కడుపు మంట యెట్లు చల్లారఁ గలదు. (ప్ర) గాధేయా ! యేదియో ? యొక యుపాయముచే నద్దురాత్ముండు శమించు మార్గము చూడవలెఁ గాని యిట్టి స్వల్పసంగతుల కన్నిటికిని దపోధనుల మగు మనము తపోవ్యయము గావింప వచ్చునా ?

విశ్వా—నారదా ! నీవు చెప్పినది యథార్థము నీ మాట శిరమునఁ దాల్చితి. మున్ను నాకిట్టి మహోపదేశము చేయువాఁ డొక్కఁడైనను లేక పోవుటచేత నే

కష్ట పడి నే నార్జించిన తపస్సంతయు రంభాశాపాదులచే భంగము గావించుకొంటి. కాని నేఁడాఖలునకుఁ జేయఁదగిన ప్రతిక్రియ దోఁపకున్నది.

నార — విశ్వామిత్రా ! నీ కట్టి సందేహ మేల ?

చ. అనఘుఁడవై తపోధనుఁడ ♦ వై బహు సృష్టు లయాది కార్యసా
ధనములు గల్గి యున్నఁట స్వ ♦ తంత్రుఁడనౌ నిను బోఁటి సంయమీం
ద్రున కపచారముం జలిపి ♦ ద్రోహి యతండు ధరిత్రి నింకనున్
మనఁ గలఁడే ? విచారమును ♦ మానుము పూనుము తత్ప్రయత్నమున్.

(కర్ణములోఁ జెప్పుచున్నాఁడు)

విశ్వా — సెబాష్ నారదా ! సెబాస్, మంచి యుపాయ మాలోచించితివి. మున్ను నా యాజ్ఞచేఁ దాటకాది మహా రాక్షస వధ గావించిన మా రాముఁ డిప్పుడు మాత్రము నా యాన మీఱునా ? యిన్ని మాట లేల ? నేను పూనుకొనిన కార్య మేది నెఱవేఱదు ?

నార — (స్వ) వీని కిప్పట్ల మిగుల నుత్సాహ మెక్కింపవలయు. దాని వలనం గాని నా యాశయము ఫలింపదు. (ప్ర) విశ్వామిత్రా ! మహాత్ముఁడవు నీ వే కార్యము దలంచిన నెఱవేఱదు ? త్రిశంకునకై మఱి యొక స్వర్గము నిర్మించితివి. హరిశ్చంద్ర మహారాజుచే సైతము నీచ దాస్యముం జేయించితివి. మహా ఘోర తపంబుచే బ్రహ్మర్షి పదంబు సాధించితివి. మఱియు నెన్నియో ? మహా కార్యము లొనరించితివి. నీ వీ కార్యము గూడ నట్లె నెఱవేర్చి మాకును గౌరవము నిలుప వలయుఁ జుమా ? నాకింకను లోక సంచారము ముగియలేదు నే నేగెద.

విశ్వా — నారదా ! తప్పక నేనిప్పుడే యీ కార్యము నిర్వర్తించెద నింక నీవేగుము

నార — విశ్వామిత్రా ! నీ ప్రజ్ఞ యిందులోఁ జూడవలయు.

(నిష్క్రమించుచున్నాఁడు)

విశ్వా — మా రాముఁడు కుశ లవ గీతములో నానందించెడి సమయ మిది. నే నీ తరుణముననే శీఘ్రముగా నచ్చటి కేగవలయు.

(నిష్క్రమించుచున్నాఁడు.)

కొలువుకూటము

(రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు ప్రవేశింతురు.)

రామ—(చెవియొగ్గి) తమ్ముఁడా ! యిక్కడి దీ గానము నా శ్రుతి పుటంబులలో నమృత రసం బొలికించుచున్నయది.

లక్ష్మ—అన్నయ్యా ! యిది కుశలవుల కంఠ స్వరంబుగా వినఁబడుచున్నయది.

రామ—శత్రుఘ్నా ! నీ వేగి త్వరగాఁ గుశలవులఁ దోడ్కొని రమ్ము

శత్రు—చిత్తము (నిష్క్రమించుచున్నాఁడు.)

రామ—ఆహా! మనోహరము మనోహరము.

చ. భ్రమల నడంచు మానస వి ♦ చారముల న్విదళించు నంచిత
ప్రమద సుధా పయోనిధి త ♦ రంగ పరంపరలందు ముంచుఁ బ్రి
క్రమమున రాతి నైన క్షణ ♦ కాలములోఁ గరఁగించు నట్టి గా
నమునకు సాటి యీ జగము ♦ నం గలదే ? తలపోయఁ దమ్ముఁడా!

లక్ష్మ—అన్నా ! నిజము నిజము.

భర—(ప్రక్కఁజూచి) అన్నయ్యా ! కుశలవులతో శత్రుఘ్నుఁడువచ్చుచున్నాఁడు.

(శత్రుఘ్నునితోఁ గుశలవులు ప్రవేశించుచున్నారు.)

కుశలవ—జనకా ! నమస్కారము.

రామ—(ఆలింగనము చేసికొని) ఆహా ! నాకాకింకేమి కావలయు ?

చ. అలఘు ముదమ్మునం గదిసి ♦ యాత్మజులం దొడపైనిఁ జేర్చికొం
చెలమి విలాసముల్ గులుక ♦ నెంతయు ముద్దులు మూట గట్టు న
వ్వులుకుల నాలకించుచు ర ♦ వంతయు వారల ముద్దు బెట్టుకోఁ
గలిగిన భాగ్య మబ్బుటయ ♦ కాదె ? సమస్తము తండ్రి కిద్దరన్.

తనయులారా ! మీ గాన మెంతయు నాకుఁ జెవులపండువయినది.

లక్ష్మ—కుశా ! మీరు పఠించునది యెయ్యది ?

కుశ—అన్నా ! రామాయణమును బఠించుచున్నారము.

రామ—(ఆనందముతో) ఏమీ ? మీ జనకుని చరిత్రమేనా ?

లవ—అవు నవును.

రామ—కుమారులారా! మీ ముద్దుపలుకు లాలించుటకు నాచిత్తము త్వరపడుచున్నది.

కుశలవ— (కవిరాజవిరాజితము)

దశరథుఁ డొకఁడు నృపాలుఁ డయోధ్యపుఁ ♦ దాఁ బ్రభుఁడై తను వారిధికిన్
శశి విధ గాత్రులు సత్య చరిత్రులు ♦ నల్వురు పుత్రులు వారలలోఁ
గుశలుఁడు జ్యేష్ఠుఁడు రాముఁడు వానికిఁ ♦ గూరిమిఁ బట్టము గట్టెడి దు
ర్దశసమయంబునఁ గేకయపుత్రి వ ♦ రద్వయ మీయు మటంచనినన్
గృశహృదయంబున నా విభుఁ డా సుతు ♦ నిన్ వడిఁ బొమ్మనెఁ గాననకున్.

విభీ—పాప మా దశరథుం డేమి చేయఁ గలఁడు ? కైకేయి కెప్పుడో ? వరద్వయ
మిచ్చెద నని వాగ్దానము చేసియుండుట వలన నిప్పుడిట్లు చేయ వలసివచ్చినది.

భర—ఛీ ! నా తల్లి యెంత నిర్భాగ్యురాలు.

రామ—తరువాత తరువాత !

కుశలవ— (మానిని)

అంతట నా రఘు నందనుఁ డా జన ♦ కాజ్ఞకు లోఁబడి కానలకున్
స్వాంతమునందు శోకింతయు దుఃఖము ♦ నందక యేగె మహోత్సుకుఁడై
చెంతను సీతయు లక్ష్మణుఁడు న్నవ ♦ సించి నిరంతరము న్గొలువన్
గొంత సుఖంబుగనే చనెఁ గాలము ♦ కూరిమి మీతిన వారలకున్.

లక్ష్మ—నిజము నిజము.

రామ—తనయులారా! పయిన నేమి యయ్యెను.

కుశలవ— (మత్తకోకిల)

అంతలో నొక మాయ లేడి ర ♦ యమ్మునం గనకాకృతిన్
వింతగా ధరియించి వచ్చిన ♦ నిశ్చలం బగు దృష్టితోఁ
గొంత కాలము జూచి జానకి ♦ కోరె దాని దెమ్మటం
చంతటం జనె దాని వెంటన ♦ యా రఘూత్తముఁ డాసతోన్.

రామ—(శోకముతో) హా ! మాయాకురంగమా ! యెంతఁ జేసితివే ?

లక్ష్మ—(స్వ) అన్నగారికిఁ బూర్వ స్మృతి యెంతయు వచ్చిన యెడ నిఁక నా
దుఃఖమున కంతముండదు. ఈ కథ యింతటితో ముగింపు మందునా ?

రామ—తరువాత తరువాత.

కుశలవ— (ద్విపద)

హా ! లక్ష్మణా ! యంచు ♦ నా పేడి యఱవ
శ్రీ లక్ష్మి వైదేహి ♦ చింతిల్లి కడకు.
ఆ రామచంద్రుఁ డే ♦ మయ్యెనో ? యంచుఁ
బోరాడి సౌమిత్రిఁ ♦ బొమ్మంచుఁ బంచె.

రామ—దుష్కాలము సమీపించినప్పుడు బుద్ధులును మాఱు. అనుకొనిన లాభమేమి?

విభీ—(పైకిఁజూచి) మునీంద్రా! వాల్మీకీ! యంతయుఁ జూచినట్లే రచించితివి కదా? నీ కీ యనన్య సామాన్య సామర్థ్య మెట్లు లభించినది ? యట్లననేల ? తపోధను లెందు సమర్థులు కారు?

భర—విభీషణా ! నీ వనిన మాట సత్యము.

శత్రు—భూతభవిష్య ద్వర్తమాన వేదులగు మహర్షుల కిది యొక విశేషమా ?

రామ—అనంతర మనంతరము.

కుశలవ— (మత్తకోకిల)

భిక్షుకుండయి రావణుం డటు ♦ భీకరాకృతిఁ దాల్చి తా
నాక్షణంబున వచ్చి నిల్చిన ♦ నాతనిం గని సీతయుఁ గ్

రామ—(దిగ్గునలేచి) లక్ష్మణా ! లక్ష్మణా ! ధనువు ధనువు. ఆక్రూరాత్ముని నీ క్షణంబున నుచ్ఛేదించెద.

లక్ష్మ—(స్వ) అయ్యో ! అన్నగారి చిత్తము కలవరపడుచున్నయది (ప్ర) అన్నా ! యేమి యిది ? యిక్కడ రావణుం డెక్కడ నున్నాఁడు ? ఇది భ్రాంతిగాని వేఱొండుకాదు. ఇది వాల్మీకి మహర్షి చెప్పిన కథ కాదా ? వీరు కుశలవులు కారా? వినోదార్థమై మనము వినుచుండ లేదా ?

రామ—అవు నవును. జ్ఞప్తికి వచ్చినది.

భర—అమ్మునీంద్రుఁ డెట్లు చెప్పెనో? యిది ప్రత్యక్షముగా నున్నది గాని కథగాదు

శత్రు—నిజము నిజము.

విభీ—(స్వ) ముందున్నది ముసళ్ళపండుగ యనునట్లీకముందు సందర్భము నాశ్రీరామచంద్రుం డెట్లు సహింప నోపునో? కదా (ఆకాశము వీక్షించి) ఓరీ ! దురాత్మా ! రావణా ! నీవు నాకన్నవు కావురా !

రామ—తరువాత తరువాత.

కుశలవ—పక్షముల్ తెగి పోయి కుందెడుఁ ♦ బక్షి వోలె వసించిరన్

దక్షుఁడై కొనిపోరు నాతఁడ ♦ దాఁగ నా లలనామణిన్.

రామ—హా హతోస్మి (మూర్ఛిల్లుచున్నాఁడు)

లక్ష్మ—కటకటా ! యిది వినోదార్థమై ప్రారంభింపఁబడి చివర కిట్లు పరిణమించినది.

భర—దైవమా ! నా యొడలు పరవశంబగుచున్నయది.

శత్రు—అయ్యో ! నే నింక నిక్కడ నిలువ నోప

విభీ—ఇది యింద్రజాలము కన్న నెక్కువగాఁ గన్పట్టుచున్నది దైవమా !

రామ—(మేలుకొని) తరువాత తరువాత.

లక్ష్మ—(జనాంతికము) కుశలవులారా ! యీకథ నింక శీఘ్రముగా ముగింపుఁడు. శోక భాగ మంతయుఁ ద్రోసివేయుఁడు.

కుశలవ— (పంచచామరము)

బిరానఁ జంపి రావణున్ వి ♦ భీషణాఖ్యు లంకకున్

స్థిరంబుగా. బతిం బొనర్చి ♦ ధీరుఁడై ప్రజల్ నిరం

తరంబుఁ గొల్వ రాఘవుండు ♦ తమ్ము లొప్పఁగా విదే

హ రాజ పుత్రి తోడఁ గూడి ♦ యాది రాజ్య మేలెడున్.

రామ—ఆహా ! తనయులారా ! నాభాగ్యమేమి? (ఆలింగనము చేసికొను చున్నాఁడు)

కుశలవ—నాయనగారూ ! మే మింక నేగవలయు. (నిష్క్రమించుచున్నారు.)

లక్ష్మ—(పరికించి) అన్నయ్యా! యిటెవ్వరో ? వచ్చుచున్నట్లున్నది.

భర—మునీశ్వరుండు వలెఁ గన్పట్టుచున్నది.

శత్రు—నిజమే విస్పష్టముగ మాత్రము తెలియుట లేదు.

విభీ—ఇదిగో నిటే వచ్చుచున్నాఁడు. విశ్వామిత్రమహర్షి

రామ—విశ్వామిత్రమహర్షి యా? ఆహా! మాగురూత్తముఁడింకను నాకేమి శుభంబు లొనఁగూర్ప వచ్చుచున్నాఁడో కదా ధన్యుఁడను.

విశ్వా—(ప్రవేశించి) (స్వ)

గీ. ఎన్నఁడైనను నా యాన ♦ కింత రోసి

దాఁటఁ డీ రామచంద్రుఁడు ♦ నేఁటి పలుకుఁ

గాన నిర్వాదు మాత్ర మా ♦ ఖిలు యయాతిఁ

జంపకుండునె ? సామకా ♦ జ్ఞను వహించి.

రామ—మహర్షిచంద్రా! యీ పీఠము నలంకరింపుము.

విశ్వా—మంచిది నాయనా! (కూర్చుండును)

రామ—సీ. చిరకాల శిష్యుండ ♦ శ్రీరాముఁ డను నేను
మునిసార్వభౌమ! వం ♦ దనము నీకు

లక్ష్మ—లాలనీయ భటుండ ♦ లక్ష్మణుం డను నేను
మునిసార్వభౌమ! వం ♦ దనము నీకు

భర—భవదీయ దాసుండ ♦ భరతాఖ్యుఁ డను నేను
మునిసార్వభౌమ! వం ♦ దనము నీకు

శత్రు—సతతాశ్రిత జనుండ ♦ శత్రుఘ్నుఁ డను నేను
మునిసార్వభౌమ! వం ♦ దనము నీకు

విభీ—గీ. తావకాశ్రిత భట శిష్య ♦ దాసులకును
నేను దాసానుదాసుఁ డ ♦ నైన వాఁడఁ
బేరు మాత్రము చేత వి ♦ భీషణుండఁ
గొనుము మునిసార్వభౌమ! వం ♦ దనము నీకు.

విశ్వా—సర్వేవిభూయాను ర్భవంతో దుష్టశిక్షా ధురంధరాః.

రామ—(స్వ) ఈ యాశీర్వచనముం జూడ నిమ్మునిపుంగవుండు దుష్టనిగ్రహము నుపదేశించు చున్నట్లున్నది. మహాత్మా! రావణాది మహారాక్షస వధచే దుష్టజాతియే నశించిన దనుకొంటి. ఇకా కులమందింకను దురాత్ములున్నారా?

విశ్వా—(దైన్యముతో) దాశరథీ! శూరులగు మీవంటి శిష్య చూడామణు లుండ నాకేమి కొదవ యనుకొంటిఁగాని యిట్లధమాధముని వలన నే నవమాన మొందు కాలము ప్రాప్తించు నని కలలోనైన ననుకొనలేనైతిఁ గదా యేమికాలమహిమము.

రామ—గురూత్తమా! యెంతమాట యెంతమాట? మీకాయవమానము. (కోపముతో) లక్ష్మణా! ధనువిటు తెమ్ము, ఆచండాలుని కంఠనాళము తునియలుగావించెద.

మ. అరరే? మాకు శ్రీమద్బలాతి బల వి* ద్యల్ చేర్చి శస్త్రోపదే
శ రహస్యంబులు విప్పి చెప్పి ఖలులం* జంపించి మా జానకీ
కరముల్ నా కొడఁగూర్చు కౌశికుఁ డిర * స్సాత్కారమే? యీమాట నా
శిరమున్ ద్రుంచిన నట్టు లున్నయది యి * స్సీ! జన్మ మింకేటికిన్?

లక్ష్మ—అన్నా! మునిజనాపచార కారణులగు దురాత్ములింకను మిగిలియున్నారా?

శత్రు—(పైనఁ జూచి) ఓరీ ! ముని జనాపచార కరణ ధురీణా ! నరాధమా ! నీ ప్రాణానిలంబులు గోలుపోవు కాలము సంప్రాప్తించినది మేలుకొనుము.

ఖర—ఆహా ! మేము బ్రతికి యుండియు మా చెవుల సాధు జన నీనాలాపములు విన వలసి వచ్చెనే ?

విభీ—స్వామీ ! మహాత్ముల కపకారముఁ గావించిన దురాత్ముని నామ మేమి ?

విశ్వా—రామభద్రుండు వాని హననమునకుఁ బ్రతిజ్ఞఁ గావించినంగాని చెప్పఁజాల.

రామ—గురూత్తమా ! మీ కీ సందియం బేల ?

చ. విలువఁడె ? భీమ కేశ్వరుని ♦ విల్లను స్త్రీయనకుండఁ దాటకన్
నఱకఁడె ? ఘోర రాక్షస స ♦ ముఖములఁ గూల్చఁడె ? యెట్టివారి సం
గరమున గెల్వఁజాలఁడె ఖ ♦ రుం డని యెంచి వచింప నేల ? నీ
తెలుఁగవె ? రామచంద్రుఁడె పు ♦ నీతుఁడు దేశికు నాజ్ఞ మీఱునే ?

విశ్వా—నాయనా ! యింత వఱకును నీవు నాయాజ్ఞ మీఱిన వాఁడవు గావు.

రామ—గురువరా ! యిఁక ముందును మీ యానతి మీఱఁగల వాఁడను గాను

మ. జగ మెల్లన్ సృజియించి తల్లయమునన్ ♦ సంధింపఁగాఁ గల్గి స్వే
చ్ఛగ నెందున్ విహరించుచున్ జప తప ♦ స్స్వాధ్యాయ సంపన్నులై
తగ సంయోగ విధాన మానసము చే ♦ తం జాల్చు మీబోంట్ల కే
పొగరుంబో తపరాధముం జలిపె సం ♦ పూర్ణమ్ముగాఁ దెల్పవే !

విశ్వా—రామభద్రా ! నిజము నిజము దిక్కులు కృంగినను సముద్రంబు లేకమైనను సూర్య చంద్రులు తొలగిన దప్పినను నీ వాడిన మాట తిరుగ నేరదు. ఇది నే నెఱుంగనా ?

రామ—మునీంద్రా ! మీ యనుగ్రహ మున్న సంశయ మేమి ?

మ. ఘన దర్పోద్ధతుఁ డగుఁ గాక దుర్జయుఁడె యౌఁ ♦ గాక దుర్యోధుఁడౌఁ గాక యిం
క నిమేషంబున వాని సంభ్రమము ద ♦ ర్పం బానటుల్ జేసి కం
దిన నీ చిత్తము నొప్పి దీర్తు భువనా ♦ తీత ప్రభావాఢ్య ని
న్ను నపాయాన్యుని ధిక్కరించిన మదాం ♦ ధుం డెవ్వఁడో ? చెప్పుమా!

శత్రు—ఎంత యపరాధ మెంత యపరాధము !!

శా. అన్నా ! యేటికి నీవు తమ్ములము లే ♦ మా ? మేము యుద్ధంబు సే
య న్నేర్పేమియు లేద ? మాకు నిదికా ♦ ర్యా ? జంకి పోఁబోదుమా

మున్నెన్నఁడిటువంటి దుర్జనుల రూ ♦ పుఁ గానమా ? (మునిం జూచి)
సంయమీ !
యత్నించుం గరిమార్చి వత్తు సెలవి ♦ మ్మా ! సంశయం బేటికిన్ ?

ధర—ఏమీ ? వైపరీత్యము

ఉ. నిన్ను మహానుభావుని గ ♦ ణింపని యీ దురితాత్ముఁబట్టి చం
పన్నిజమైన యుద్యమము ♦ మాకు ఘటించెను దప్ప దింకనున్
ఖిన్నత దోఁప నిట్లు పరి ♦ కించెద వేటికి ? దైన్య మింత మా
యన్న ప్రతిజ్ఞ తథ్య మని ♦ యైన దెలుంగవె ? వానిపుంగవా !

లక్ష్మ—మిన్నకుండెదవేల ? మహాత్మా !

చ. గురువర ! మూఁడు లోకముల ♦ కున్ గురువైన మహానుభావు ని
న్నరయక వండుమై మఱచె ♦ నాతని కంఠముఁ గ్రొత్త నెత్తురుల్
వఱదలు గట్టి యేఱులయి ♦ పాఱ మఱియు కృపాణ ధారచేఁ
దఱిగెద ముక్కముక్కలుగఁ ♦ దక్కలపాంసను పేరుఁ జెప్పవే!

విభీ—స్వామీ ! యూరకొనెదవేమీ ? యిమ్మహాత్ముల ప్రతిజ్ఞ తప్పు ననియా ?

చ. అనఘులు వీరలెల్లరు మ ♦ హాత్ములు దైవము నెంచకుండ ధా
త్రిని నిటువంటి మానవ శ ♦ రీరములన్ ధరియించి సంతతం
బును సుఖ దుఃఖ సంతతులఁ ♦ బొందుచుఁ గ్రిందున నిందు చెందువా
జననము నొందిరో ? యిది వి.♦ చారణ దక్షుఁడ వీ వెఱుంగవే ?

విశ్వా—విభీషణా ! నాసంశయ మిప్పటికిఁ దీఱినది.

రామ—దేశికోత్తమా ! మదీయ ఖడ్గం బక్కలపాంసను కంఠ నాళంబున కెదురఁ జూచుచున్నయది. యింకను సంశయ మేల ? (పంచచామర)

కరాళ ధార చేత నొప్పు ♦ ఖడ్గమున్ ధరించి నే
చిరానఁ బోయి వాని శక్తి ♦ పీల్చి పిప్పి జేసెదన్
గురూత్తముం దిరస్కరించు ♦ క్రూరుఁ డెవ్వఁడో? వసుం
ధరాస్థలిన్ వచింపుమా వి ♦ నన్ మునీంద్రచంద్రమా !

శా ౨—రామచంద్రా! నీభక్తి కెంతయు సంతసించితి.

కం. కులము చెడఁ బుట్టినాఁడా
ఖలుఁడు నృపాలాధముండు ♦ గర్వాంధుం డీ
యిల

రామ—(ఆవేగముతో) వాని పేరు చెప్పవె ?

విశ్వా—అలఘు చరిత్రా ! యయాతి * యను వాఁడు సుమీ ?

రామ—మహాత్మా ! యేమేమి ? యయాతి యన నెవ్వఁడాతఁడు?

విశ్వా—రామభక్తుండ నని విఱ్ఱవీఁగుచుండు నా యినకులపాంసను నెఱుంగవా ?

రామ—దైవమా ! యేమీయన్యాయము (పైనఁజూచి)

మ. ఔరటా ? యే మహరాగముం జలిపితో ? * యయోధ్యా? వృథా చిత్తమే
వికలత్వంబును బొందెనో ? మతిలోన * వ్వేళా విశేషంబు లె
ట్టి కఠోరాగ్రి ముహూర్త యుక్తములొ? తం * డ్రి! యెవ్వడే నిట్లనీ
వు కలంకంబగు కార్యముం జలిపినా * వో ? చిత్ర మేమో కదా ?

లక్ష్మ—స్వామీ ! మిమ్ము నవమానించిన వాఁడు యయాతియా ? ఆశ్చర్య మాశ్చర్యము.

భర—తాపసేంద్రా ! యయాతియే యపచార మొనరించెనా ? యెంతవింత ! !

శత్రు—ఋషిపుంగవా ? నా చిత్తము డోలాయమానం బగుచున్నయది.

విశ్వా—(స్వ) వీరందఱు నద్దురాత్ముని యందుఁ గల పక్షపాత బుద్ధిచే నిట్లు పలుకుచున్నారు కానిమ్ము. వీరు చేసిన ప్రతిజ్ఞలు మన చేతిలోఁ జిక్కియున్నవి కదా. యింక నా కార్యమునకు వచ్చిన భయము లేదు.

విభీ—దేవా ! శ్రీరామచంద్రపాదారవిందధ్యానజీవనుండగు యయాతి రాజేంద్రుండు

విశ్వా—ఛీ ! ఛీ ! దురాత్మునింద్రపదంబు నొందించుచున్నావు నీచాత్మా !

విభీ— (అవలకేగుచున్నాఁడు)

విశ్వా—(స్వ) నే నద్దురాత్ముని నామము వెల్లడించని యప్పుడుండిన యుత్సాహము లో వీరికిప్పట్లు వీస మయినం గానరాదు. యింక నెవరెట్లుండిన మనకేమి? మన పని చక్కఁ బడుటయే కదా ? మనకుఁ బ్రధానము. అది వీరికిఁ జేయక తప్పదు. ఇంక నే నిచ్చట నుండఁగూడదు (ప్ర) రామచంద్రా ? కాల మతిక్రమించుచున్నయది. యింక నే నేగెద. నీ ప్రతిన మాత్రము శీఘ్రముగా నెఱవేర్చుకొనుము.

రామ—మహాత్మా ! యాతఁడు మిమ్ము నవమానించుటకుఁ గతం బేమి ?

విశ్వా — రామభద్రా ! యింక నే నిచ్చట క్షణమాత్రమును నుండుటకు వీలు లేదు. సంధ్యావందన వేళయైనది. మరల వచ్చెద. ముందుఁ బ్రతిజ్ఞా పరిపాలన సాధనముం జూడుము. (నిష్క్రమించుచున్నాఁడు)

రామ — (దైన్యముతో) లక్ష్మణా ! యింక ముందు మనము చేయవలసిన కర్జమేమి ?

లక్ష్మ — నా కేమియును దోఁచకున్నయది.

విభీ — (స్వ) ఈ విశ్వామిత్రుఁ జేసిన పని నా ప్రాణము లిప్పుడిప్పుడే కుదురు పడుచున్నవి. (ప్ర) శ్రీరామచంద్రా ! యమ్మునీంద్రుఁ డిచ్చటికి వచ్చినది మొదలుకొనియు నా మనం బేదియో ? యుపద్రవము నాలోచించుచున్నది.

భర — దైవమా ! యీ ప్రతిజ్ఞలు మాపాలిటికిఁ గూడ దాపరించినవి? భక్తాగ్రగణ్యుం డగు నా యయాతిని మాయన్నగారు గాని మేము గాని యెట్లు చంపుటకు సంసిద్ధుల మగుదుము. అన్నా ! ఎంతకష్టము ! ఎంతకష్టము ! మా యన్నగారు కడకుఁ దన ప్రాణ వియోగంబైన సహించుఁగాని భక్తుల యపాయంబు సహింపఁ జాలఁడు. కదా ! యీ ప్రతిన యిఁక నెట్లు నెఱవేఱఁగలదో ? నాకు గోచరింపకున్నయది.

రామ — (ఆకాశము నవలక్షించి) ఓ భక్తాగ్రేసరా వత్సా ! యయాతి !

సీ. ప్రహ్లాదు ననుఁ గూర్చి ♦ మృదు భాషణము దక్క
దురుసుగా మాటాడి ♦ యెఱుఁగ వీవు
మామకాలయ మహా ♦ ధామమ్ములకుఁ దక్క
నన్య భూముల కెప్పు ♦ డరుగ వీవు
సతత మస్మన్నామ ♦ సంకీర్తనము దక్క
నితర మానవుల పే ♦ రెత్త వీవు
అపమాన మన్నతా ♦ నుసరణంబును దక్క
దుర్మృత స్థానంబుఁ ♦ ద్రొక్క వీవు

గీ. ఎలమి నా పాద పంకజ ♦ ములను దక్క
సాగ మని యెచ్చు పదమును ♦ గోర వీవు
ఇట్టి వానికి నీ కాము ♦ నిందు ద్రోడ
హా ! కలహ మేల ? కర్తనో ♦ యా ! కుమార !

శా. రామా ! రామ ! యటంచు సంతతము మే ♦ గన్నాలు సద్భక్తి నా
నామం బే జపియించుచుందువు గదా ♦ నా తండ్రి ! నిన్నిట్టులం
జేరిమ నీవిడి వధింతు నిర్దయుఁడనై ♦ వీక్షించుచింతేల ? యిం
కేమైనన్ విధి వ్రాఁత తప్పదు సుమా ♦ శ్రీ ! భక్తచూడామణీ !

శత్రు—అన్నయ్యా ! ధీరోదాత్తుండవగు నీ విట్లు విచారపడుట యెంతమాత్రము సమంజసము కాదు. ఎప్పటికేది ప్రాప్తింపవలెనో ? యది తప్పదు.

రామ—తండ్రీ ! నిశ్చయమే. కాని

చ. అనఘుఁడు సత్యశీలుఁడు మ ♦ హాత్ముఁడు భక్తవరుండు నీతివ
ర్తనుఁడు గుణాకరుండు సత ♦ త ప్రియవాక్యుఁడు ముఖ్యబంధు వా
ఘనుని యయాతి భూపతి న ♦ కారణ రీతిని నిర్దయుండనై
చనువున నొద్దఁ జేర్చుకొని ♦ చంపను జేతులు రావు తమ్ముడా !

విభీ—(స్వ) అబ్బబ్బా ! యీ రామచంద్రునకు భక్తులయందుఁగల ప్రేమాతిరేక మింతింత యని వాక్రుచ్చుట కలవి గాదు. (ప్ర) హా కైవల్య! యయాతీ !

చ. చల మతి లేని వాఁడ వప ♦ చారముఁ జేయని వాఁడ వెన్నఁడే
కులమునవైన భక్తజన ♦ కోటుల లోపల మేటి విట్టి నీ
వలనుఁడవై ముకుందునెడ ♦ నాఁగక యీవిధిఁ దప్పుఁ జేసితో ?
తెలియదు గాని యీ పయినిఁ ♦ దేల్చునొ ముంచునో? దైవ మక్కటా

లక్ష్మ—హా దైవమా?

ఉ. రామ పదాంబుజన్మముల ♦ రాత్రిఁ బవళ్ళను మానసంబునం
దేమరకున్నట్టి వాఁడు ఘన ♦ శేఖర చంద్రుఁడు ధర్మవర్ధనుం
డా మహనీయ వర్తను య ♦ యాతిని జంపను సేతులాడ విం
కేమనుకొన్న నేమి ఫల ♦ మీ ముని యెక్కడ దాపరించెనో ?

నర— (ఆకాశముఁ బరీక్షించి) అకటకటా?

చ. ఎవఁడు నుతించునో విన్నుఁ బగుఁ గ డెవ్వఁడు దైవముగా గణించునో యె
రెవఁడు గుణాలవాలుని గణించునొ యెవ్వఁడు సత్స్వభావుఁగాఁ
దలిచి నుతించునో నీ యెడలం దప్పులు దక్క మంచి మేమి గల్గునో ?
యకటా యిట్టి మంచి వారలకు నాయువు నీయని దుష్ట దైవమా !

శత్రు—దైవమా! యేమి యీ మాయ?

గీ. శాశ్వతునకు మేలు * గావింప మా యన్న
యెంచి ప్రీతిని సేయ * నిట్టు లయ్యెఁ
దా నొకండు దలఁప * దైవ మొకండు దలఁచు
ననెడు మాట సత్య * మయ్యె నేఁడు

రామ—(దుఃఖముతో) అయ్యయో? యెంత పని చేయ వలసి వచ్చినది.

శా. ఏనాఁడైన విధేయతన్ విడిచినా * నే? భక్తి వర్జించినా
నే? న్యాయంబును దప్పినానె? సుజన*ద్వేషంబునుం బూనినా
నే? నన్ మానసమందునన్ మఱచినా * నే? యిట్టి వానిన్ నినున్
హా నే నెట్లు వధింపఁగా వలయు న * న్నా భక్తచూడామణీ!
హా! భక్తలోకాగ్రణీ యయాతీ! (మూర్ఛిల్లుచున్నాఁడు.)

విధి—(శోకముతో) అయ్యయో? యెంతపని యెంతపని!!

చ. అనఘులఁ బ్రోచు వాఁడు గుణ * శాంతి నాదలఁ దాల్చువాఁడు పా
వన గుణ శాలులైన నిజ * భక్తులఁ బ్రాణ మొకర్తుగా సతం
బును దలఁచువాఁడు పరి * పూర్ణకృపా కలశాంబు రాశి యీ
ఘనుఁడగు రామచంద్రున క * కారణ కష్టము వచ్చె నకటా?

లక్ష్మ—(విచారముతో) దుర్భరము దుర్భరము

శా. అయ్యా! భక్తులయందు నీకుఁ గల ప్రే * మాధిక్య మింతింత యం
చు యే వ్యక్తియున నైనఁ జెప్పుటకు నే * మే కాదు బ్రహ్మాదులే
నోయ్యన్ జాలరు గాని కాల మిది యే * మో? యిట్లు ప్రాప్తించెన
న్నయ్యా! యీభర మెట్లు సైఁపఁగలవ * య్యా! యయ్యయో యియ్యెడన్

శత్రు—అన్నయ్యా!

ఉ. చల్లని గాలి వీచినను * సౌరభ మెల్లెడ నిండి పర్విన
గొల్లున నీ ధ్వనుల్ చెవుల * కున్ ఘన నాదములై చెలంగినన్
బల్లిదుఁ డుత్తముండు గద * నా మయుఁ డీ మహ యన్న యక్కటా
యుల్లన మూర్ఛఁ దేలి యిఁక * నైన నను లేవఁడి దేమి పాపమో?

లక్ష్మ—తమ్ముఁడా! నా కింకఁ గర్తవ్య మేమియును దోఁచకున్నయది.

విభీ—హా ! రామచంద్రా !

చ. ఇనకుల చక్రవర్తివి మ * హేంద్రుని మించిన వాఁడ వీవు నీ
యనుసరణమ్ము కల్మి నన * యమ్ము భయ మ్మొకయింత లేక జీ
వన మొనరింతు నీ చరణ * భక్తుల మమ్ము విచార సాగరం
బు నడుమ ముంచి యివ్విధిని * మార్చిలు టెంతయు నీకు ధర్మమే ?

ధర—దైవమా ! మే మిఁక నుండియు నుండని వారమే.

గీ. ధర్మ మార్గమ్ము నంతయుఁ * దప్పఁ బోవు
సాధు జనులను శిక్షింప * సాహసింప
వాఁడి తప్పవు గురు నాన * వీడఁజాల
వన్న ! యీ కార్య మెట్లు నే * యంగఁ గలవో ?

లక్ష్మ—మన మొకటి యాలోచించిన దైవ మొకటియాలోచించు (రోషముతో)
అన్నా ! రామచంద్రా !

ఉ. ఇన కుల మందుఁ బుట్టి ధర * ణీంద్రుఁడవై నయవేదివై మహా
జ్ఞను జరియించు మువ్వురను * జన్ములు గల్గిన వాఁడ వయ్యు నే
నఘుల నెట్లు జంపఁ గల * నంచుఁ దలంచితివేని ? నీ ప్రతి
జ్ఞను నెఱవేర్ప నా ధనువు * చాలును నిమ్ము విచారమేటికిన్ ?

(కేలుబట్టి లేవఁదీయుచున్నాఁడు.)

రామ—(మేలుకొని) హా భక్తశిఖామణీ ! [illegible]యాతీ !

గీ. ప్రతినఁ జేసితి మొదటఁ దా * పసుని తోడఁ
దప్పఁ ద్రోయుట కింకనా * తరము గాదు
అకట ! నే నేమి సేతు నిం * తకును నీకుఁ
గాల మాసన్న మయ్యెఁ గాఁ * బోలుఁ దండ్రి !

లక్ష్మ—అన్నయ్యా ! వన వాసమున సీతా వియోగ కాలమందు సైతము ధైర్యంబు వలన విసుమంతయుఁ జలింపని నీ వింతమాత్రమున కిట్లధైర్య మొందిన మేలే ?

రామ—తమ్ముఁడా! భక్తవియోగము సీతావియోగముకన్నను నొక్కు- సీతావియోగమున నేల ? తుదకుఁ బ్రాణవియోగము కన్నను నాకు మిన్నయైనదిసుమా.

ధర—నిజము నిజము.

విభీ—అందు కిట నేనే సాక్షిని.

శత్రు—అన్నయ్యా! చింతించిన నిసుమంతయుఁ గార్యము లేదు. ఇఁక నీ విచారమును మాని యుద్ధ సన్నద్ధుల మగుటయే యవశేషము.

విభీ—భక్తవత్సలా! యమారుతిని వధింపక మీ ప్రతిన నెఱవేఱఁ గల యుపాయ మెంతయాలోచించినను మఱి యుండేదియుం గన్పట్టకున్నయది.

భర—విభీషణా! యిది యేమి శక్తి? చేసిన ప్రతిజ్ఞ యెట్లుబోవును. దానికి వేఱుపాయ మేమున్నది?

లక్ష్మ—అన్నయ్యా! యిఁక ధైర్య మవలంబించి యింధనువు గ్రహింపుము.

రామ—గ్రహింపక తప్పునా? తమ్ముఁడ (ధనువుం దిసికొని ధైర్యముతో) (స్వ) సీ! రాక్షిదైన్యమేల? (ప్ర) తమ్ములారా! యిఁక మీరేగి త్వరగా యుద్ధ సన్నాహ మొనరింపుఁడు. విశ్వామిత్రుఁడు వచ్చునెడ మాట దక్కదు.

(భరత లక్ష్మణ శత్రుఘ్నులు నిష్క్రమించుచున్నారు)

రామ—(స్వ) ఇఁక నే వార్త సీత వినంగ్రాచు నెడఁ దా నెంత విలపించునో? నన్నెంత నిందించునో? భక్తులయందు నాకంటెను నా లలనాశిరోమణికిఁ గల కరుణ రస మింత యంత యని వాక్రుచ్చుట కలవికాదు (ప్ర) విభీషణా! నీ వా మిథిలాపట్టణమున కేగి జానకికి నార్త నెఱింగించి త్వరలోఁ దోడ్కొని రమ్ము.

విభీ—చిత్తము. (నిష్క్రమించుచున్నాఁడు.)

రామ—(శోకముతో) ఆహా! నే నెంత కఠిన చిత్తుండను?

చ. ఘనతరమైన దంచుఁ ద్విజ గంబుల ఖ్యాతి వహించినట్టి యా
యినకుల మందుఁ బుట్టి ధర శింప్రపదంబును నొంది భక్త వ
ర్తనము నెఱింగియుం గడకు రాక్షస వృత్తినిఁ బూని దానులా
వనఘులఁ జంపఁబోవు కలు నాత్ముఁడు వీఁడొక రామచంద్రుఁడే?

కటకటా! యింక నాజన్మ మేటికి? (క్రోధముతో) ఛీ! శోకమా! నీవింక నా తొలగుటనొప్పకుము. తిలువ్రసనీ ప్రాణులం దీయుఁవంతకో వమూవమ్చుచున్నది.

మ. ఖలుఁడా! యీగుణరామచంద్రుఁ డిపు డిట్టి కళంకం బొందెనో శ్రోణిపైఁ
గలఁడో? లేఁడో? యటంచు నైన మది శంక జేయ కారీతి ని
స్తుల మాహాత్మ్య తపః ప్రభావ మహితాత్ముండైన మా రేక్షక
గలుపత్వంబున నేమి చేసితివో? యింక గాముకో వేమిరా?

(కరుణతో) క్రోధమా! నన్నేల పిశాచమై పట్టి బాధించెదవు? నా మనవి విని యించుక యావల కేగుము.

సీ॥ కృపకల్మిఁ బూర్ణమౌ ♦ నీ చిత్త మా ఘోర
కృత్య మెట్లంగీక ♦ రించు నొకో?
మంచి ధర్మముల వీ ♦ క్షించు నీ కన్నులా
నీచ కార్యము నెట్లు ♦ చూచు నొకో?
అనఘాత్ములను దాఁక ♦ వెనుదీయు నీ హస్త
యుగ మెట్లు కాఠిన్య ♦ మూను నొకో?
శ్రిత పోషణార్థమై ♦ బ్రతుకు నీ చాపంబు
శ్రిత నాశనం బెట్లు ♦ చేయు నొకో?
గీ॥ అట్టి పని కీ పదంబు లె ♦ ట్లాడు నొకో?
తప్పు సేయంగ బుద్ధి యె ♦ ట్లొప్పు నొకో?
శరణు జొచ్చిన వాని ని ♦ ష్కరుణ వృత్తి
నింతకును బూని యెట్లు ఖం ♦ డింతు నొకో?

హా! హతవిధీ! యిట్టి పని నేటికి నా నెత్తిపైఁ బెట్టితివో?

లక్ష్మ:—(నేపథ్యములో) (స్రగ్ధర.)

వీరావేశంబు లొందెన్ ♦ వివిధ బలము ద ♦ ర్వీకర ప్రోద్ధిత ప్ర
స్ఫారాకార ప్రభాస్వ ♦ త్పటుతర కవచ ♦ ప్రౌఢిమై నుండె సంగ్రా
మారంభ వ్యగ్ర చిత్తుం ♦ డగుచు భవదను ♦ జ్ఞాప్తికై లక్ష్మణుం డ
న్నా! రామా! రమ్ము వేగన్ ♦ నవనవ మగు చిం ♦ తాభరం బేటికింకన్.

రామ:—(చెవియొగ్గి) ఏమీధ్వని? లక్ష్మణుండు యుద్ధ సన్నద్ధుఁడై నన్నుఁ బిలుచుచున్నట్లున్నది. ఇంక నే నేగవలయు. (నిష్క్రమించుచున్నాఁడు.)

గద్య. శ్రీమత్పరమ పవిత్ర భారద్వాజస గోత్రాపస్తంబసూత్ర యజుశ్శాఖా
పాత్ర సీతారామ పుత్ర కనకాంబా గర్భ శుక్తి ముక్తాఫల
పరమేశ్వర ప్రసాద సముపలబ్ధ ఘటికాశత గ్రంథ
రచన సామ్రాజ్య చిదంబర కవీంద్ర ప్రణీత
శ్రీరామాంజనేయ నాటకము.
ద్వితీయాంకము.

శ్రీరామాంజనేయము.

తృతీయాంకము.

విష్కంభము.

[వీణవాయించుచు నారదుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మత్తకోకిల॥ పుట్టినంతనె భోగముల్ గనఁ • బోడు పెట్టిన వానికిన్
జెట్టినంత యటంచు నెందును • నెగ్గలందురు దాని ని
ప్పట్టునం బరికింప నే నతి • భాగ్యవంతుఁడఁ గానిచోఁ
బొట్ట నిండెడి కాల మెట్టులఁ బొల్లివచ్చెడి శ్రీహరీ!

అబ్బబ్బా! యిప్పటికి నా ప్రయత్నము సిద్ధించినదని చెప్ప నొప్పు.

చ॥ ఇలఁ గలహమ్మె లేదనుచు • నెన్ని దినమ్ములొ? మానసమ్మునం
దలఁచి తలంచి మొన్న మొన • దానికి నింధన మేసినాఁడ ముం
గల నది ముట్టె నీపయి సు • ఖంబుగ మండఁగఁ జేసెదన్ మహా
త్ముల పని కెన్నఁడైనఁ దల • పోయఁగ విఘ్నము గల్గ నేర్చునే?

పాప మా విశ్వామిత్రుండు మిగుల నమాయకుఁడు. కోపమును దక్క మఱి యెద్దాని నతండు గుర్తెఱుంగఁడు. కానిచోఁ గలహభోజనుండనగు నాతోడనా? యాతని కాలోచన కానిమ్ము? తగినట్లే యాలోచన చెప్పినాను. కాని, యింతటితో విరమించిన నాతృప్తి దీరదు. శ్రీరామచంద్రుండు తన ప్రతిజ్ఞ నెఱవేర్చుకొనుటకు యుద్ధసన్నద్ధుండగుచున్నాఁడు. పాప మా యనాథుండగు యయాతికి దిక్కెవ్వరు? (ఆకాశముపలక్షించి) ఇదియే తగిన యాలోచన నాకెన్ని దినంబుల నుండియో? యాంజనేయుని ప్రతాపంబు నిశ్శేషంబుగ నవలోకింపవలె నని కౌతూహలం బుద్భవిల్లుచున్నది. నేఁడు గదా దానికిఁ దగిన కాలము సంప్రాప్తించినది. (కుక్షిని జూచి) ఉదరమా! భయపడకుము నీ యదృష్ట

రేఖ చేఁజమవాఁ డెవ్వఁడు ? నీ వింకఁ దిని పాఱవేయఁ గలిగినంత యాహారము సంప్రాప్తించు కాలము దాపరించుచున్నయది.

గీ॥ కలహమే కఱవయ్యెని ♦ కాలమందు
నూటిగాఁ జూడ దొరకె నీ ♦ నాఁటి కొకటి
దీని నింతటఁ బో నీక ♦ పూని వృద్ధి
సేయు భారమ్ము నెత్తిపై ♦ మోయ వలసె.

(ముందుఁజూచి) ఓహో ! విశ్వామిత్రుఁ డిటే వచ్చుచున్నాఁడు.

విశ్వా:—(ప్రవేశించి) నారదా ! నీవు చెప్పిన మంత్రోపదేశము సార్థక మైనది.

నార:—(స్వ) ఇతఁ డింతమాత్రికే మురియుచున్నాఁడు. ముందు రాఁగల ముప్పు తనకు మూడు నను జ్ఞానము లేదు. కాని యెన్ని పరాభవములు ప్రాప్తించినను భరించుకొనఁ గల సామర్థ్యము మాత్ర మీతనికి గొప్పది. ఇది యేమి గొప్ప? ఒక సిగ్గు విడిచినచో మూఁడు లోకముల జయింప వచ్చు నను నీతికి నిదర్శన మగుచున్నది. (ప్ర) మిత్రమా ! నీవు చేసిన ఘనకార్యమునకు నేను మిగుల సంతసించితి. మహర్షి వనిన నీవే మహర్షివి మే మందఱము నిష్ప్రయోజకులము.

విశ్వా:—మిత్రమా ! నన్నేటి కింత శ్లాఘించెదవు ?

నార:—శ్లాఘనీయ మగు నప్పుడు శ్లాఘింప వలదా ?

విశ్వా:—నారదా ! నీ విప్పు డెచ్చటి కేగుచుంటివి ?

నార:—యయాతి సందర్భముఁ గనుంగొన నేగుచుంటి.

విశ్వా:—అట్లైన శీఘ్రముగా నేగవలయు.

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

రా జ మం ది ర ము.

[యయాతి, శాంతిమతి, సుశీల, విశారదులు ప్రవేశింతురు.]

యయా:—ప్రియా ! శాంతిమతీ ! నా పాప పరిపాక మేమని చెప్పఁగలను ?

శాంతి:—ప్రాణేశ్వరా ! యేమిట్లు దీనాలాపంబులు పలెక్రెదవు ?

సుశీ:—జనకా ! యే కతముననో ? మీ మొగము చిన్నవోయి యున్నదే ?

విశా:—నాయనగారూ ! మీ రిట్లు చింతిల్లుటకుఁ గారణమేమి ?

శాంతి:—నాథా !

గీ॥ అమలమైనట్టి సూర్య వం ♦ శమునఁ బుట్టి
డంబు మీఱిన క్షత్రియ ♦ త్వంబు నొంది
జానకీ ప్రాణనాథ ప్రి ♦ పాద గరిమ
వడసియును నీ విటు విచార ♦ పడుట మేలె ?

యయా:—ప్రాణేశ్వరీ !

గీ॥ అమలమైనట్టి సూర్య వం ♦ శ మది యేల ?
డంబు మీఱిన క్షత్రియ ♦ త్వం బిదేల ?
యేమి యుండినఁ గాని యిం ♦ కేమి ? ఫలము
దైవమే మన యెడ దయ ♦ దప్పె నేఁడు.

శాంతి:—ప్రాణనాథా ! యేమిది ? ఎన్నఁడును మీ నోట వినని మాటలు వినవచ్చుచున్నవి. దైవమా ? మనయెడ దయదప్పుట ? యెంతవింత !! భక్తవత్సలుండగు శ్రీరామచంద్రుండు మన పాలిటలేఁడే ? అంతకన్న దైవ మెవ్వరు ?

సుశీ:—అమ్మా ! మాతండ్రి విచారమునకు హేతు విది యని యూహించుచున్నాను.

శాంతి:—కుమారా ! యేమి యది ?

సుశీ:—అమ్మా ! మా జనకుండు సరయూ నదీ తీరమున కేగినప్పుడు విశ్వామిత్రుని యాగ్రహమునకుఁ బాత్రుఁడనైతి నని చెప్పెనుగదా ?

విశా:—అన్నయ్యా ! అదియేనా ? యీ విచారమునకుఁ గారణము.

సుశీ:—తమ్ముఁడా ! యంతకన్న మఱొండేమి కలదు ?

విశా:—అట్లా ? (యయాతినిగాంచి) అయ్యా !

ఆ॥ వె॥ అతఁడు ముని యెంత ? ♦ యాగ్రహంబెంత ?
యంత మాత్ర కింత ♦ చింత యేల ?
చింత లెల్లఁ దీర్చు ♦ శ్రీరామచంద్రుండు
లేఁడె మనకు.

యయా:—వాఁడె ♦ లేఁడు తండ్రి!

సుశీ:—శాంతం పాపం, శాంతం పాపం.

శాంతి:—అమంగళము ప్రతిహతమగుఁ గాక. ప్రాణేశ్వరా! యేమిది ?

యయా:—సతీ! యేమని చెప్పుదు ?

ద్విపద॥ కలఁగంటినే నేఁడు ♦ కమలాయతాక్షీ!
కలలోన రామల ♦ క్ష్మణులు గన్పడిరి.

శాంతి:—ధన్యులము. ధన్యులము.

సుశీ:—(స్వ) దైవమా! పైన నేమగునో ?

విశా:—(స్వ) ఇకపైన నీ విచారమునకుఁ గతం బేమి ?

యయా:—సాధ్వీమణీ!

ద్విపద॥ కనుల మంటలు రాల ♦ ఘన కోప దృష్టి
నను గాంచి మైథిలీ ♦ నాయకుఁ డంత.

శాంతి:—దైవమా! కరుణార్ద్ర హృదయుం డా రామభద్రుం డట్లు గన్పట్టుటకుఁ గతం బేమియో కదా ? ముందేమి కానున్నదో ?

యయా:—రమణీ! పైన వినుము.

ద్విపద॥ నిను శిక్షింతు నో ♦ నీచాత్మ! యనుచు
ఘనశరంబైన ఖ ♦ డ్గంబుఁ బైకెత్తె.

శాంతి:—హా! ప్రాణేశ్వరా! దీనికి ఫలం బేమియో కదా ?

సుశీ:—అమ్మా! మీ రిట్లు దుఃఖించుట భావ్యము కాదు. భగవంతుండు నమ్మిన వారి నెప్పటికైనను జెఱచునా ?

విశా:—జనకా! యేటికీ విచారము ? ఎన్నఁడైనను గల నిజ మగునా ?

యయా:—(చెవియొగ్గి) ఎక్కడి దీ గానము ?

సుశీ:—(చూచి) జనకా! అదిగో వీణ మీటికొనుచు నెవ్వరో ? వచ్చుచున్నారు.

యయా:—అట్లైన నారదమహర్షియై యుండవచ్చు నమ్మహానీయుండే కదా

విశ్వామిత్రుని యాగ్రహముం జల్లార్చి నాప్రాణములు దక్కించినాఁడు కీడులో మేలను నట్లిప్పు డామ్ముని దర్శనము నా కెంతయు శ్రేయస్కరము.

నార:—(ప్రవేశించి) (పంచచామరము.)

హరీ! రమాపతీ! యటంచు ♦ నాత్మ నెంచుచుఁ నిరం
తరంబు సంస్తుతింప నెట్టి ♦ తత్వ మేనియుఁ గరం
బెఱుంగ వచ్చుఁ గాన నా ప ♦ రేశ్వరుం బరాత్పరుఁ
దిరంబుగా స్మరించుచుండి ♦ నేను ముక్తి నొందెదఁ.

యయా:—మహర్షివర్యా! యీ పీఠముపై విశ్రమింపుము.

సీ॥ శాంతి సంక్రాంతి వి ♦ శ్రాంత దివ్యాత్మహా
కార! నీకిదె నమ ♦ స్కార మయ్యా!
ఘన యోగ శక్తి సా ♦ ధన దృష్ట సర్వ ప్ర
చార! నీకివియె జో ♦ హారు లయ్యా!
జప తపః ప్రాప్త వి ♦ జ్ఞాన వీక్షిత మహా
ధామ! నీకిదియే ప్ర ♦ ణామ మయ్యా!
సార నిర్ముక్త సం ♦ సార సంతత వీత
గుణ రాగ! నీకివే ♦ ప్రణతు లయ్యా!

శాంతి. గీ॥ మౌనివర! నీకిదే బహు ♦ మాన మయ్యా!
చారు గుణ హార! నీకు స ♦ త్కార మయ్యా!

సుశీ:— అనుపమ చరిత్ర! నీకు వం ♦ దనము లయ్యా!

విశా:— నారద మునీంద్ర! నీకు దం ♦ డమ్ము లయ్యా!

నార:—భూయాసుః కుశలినో భవంతః.

యయా:—మునీంద్రా! మీ యాశీర్వచనము ఫలించుఁ గాక.

నార:—ఏమి ఫలించునో? నాకుఁ దోఁచకున్నయది.

యయా:—మహాత్మా! యట్లనెద వేమి?

నార:—రాజోత్తమా! విశ్వామిత్రుండు దురాగ్రహ గ్రహావిష్టుండు, ఇంతకును యుక్తాయుక్త వివేక శూన్యుండు సుమా.

యయా:—ఋషిపుంగవా! యా సంగతి యేదియో చెప్పు మిప్పు డిది యేటికి?

నార:—రాజేంద్రా! దానికే యిది మొదలు.

యయా:—(స్వ) దైవమా! విశ్వామిత్రుం డేమి చేసెనో కదా? (ప్ర) చిత్తము.
నార:—అతఁడు శ్రీరామచంద్రుని కడ కేగి (తలవంచికొనుచున్నాఁడు.)
యయా:—మహనీయా! పైన విన్నదనుక నా ప్రాణములు నిల్చునట్లు లేవు. సెలవిమ్ము
నార:—(స్వ) ఎప్పటికైనను జెప్పకతప్పునా? యీకార్యమును దెల్పుటకే కదా నే నింత ప్రయాసముచే నిచ్చటికి వచ్చినది. (ప్ర) ఇఁక దాఁపనేల? యా శ్రీరామచంద్రునిచే నిన్ను వధింపునట్లు ప్రతిజ్ఞ చేయించినాఁడు.
యయా:—హా! హతోస్మి! (మూర్ఛిల్లుచున్నాఁడు.)
శాంతి:—(దుఃఖముతో) అయ్యయ్యో! యెంత పని యెంత పని!!

మ॥ అకటా! యీ ధర మెట్టు లోర్తు నిఁక నా ♦ థా! నాకు దిక్కెవ్వరే?
సకలోర్వీతలమందు రాముని ప్రతి ♦ జ్ఞన్ బూని తప్పింప నే
రికి శక్యం బగునయ్య! యింతకును నా ♦ ప్రేమమ్ము నా మోహముల్
వికలంబై మదిలోన మ్రగ్గవలసెన్ ♦ సీ! జన్మ మింకేటికిన్?

హా! భాగధేయమా! యెంత చేసితివి. ఓప్రాణేశ్వరా! నీకల నిజమాయెఁగదా? ఓ విశ్వామిత్రా! మా పాలిటికి నీవిక్కడ దాపరమైతివో? మహాత్మా! హా విధీ! యీ యనాథులపై నీకైనను దయలేదా? ఓ కరుణాలవాలా దాశరథీ! నీ వింత కాఠిన్య మూనిన మే మెంతటివారము. తనయులారా! మీ రీ నిర్భాగ్యురాలి కడుపున నేటికి జనించితిరి. నాథా! యింక నీకును నాకును ఋణము తీఱెనదా?

హా హతాస్మి. (మూర్ఛిల్లుచున్నది.)
సుశీ:—తమ్ముఁడా! యింక మనకు దిక్కెవ్వరు?
విశా:—అన్నయ్యా! యింక మనము బ్రతుకుటెట్లు?
సుశీ:—ఓ, శ్రీరామచంద్రా! యీ కూనల ననాథులఁ జేసితివా?
విశా:—అమ్మా! నన్నొద్దికి రమ్మన వేమి?
నార:—బాలకులారా! చింతిల్లకుఁడు. మీకు వచ్చిన భయములేదు. త్వరగా మీ తల్లిదండ్రులను శీతలోపచారములచే సేదదీర్పుఁడు. మరల నేను వచ్చెద.
(నిష్క్రమించుచున్నాఁడు.)
సుశీ:—విశారదా! అమ్మ కుపచారముఁ గావింపుము.
విశా:—అన్నయ్యా! నాయన గారి యొద్దికి నీ వేగుము.

సుశీ:—సీ॥ అయ్య! ముద్దుల కూన ♦ యని లాలన మొనర్చి
 యింపుగా నను గాఁగ ♦ లింప వేమి?
విశా:— అమ్మ! రా రా తండ్రి! ♦ యని పిల్చి ముద్దు నా
 చెక్కిళ్లు గొన నేల ♦ నొక్క వేమి?
సుశీ:— అయ్య! నీ సుతుఁడ నం ♦ దైన భావించి నా
 తోడ నంతయును మా ♦ టాడ వేమి?
విశా:— అమ్మ! నే దిక్కులే ♦ నట్టి వాఁడ నటంచు
 దైనఁ గన్నెత్తి న ♦ న్గాన వేమి?
సుశీ:— గీ॥ అయ్య! నాపైఁ గోప మే ♦ మైనఁ గలదె?
విశా:— అమ్మ! నినుఁ బాడ కింక నే ♦ నాఁగఁ గలనె?
సుశీ:—తమ్ముఁడా! అయ్య లేకున్న నింక దే ♦ హమ్ము లేల!
విశా:—అన్నయ్యా! అమ్మ లేకున్న నింకఁ బ్రా ♦ ణమ్ము లేల?
యయా:—(లేచి) హా! రామచంద్రా! నీయెడ నేనేమి యపరాధ మొనరించితి?
శాంతి:—(మేలుకొని) హా! శ్రీరామచంద్రా! మాయెడ నీకిప్పటికి దయ తప్పెనా?
యయా:—నాకు ముందుగనే దుశ్శకునములైనవి కాని యీ యదృష్ట హీనులగూడ నవి యేటికి నిష్ఫలము లగును? (ఆకాశముపలక్షించి) ఓ విశ్వామిత్రా! యింతకుఁ దెచ్చితివి తెలియక చేసిన తప్పు క్షమింపఁగూడదా? అట్లన నేల? నా పాప పరిపాక మిట్లుండ నీ కా బుద్ధి యేల? పుట్టును.

ఉ॥ అతులిత రామ నామ మన ♦ యంబు జపింపనో! రామ భక్తియే
 హిత మని యెంచనో? యిఁకను ♦ నే మను కొన్నను నేమి లాభ మా
 శ్రితన నన్ లయంబు సలు ♦ పన్ జనియించిన దింతకున్ బురా
 కృత మగు పాపకర్మ మది ♦ యెట్టిదొ? తప్ప దిఁకేమి? సేయుదున్.

ప్రాణేశ్వరీ! యింక నాపైని నీవాస వదలుకొని యీకూనల బ్రతికించుకొనుము.
శాంతి:—నాథా!
 సీ॥ ప్రాణేశ్వరుఁడు లేని ♦ పడఁతి జీవన మేల?
యయా:— సుతు లట్టులైనచో ♦ బ్రతుకఁ గలరె?
శాంతి:— బ్రతుకు వారల కిట్టి ♦ పాట్లేల ప్రాప్తించు!
యయా:— ధాత వ్రాసిన వ్రాఁత ♦ తప్పఁ గలదె?

శాంతి:— పాపిష్ఠ దైవమా! ♦ మా పాలఁ బడితివే?
యయా:— దూరస్థ దైవమ్ము ♦ దూరఁ దగునె?
శాంతి:— ఏ కర్మ మీ రీతి ♦ నింతకుఁ దెచ్చెనో?
యయా:— మన పాపకర్మమ్మ ♦ మనల నడఁచె
శాంతి:— గీ॥ ఏమి సేయుదు నే నింక ♦ నెటులఁ బోదుఁ
గూన లీ బిడ్డలను వీడఁ ♦ బూన నెట్లొ?
విశా:— అమ్మ! నీవెంట వత్తు నే ♦ నమ్మ, యమ్మ!
సుశీ:— అయ్యొ! నిను వీఁడలేను నీ ♦ యాన సుమ్ము.

యయా:—అబ్బబ్బా! యీబిడ్డల ముద్దు మాటలాలించు కొలఁదియును నా మనం బంతయు నీరై పోవుచున్నయది హా! దైవమా! (ఆకాశ ముపలక్షించి)

సీ॥ శరణన్న వానిపైఁ ♦ గరుణ సుంతయు లేక
దారుణ భావం బెట్లు ♦ దాల్చినావో?
సతము నిన్ గొల్చు నా ♦ శ్రితునిఁ జంపెద నంచుఁ
బటు చాప మెట్లు చే ♦ పట్టినావో?
దాక్షిణ్యమున సదా ♦ దర్శనీయుని మీఁదఁ
బూర్ణ కోపం బెట్లు ♦ పూనినావో?
యెఱిఁగియు సర్వమ్ము ♦ నిరపరాధుని పైకి
హత్తించి యెట్లు దం ♦ డెత్తినావో?
గీ॥ నిన్ను నిన లాభ మేమి? మా ♦ యన్న! నాకుఁ
గాల మాసన్న మయ్యెఁ గాఁ ♦ బోలు లేని
యెడల నీ కిట్టి తాత్పర్య ♦ మేల కలుగు?
రామ! నిజ భక్త లోక సం ♦ త్రాణ భీమ!

శాంతి:—హా! దైవమా! యీ విపత్సముద్రమునుండి యింకను గట్టెక్కింతువా?

ఉ॥ అంగద? యేమి సేతు? నెటు ♦ లౌనో? మునీశ్వరుఁ డెంతవాఁడో? నీ
శాంగనయైన నా దశర ♦ థాత్మజు కోపము మాపరాదో? నా
తం గలఁగింప నేటికి? ధ ♦ రిత్రిని నింతకుఁ బూర్వమందు నా
మంగళసూత్ర మంతటి శ్రి ♦ యమ్మున నోఁచిన నోము లెట్టివో?

యయా:—కటకటా! యీ తరుణీలలామ దుఃఖము నే నెట్లు చూచి యోర్వఁ
గలను? (ఆకాశ ముపలక్షించి) ఓ మహాత్మా!

మ॥ నిను నేఁ జూడని కారణమ్మునవనో? నా ♦ నిర్భాగ్య దుర్బుద్ధి చే
తనో? యే కర్మము చేతనో? మొదటఁ జెంతన్ నీకు నే మ్రొక్కనే
దను కోపమ్మా పనికిన్ బ్రతిక్రియను జే ♦ యం జేసియున్ బైన నో
య్యన హా! యంతకు నంతఁ జేసితివి? వి ♦ శ్వామిత్ర! మౌనీశ్వరా!

శాంత:—ఓ దేవతలారా! మీ కయినను గరుణ రాదా? ఓ, భూతములారా! మీ
రెక్కడికిఁ బోతిరో? ఓ ప్రభాకరా! నీవైనను చూడవా? ఓ నిశాకరా!
నీ కీ యనాథులపై దయలేదా? మిమ్మన నేల?

చ॥ అనఘుఁడు సత్యశీలుఁడు ని ♦ రంతర ధర్మ పథానువర్తనుం
డిన కుల వర్ధనుండు జగ ♦ దీశ్వర భక్తుఁడు సజ్జనుండు నా
ధనముల మూట నా సుఖని ♦ ధానము నా ముద్దుపెంపుఁ గోట యీ
పెనిమిటి దక్కునే? పరిత ♦ పించిన నిట్టి యభాగ్యురాలికిన్.

ఓ రామచంద్రా!

గీ॥ బహు సముద్రంబులును మహా ♦ పర్వతములు
వృక్షములుఁ బశులును గల్గు ♦ నీ సమస్త
భూమి నొక్క భుజమ్ముపై ♦ మోయు నట్టి
నీకు నా పతి భర మయ్యె ♦ నే? మహాత్మ!

మ॥ నిరతంబు న్నినుఁ దప్ప వేరొకని ధ్యా ♦ నింపండు దుష్టాత్ములన్
బరివర్జించి చరించు సజ్జనుల చెం ♦ తన్ జేరు నశ్రాంతమున్
ధరణీ నాయకుఁ డిట్టి యుత్తముఁడు బా ♦ నాధుండు లేకున్న నో
కరుణాసాగర! రామచంద్ర! యెటు లిం ♦ కన్ నేను జీవించెదన్.

దుఃఖమా! నన్నింక మహాప్రవాహమున ముంచివేయుము. భూతములారా! నన్నిప్పుడే దిగమ్రింగుఁడు. మోహమా! యీ యనాథను ముట్టకుము. తాపమా! యింక నీ యభాగ్యురాలిని దహింపుము. జీవములారా! నన్నింక విడిచిపెట్టుఁడు. దేహమా! యింక నీవు నాకును గడు దూరము. హా! ప్రాణేశ్వరా!

(మూర్ఛిల్లుచున్నది)

యయా:—హా! దైవమా! యింక నేను చేయవలసిన దేమి?

సీ॥ అనయమ్ము భర్తృసే ♦ వనమె జీవనముగా
భావించుచుండు నీ ♦ పరమ సాధ్వి
ప్రాణనాథుని పాద ♦ పద్మమ్ములే సదా
తలపోయుచుండు నీ ♦ తలిరుఁ బోఁడి
కుతుకమ్ముచేఁ బ్రాణ ♦ పతి రాకకై సతం
బెదురు జూచుచునుండు ♦ నీ లతాంగి
ప్రియుని భాషణ మింత ♦ విన్న మాత్రముననే
ప్రమదాబ్ధి మున్గు నీ ♦ పడఁతి మిన్న
గీ॥ దుఃఖమన నెన్నఁ డెఱుఁగ దీ ♦ తోయజాక్షి
యొకఁ డాప్త వియోగంబు ♦ నీ సుశీల
యీ వధూమణికిని నాకు ♦ నింతతోడ
ఋణము తీరెను గాఁబోలు ♦ క్షణములోన.

దైవమా! యింక నేఁ గర్తవ్యాకర్తవ్యంబుల విముగ్ధ చేతస్కుఁడనైతి. నే జేయవలసిన దగు నది యేదియును లేదు. దిక్కులు లేనట్లు కన్పట్టుచున్నయవి. జగమంతయు శూన్యమైనట్లు తోఁచుచున్నయది. హా! కమలాయతాక్షీ!

సీ॥ బోఁటిరో! యని యొక్క ♦ మాటాడుద మటన్న
నింపుగా స్వరము రా ♦ దేమి సేతు?
కరము పై వైచి శో ♦ కమ్మఁ దీర్చెద మన్న
నీ కరం బటులఁ బో ♦ దేమి సేతు?
వసి వాడు మోము నా ♦ రసి చూచెద మటన్న
నీ దృష్టి పైకేగ ♦ దేమి సేతు?
ఇది చూడ లేకటో? ♦ యెగుదెంచెద మన్న
నెటుఁగూడఁ గాలాడ ♦ దేమి సేతు?
గీ॥ అకట! యెట్టి యవస్థ సం ♦ ప్రాప్త మయ్యె
నింతకు నుదుటి వ్రాఁతకు ♦ నెదిరి లేదు
కాన నెటులేఁగియుఁ జింతింపఁ ♦ గడకు వెఱ్ఱి
తనము దప్ప మఱేప్రయో ♦ జనముఁ గలదె?

ముద్దు కూనా విశారదా! నా తొడపై కిటురమ్ము.

విశా:—(తొడమీఁదఁ గూర్చుండును)

యయా:—తండ్రీ! సుశీలా! నా కొక్క ముద్దీయవా?

సుశీ:—(ముద్దిడుచున్నాఁడు.)

యయా:—దైవమా! యీ నిర్భాగ్యునకీ ముద్దుకొమరుల మొగంబులు మూరుకొని ముద్దిడుకొను నంత యదృష్ట ముండునా? నాయనా!

గీ॥ తమ్ముఁడును నీవు రాజ్య భా ♦ రమ్ము దాల్చి
నేను లేనట్టి లోపంబు ♦ లేని యటుల
నేలు కొనఁ జేద్వఁబోకుఁడిం ♦ కేమి ఫలము?
తండ్రి కడ సారి చూపిదే ♦ తనయులార!

(ఆలింగనము చేసికొనుచున్నాఁడు.)

శాంతి:—ఓ ప్రాణేశ్వరా! నీతోడ నేనును వచ్చుచున్నాను. నిలువుము నిలువుము.

(దిగ్గున లేచుచున్నది.)

యయా:—కాంతాశిరోమణీ! కలవర మొందుచుంటివా? మన గతి యంతయుఁ గలవరమే యయినది. హా! దైవమా!

గీ॥ ఏడకేఁబోదు నీ యింతి ♦ నేమి సేతు?
నేడఁ బదరింతు నింక నె ♦ వ్వాఁడు దిక్కు?
నిండు నీటను మున్గు వా ♦ నికిని బోలె
నేది మాటాడుటకు నోరు ♦ రా దిదేమి?

శాంతి:—అక్కటా! దైవమా!

సీ॥ శ్రీరామ నామమే ♦ చింతించు వాని కా
మృగయా మనోరథం ♦ బేల కల్గె?
కలిగెఁబో నాతోడఁ ♦ గలసి యుండెడి వాఁడు
పృథు కాననమ్ముల ♦ కేటి కరిగె?
అరిగెఁబో గంభీర ♦ సరయూ మహా నదీ
తీరమ్ము తా నెట్లు ♦ చేరఁ గల్గె?
చేరెఁబో యతి కోప ♦ శీలుఁడైనట్టి వి
శ్వామిత్రుఁ డెక్కడఁ ♦ బ్రాప్త మయ్యె?

గీ॥ ఇన్నిటికి మా పురాకృత ♦ మిట్టు లుండ
నీ విధముఁ గష్ట వ్యతిరేక ♦ మేల కలుగు ?

యశో:— ప్రాణేశ్వరీ ! నిజము నిజము.

గీ॥ భువిని " కర్మానుసారిణీ ♦ బుద్ధి " యనెడు
న్యాయ మెన్నఁటికైన న ♦ న్యాయ మగునె ?

శాంతి:— తనయులారా ! పసికూనలగు మిమ్మెట్లు నేను సంరక్షణ చేయఁగలను ? దైవమా ! యీ ఘోర మంత్రము నే నెట్లు సైరింపఁగలను ? శ్రీరామచంద్రా ! నీ ఖడ్గము నా కంఠముపై కేసుమాని రానిమ్ము నీకేల యింతటి బుద్ధి పుట్టును ? ఈ యనాథులఁ గాయుమన్న మొఱ్ఱ గదా ;

యశో:— దేవీ !

గీ॥ జంతు సమితికి నెల్లను ♦ జనక మృత్యు
వులు సహోదరు లనుమాట ♦ దెలిసి యుండి
యును విచారించు టిది విహి ♦ తమము గాక
వేరని వచింప వచ్చునే ? ♦ నీరజాక్షి !

మన కెన్ని యాపదలు ప్రాప్తించినను శ్రీరామచంద్రుండే శరణ మనుమాట మాత్రి మెప్పటికిని మఱవకుము. కొమరులారా ! సర్వదా శ్రీరామచంద్రసేవా సక్తులై యాయుష్మంతులగుదురు గాక ! యింక నాకును భగవన్నామ ధ్యానమే కర్తవ్యముగాఁ దోఁచుచున్నది. (పైనఁ జూచి) ఓ భక్తవత్సలా రామచంద్రా !

ఉ॥ శక్తి యొకింత లే దెదియు ♦ సల్పుటకున్ భవదీయ నామ సం
రక్తియె శాశ్వతంబనుచు ♦ మాత్రము నెమ్మది నమ్మి తజ్జపా
సక్తి ననారత మ్మకలు ♦ సత్యముమైఁ జరియించుచుండు నీ
భక్తుని నీట ముంచెదవొ ? ♦ పాలన ముంచెదవో ! దయానిధీ ?

శా॥ ప్రాణమ్ముందున నిన్ను నమ్మితిని రా ♦ వా ? కావవా ? రామచం
ద్రా ! వేఁడేమి యొనర్చి నీవు నపచా ♦ రం బిట్టి పంతంబులన్
నీవే పట్టిన నింక దీనులకుఁ దం ♦ డ్రీ ! దిక్కెవండే ? యెటుల్
బోవన్ బాదను లాడ వింతకును నా ♦ పుణ్యా మ్మదెట్లున్నదో ?

శా॥ ఓ విశ్వాత్మక ! యో కృపా జలనిధీ ! ♦ యో దీన సంరక్షణా !
యో వందారు జనామర క్షితిరుహా ! ♦ యో దైవ చూడామణీ !

దేవా ! నీ చరణాంబుజన్మముల న ♦ క్తిఁ గమ్మిత్తిఁ గాను ది
క్కీవే తప్ప నితఃపరం బెఱుఁగ రా ♦ వే ? కావవే ? శ్రీహరీ !

సీ ! నా లాభమును నే నెఱుంగక విచారపడుచున్నా నెంత వెఱ్ఱివాఁడను?

శా॥ ఆ కళ్యాణ గుణాకరుండగు నయో ♦ ధ్యా నాథు హ స్తంబులో
నీ కంఠం బెపుడేని యూఁగ దగిన నా ♦ కిం కేమి లోపంబు ? శ్రీ
వైకుంఠంబున సర్వ రాజ్య గరిమన్ ♦ బాలించు భాగ్యంబదే
చేకూరు న్గద చింత యేటికిఁక నో ♦ చిత్తంబ ! శాంతింపుమా ?

ఈ సమయమున ముక్తి మార్గ ముపదేశింప నా నారద మహర్షి యైనఁ బ్రాప్తింపఁ డాయెఁ గదా ?

నార:—(పటాక్షేపముగఁ బ్రవేశించి) రాజా ! నీవేల ? చింతించెదవు. నా యుపదేశంబు నీకు యోగ క్షేమ దాయకం బగుఁగాక (కర్ణములోఁ జెప్పి) నీ వింకఁ ద్వరగా నీ కార్యము నెఱవేర్చుకొనుము.

యయా:— దేవా ! మహా ప్రసాదము.

నార:—(స్వ) నా మనోరథ ప్రాప్తి కిదియే నాంది.

గీ॥ ఆంజనేయుండు తా నీ య ♦ యాతి కథయ
దాన మీయక పోవఁ డా ♦ దైని రామ
చంద్రునకు నాతనికి మహా ♦ సంగరంబు
గలుగకుండఁగఁ బోదు నా ♦ కడుపు నిండ.

(నిష్క్రమించుచున్నాఁడు)

యయా:—తనయులారా ! పున్నమచందురునిఁ బోలు మీ మోములఁ గాంచి ముద్దు వెట్టుకొను భాగ్య మున్నదో ? లేదో ! నారదోపదేశంబుచే రామేశ్వరమున కేగి యాంజనేయుని శరణు జొచ్చెద. అతండు రక్షింపఁ గలిగినచో మరల మిమ్ముఁ జూడఁగలుగుదు. లేదేని ? యిదియే కడసారి చూపు. (కౌఁగలించుకొనుచున్నాఁడు.)

శాంతి:—(దుఃఖముతో) హా ! ప్రాణేశ్వరా !

మ॥ నవలా ! యంచు సతీమణీ ! యనుచుఁ గాం ♦ తా ! యంచు బింబాధరీ !
యువతీ ! యంచు నితంబినీ ! యనుచు న ♦ త్యుత్సాహ మేపార నెం

దు విశేషంబగు సానుకూల్యమున నెం ♦ తో శోభిల్లు నవ్వహం
గావలోకించెడి నీ కటాక్షములు క ♦ ట్టా ! యెన్నఁ డింకబ్బునో ?

హ.—సాధ్వీలలామా ! చింతిల్లకుము.

ఉ॥ ఎగురితంబుల స్వగతి ♦ నే నొనరింపక యుండు నేని ? యే
ప్రొద్దును రామ నామ జప ♦ మువ్వొనరించుచు నుండు నేని ! యా
పదల తెల్లఁ బోయి నిర ♦ పాయముగా మరలన్ లతాంగి ! నీ
మగ్గు మొగిమ్ము గాంచఁగల ♦ పుణ్యము నాకు లభింపఁ గల్గెనే.

(నిష్క్రమించుచున్నాఁడు)

సీత — (శోకముతో)

సీ॥ అమల చారిత్రిదీ ♦ నఘ స్వభావాదు నా ప్రాణేశుఁ జూపరే ♦ వానరులార !
శ్రీరామ పాద సం ♦ సేవనా పరుని నా పతిని రక్షింపరే ♦ పాంథులార !
సకల శ్రేణి సం ♦ సక్త మానసుని నా నాథుఁ గాపాడరే ♦ సాధులార !
సౌభాగ్యలీత స ♦ ద్గుణ మహాధాము నా ధవుఁ బాలింపరే ♦ తారలార !
గీ॥ నిరపరాధుని నా మనో ♦ హరుని నొక్క-
సారి వీక్షింపరే సూర్య ♦ చంద్రులార !
యొక్క తల దాఁచు కొనుటకు ♦ దిక్కు లేని
నాకుఁ గతి భిక్షఁ బెట్టరే ♦ లోకులార !

చ॥ అనఘుఁడు రామ పాద భజ ♦ నాధిక శీలుఁడు నా ప్రియుండు నా
తనయులు కూన లొక్క త్రుటిఁ ♦ దండ్రిని జూడక యుండ లేరు నే
ననగను దీనురాల నసు ♦ మాత్రము ధైర్యము లేని దాన ధా
త్రిగ నిక నన్ విపజ్జలధిఁ ♦ ద్రోచ్చిన మించిన నీవె దైవమా !

(అందఱు నిష్క్రమించుచున్నారు)

గద్య. శ్రీమత్సకల సద్గుణ భారద్వాజస గోత్రాపస్తంబసూత్ర యజుశ్శాఖా
పాఠ సీతారామ పుత్త్ర కనకాంబా గర్భ శుక్తి ముక్తాఫల
పరమేశ్వర ప్రసాద సముపలబ్ధ ఘటికాశత గ్రంథ
కవన సామ్రాజ్య చిదంబర కవీంద్ర ప్రణీత
శ్రీరామాంజనేయ నాటకము.

తృతీయాంకము.

జయ జయ జయ

శ్రీ రామాంజనేయము.

చతుర్థాంకము.

రామేశ్వరాలయము.

[ఆంజనేయుఁడు ప్రవేశించుచున్నాఁడు]

ఆంజ:—ఆహా! శ్రీరామచంద్ర నామ ధ్యాన మెంతటి వారికి లభించును? సర్వదా శ్రీరామచంద్రుండు నా హృదయసీమ నెడఁబాయక నాకపరిమితానంద ధైర్య శౌర్యాదుల నిమ్మను నెందునను నాకించుకేనియుం లోపము లేకుండఁగఁ బాలించుచున్నాఁడుగదా! యింతకన్న నాకింకేమి? కావలయు.

ఉ॥ ఓ కరుణాకరా! యనుచు ♦ నో రఘువంశ పయోధిచంద్ర! యం
చో కమలాయతాక్ష! యను ♦ చో నిజ భక్త సురద్రుమా! యటం
చో కలుషాపహార! యను ♦ చో భవ బంధ విమోచనా! యటం
చీ కరణిన్ క్షణంబు జపి ♦ యింప శరీరము పుల్కరించెడిన్.

ప్రచండారాతి మండల విఖండనోద్దండ క్రియాపండితా! నిర్వక్ర విక్రమాక్రమితాఖిల ధారిణీచక్రా! అక్షయ సుఖ లక్షణ ప్రత్యక్ష మోక్ష ప్రదాన దీక్షా పరతంత్రా! దాసామరద్రుమా! రామా! త్వన్నామ స్మరణంబుం గ్రోలి నే నమందానంద కందళిత హృదయారవిందుండనైతి. ఆహా! నాభాగ్యమేమి?

(పంచచామరము.)

సమస్త పాప భేదన ప్ర ♦ శస్త చాతురీ ఘనా!
తమోపహార భాస్కరా! వి ♦ దారితారి తస్కరా!
యమేయ రూప లక్షణా! ద ♦ యా రసార్ద్ర వీక్షణా!
ప్రమోద రక్షితోత్తమా! స్థి ♦ ర క్షమా! రఘూత్తమా!

సుగ్రీ:—(నేపథ్యములో) ఇక్కడనే మనయాంజనేయుం డున్నవాఁడు రమ్మా.

ఆంజ:—ఇదెవ్వరో వచ్చుచున్నట్లున్నది? (చూచి) ఓహో! నా నెచ్చెలులా?

[అంగద సుగ్రీవులు ప్రవేశించుచున్నారు.]

అంగ:—సుగ్రీవా! మన యాంజనేయుం డేమిరయో? చింతన చేయుచున్నట్లున్నదే!

సుగ్రీ:—ఏమి యున్నది? తండ్రికై యాలోచించుచున్నాఁడేమో?

అంగ:—ఆంజనేయా! యేమిరయో? చింతన చేయుచున్నావు?

ఆంజ:—అంగదా! మఱొండు చింతన మేమున్నది?

మ॥ సకలాధారుఁడు వేద వేద్యుఁడు ప్రశ ♦ స్త ప్రాభవాఢ్యుండు మా
మక దైవమ్ము విదారితాఘ జనదం ♦ భ ప్రక్రియా గౌరవుం
డకలంక ప్రథమాన చారితుఁడు బ్ర ♦ హ్మాది స్తుతుం డాశ్రిత
ప్రకరం ప్రోడగు రామచంద్రు నెపుడు ♦ న్భావించుచుండుం గదా!

అంగ:—వాతాత్మజా! యా శ్రీరామచంద్రుని మహాత్మ్యం బప్పుడప్పుడు నీవలన నెంత వినినను తనివి తీఱకున్న యది సుమా?

ఆంజ:—అంగదా! యా భక్తవత్సలుని మహాత్మ్యంబు తనివి దీఱ వచింపుటకు నేను మాత్ర మెంతవాఁడను? అయిన నించుక రయిజేంగించెద.

ఉ॥ జ్ఞానము లేని భక్తియు ర ♦ సంబునకెక్కు వెలిదైన కైతయుం
దానము లేని సంపదయు ♦ ధైర్యము లేని బలంబు మానముం
బ్రాణముఁ జూచి కొందు నెడఁ ♦ బాసెడి మైత్రియు నాడి తప్పఁగాఁ
బూను రసజ్ఞయుం యశము ♦ బొందని జన్మము వ్యర్థముల్ సుమీ.

సుగ్రీ:—నిజము నిజము.

అంగ:—ఐన నించుక రయిజేంగింపుము.

ఆంజ:—కావున నిది చీఁకటిలోనున్నది. ఇది వెలుఁగులోనున్నది యను వివేకంబు లేకుండ సర్వసమ దృష్టి గల విజ్ఞానంబున నెల్లరహస్యంబులు గుర్తెఱింగి, రామతారకము జపియించు నెడల ముక్తి కరతలామలకమై యున్నది సుమా?

యయా:—(తెరలో) ఆర్తావనదీక్షాపరతంత్రా! ఆంజనేయా! రక్షింపుము.

ఆంజ:—ఏమిది? ఆర్తు లెవ్వరో? వచ్చుచున్నట్లున్నది. తద్రక్షణ మవశ్యకర్తవ్యము.

యయా:—(ప్రవేశించి) ఆర్తావనదీక్షాపరతంత్రా! ఆంజనేయా! రక్షింపుము రక్షింపుము. (పాదములపైఁ బడుచున్నాఁడు.)

ఆంజ:—(స్వ) ఆఁ యేమి యిది? శ్రీరామచంద్ర భక్త్యాంజనేయగణ్యుండగు నీ యయాతి రాజేంద్రున కెగ్గొనరింపఁదలంచిన దురాత్ముం డెవ్వఁడో?

కదా (ప్ర) రాజా! శ్రీరామచంద్ర చరణ ప్రసాదిత నిర్వక్ర పరాక్రమ క్రమవిధ్వస్తసమస్తరాక్షసానీకాక్షయ ప్రతాపుండగు నీయాంజనేయుండు నిన్నికే రక్షించుచున్నాఁడు లెమ్ము. (లేవఁ దీయుచున్నాఁడు.)

సుగ్రీ:—యయాతీ! సుఖుఁ జెలికాఁడవై నీవింతగా భయపడవలసిన యవసరమేమి?

యయా:—సుగ్రీవా! యింతమాత్రముననే నా భయము తీఱునది కాదు.

అంగ:—రాజా! నీ కంత భయ మేల? వీరాగ్రేసరుండగు మా యాంజనేయుని ప్రతాపము నీ వెఱుఁగవే?

యయా:—అంగదా! అన్నియు నెఱుఁగుదుఁగాని యిమ్మహోత్కృష్టుం డీ యాపత్సముద్రమునుండి గట్టెక్కింపఁగలఁడో? లేదో? యని నామనంబు డోలాయమానం బగుచున్నది.

ఆంజ:—నెచ్చెలీ! యయాతీ! బహుకాలమునకు నిన్నుఁ గన్నులారఁ గాంచఁ గలిగె నని సంతసించుచుండ నీ దీనాలాపంబులచే నాహృదయంబును గలఁచుచుంటి విదియేమి? నే నుండ నీ కేమిభయము? నీ భీతి హేతువుం జెప్పుము.

యయా:—మహాత్మా! పూర్తిగ నీ వభయ మిచ్చినంగాని నే వచింపఁ జాల.

ఆంజ:—ఇంతకన్న నాకెక్కుడ కార్య మేమున్నది?

చ॥ పొరలెడుఁగాక మీఁదికి స ♦ ముద్రము లన్నియుం దండతోడ సం
గర మొనరింప నాప్రళయ ♦ కాలుఁడు వచ్చెడుఁగాక భూ నభోం
తరములు గ్రుంగుఁగాక యిఁకఁ ♦ దప్పక యిప్పుడె తారకా నిశా
కర రవి వహ్ని సాక్షికము ♦ గా నిను రక్షణ సేతు నెచ్చెలీ!

(చేతిలోఁ జేయి వేయుచున్నాఁడు.)

యయా:—(స్వ) ఇప్పటికి నా పోయిన ప్రాణములు తిరిగి వుదురుపడుచున్న యవి, (అధైర్యముతో) కాని యీతఁ డీ ప్రతిన నెఱవేర్చు కొనఁగలఁడా? యెక్కడిమాట? యా రామచంద్రుం డెక్కడ? యీతఁ డెక్కడ? (ధైర్యముతో) అట్లననేల? నా యదృష్ట రేఖ యెట్లున్నదో? (నిరాశతో) అంతటి పుణ్యమా? శ్రీరామచంద్రుండని చెప్పిన పిదప నీతని ప్రతినయే తిరిగిపోవునేమో? దైవమా! (ఆశతో) యింతకును నా భాగ్య మెట్లున్నదో? (సంకోచముతో) యీ నిర్భాగ్యున కింకను నెక్కడి భాగ్యము? ఆరఘునాథునకు దాసుండైన యీ యాంజనేయుం డాతనితో

పెదిరించి నన్నుఁ గాచునా? యింత దూరము పోనేల? మున్దెఱింగింపఁ గలఁడా? (ఊహతో) ఛీ! యేటికీ పిచ్చిశంకలు? ఆ వసిష్ఠుని యాశీర్వచనము తప్పునా? యా నారదుని యుపదేశము నిరర్థక మగునా? (నిశ్చయముతో) ఆయ్యో! యేమి యీ ధైర్యము? ఆ రామ బాణమునకీ యాశీర్వచనోపదేశము లడ్డుపడునా? యెంత పిచ్చివాఁడను?

అంగ:—అయ్యా! సుగ్రీవా! యిటెవ్వరో వచ్చుచున్నట్లున్నది.

సుగ్రీ:—ఇదిగో మన జాంబవంతుఁడే.

[జాంబవంతుఁడు ప్రవేశించుచున్నాఁడు]

జాంబ:—సుగ్రీవా! మన యాంజనేయుం డుత్సాహోద్రేకమున నున్నాఁ డేమి?

సుగ్రీ:—శరణాగతుండైన యీ యయాతిని రక్షించి యీతని ప్రతిపక్షుల శిక్షింపఁ దలంచి యీతని కభయదాన మిచ్చియున్నాఁడు.

జాంబ:—అంగదా! యింతకు మున్దెప్పుడును మన మారుతి నాలోచింపక యెట్టి ప్రతిజ్ఞయుం జేసి యెఱుంగఁడు. ఇప్పు డీ యయాతి యందుండు వాత్సల్యముం బట్టి విచారింపక చేసిన యీప్రతిజ్ఞ యెట్లుండి యెట్లువచ్చునో?

అంగ:—తాతా! నీకీ యధైర్యమేల? శ్రీరామచంద్ర కరుణాకటాక్ష పాత్రుం డగు మనయాంజనేయున కొకఁడు సాధింపశక్యముగాని పనియుండునా?

యయా:—(స్వ) అదియే నాకు సందియముగాఁ దోఁచుచున్నది.

సుగ్రీ:—మీ రింతింత యాలోచనలు చేయుచున్నారు గాని నాకీ విషయమై యిసుమంతయు నాలోచనయే లేదు. మొట్టమొదటనే నేనీతని కభయమిచ్చితి.

జాంబ:—ఇంకను నాకు వ్యతిరేకముగనే తోఁచుచున్నది.

యయా:—(స్వ) ఈజాంబవంతుండు వయస్సుచే వృద్ధుఁడైనను బుద్ధిచే విదగ్ధుఁడు సుమా? లేకున్న వీరి కందఱకును లేని సందేహము లీతని కెట్లు కలుగు? దైవమా! యీతఁ డీ యాంజనేయునిచే నన్ను విడిచి పెట్టించునా యేమి? ఈతని మతిమూఢ వల్లెపాడఁగట్టుచున్నది. పోనీ యీతఁడట్లు చెప్పనేపో?

ఉ॥ బలిమి మెయిన్ క్షణంబున న ◆ పార సముద్రము దాఁటి లంకలోఁ
పలఁ గల క్రూర రాక్షసులఁ ◆ బట్టి వధార్చి పురంబుఁ గాల్చి యం
దలి వనముల్ పెకల్చి బహు ◆ ధైర్య యుతుండయి వచ్చినట్టి యీ
యలఘు బలుండు మారుతి భ ◆ యంపడి యట్టి ప్రతిజ్ఞ వీడునే?

ఆంజ:—మిత్రమా! నీ ప్రాణమునకు నా ప్రాణ మడ్డు వేసెద. నీకు వచ్చినభయ మిసుమంతయు లేదు. నీ సంగతి యంతయు సవిస్తరముగాఁ జెప్పుము.

యయా:—(స్వ) తప్పక యీతఁడు రక్షింపఁ గలఁడనియే నాకు ధైర్యము వచ్చుచున్నయది. కాని ప్రభు దాసులకు విరుద్ధమగు కలహముం బెట్టి యెట్టి పాపముం గట్టికొందునో కదా? అట్లనవేల? ఇది గురూప దేశము కదా? యింక దీనిలో దోస మేమియుం గలుగ నోపదు. (ప్రకాశము)
ప్రతిజ్ఞా పరిపాలనా ధురంధరా! ఆంజనేయా!

మ॥ ఒకనాఁడేను మదీయ పాప పరిపా ♦ కోద్భూత దుర్బుద్ధిచే
నికటారణ్యములం దృజించి కడుఁ బూ ♦ నిక్కన్ దూరమందొక్క కా
నకు వేఁటాడను వేడ్కచే నరిగి దా ♦ నఁగల్గు నాయాస మా
ర్పక వేగన్ సరయూతటంబునకుఁ జే ♦ రం బోతి విశ్రాంతికై.

ఆంజ:—దీనిలోఁ దప్పేమున్నది?

అంగ:—ఇఁక ముందేమి కాఁగలదో?

జాంబ:—ఆ సరయూ నదీ తీరమున మునీంద్రులుండుట సహజము. వారి యెడ నీతఁడేమైన నపచార మొనరించి యుండునేమో?

యయా:—(స్వ) అన్నా!! యీ జాంబవంతుండు దైవముగాఁ గన్పట్టుచున్నాఁడు.

సుగ్రీ:—యయాతీ! నీకేమి వచ్చినను నేనున్నానులే! పైనఁ జెప్పుము.

ఆంజ:—(హైఁ జిఱ్ఱున) నెచ్చెలీ! యింకను సంశయమేల? తరువాత.

యయా:—(దోసిలొగ్గి) అయ్యా!

మ॥ అటఁగూర్చుండి జపంబుఁ జేసి కొను ధ ♦ న్యాశ్రేణిలో నేను ము
చ్చట దీరన్ మొనటన్ వసిష్ఠునకు ని ♦ చ్చల్ మ్రొక్కి నానందుఁ డా
నటు మీఁదం బటు రోష యుక్తుఁ డయి వి ♦ శ్వామిత్రుఁ డీ నా శిర
స్త్రటముం దన్నుట కాక చేసినది యిం ♦ తా! యంతయా? మారుతీ!

ఆంజ:—ఇది కడు విపర్యయమే.

జాంబ:—మునీంద్రులు సామాన్యులు కారు.

సుగ్రీ:—(స్వ) అన్నా! ఆవిశ్వామిత్రుం డసాధ్యుఁడే నాకీ సంగతి మొదటనే తెలిపి యుండినయెడ వీనికి యభయదానమిత్తునా? కాని యిప్పుడు మాత్రము మిగిలి పోయిన దేమి?

అంగ:—రాజేంద్రా! పైన నేమయ్యె?

[illegible]:— ప్రతిజ్ఞ [illegible] ! [illegible] !

ఉ॥ అంతట రామచంద్రు[illegible] ♦ [illegible]
నింతకు నన్నుఁ జంపునటు ♦ [illegible]
పంతముఁ బూనఁ జేసె నఁట ♦ పై నిదిగో ? [illegible]
డింతటిలోన వచ్చె నఁట ♦ యే మిఁక నీ శరణంబుఁ జొచ్చితిన్.

ఆంజ:— హరిహరీ ! యెంతమాట యెంతమాట !!

యయా:— (స్వ) దైవమా ! యీతఁ డిప్పుడే నన్ను విడిచిపెట్టునా యేమి ?

జాంబ:— ఇదిగో నే ననుకొనినట్లే జరగినది.

అంగ:— అయ్యో ! దైవమా ! శ్రీరామచంద్రునితోనా ? మాకు విరోధము.

సుగ్రీ:— (వడఁకుచు) ఓ యయాతీ ! నీకు నే నభయదాన మీయలేదు సుమా ?

యయా:— (స్వ) దైవమా ! యింక వీరందఱు నిట్లే యనెదరా యేమి ? యింక నాగతి దుర్గతియే యింతకు నాగ్రహాచార మిట్లుండ నెవరేమి చేయఁగలరు?

ఆంజ:— దైవమా ! శ్రీరామచంద్రుం డెక్కడ ? నే నెక్కడ ? ఈకార్య మనివార్య మైనది. నా కేమియు గోచరింపకున్నది.

శా॥ తన్నామస్మరణం బొనర్చుచు సదా ♦ తత్పాదము న్నమ్మి నె
మ్మి న్నిత్యంబు భజించు నాశ్రితుఁడనై ♦ మేలొందితిం గాని నా
కన్నం డైనను నిట్లు స్వప్నమున నే ♦ నీ ? యూహయుం దోఁపలే
ద న్నా ! యెంతటిమాట ? దాశరథితో ♦ నా ? నేను పోరాడుటల్.

యయా:— (స్వ) ఇంక నేను వచ్చిన త్రోవనే పోవచ్చును లేకున్న నీ యుద్యోగం బులందు నా శ్రీరామచంద్రునితో నెవ్వఁడేని యెదిరింప శక్తుఁడగునా ? యింక నీ వట్టి యాస లేటికి ? (పైకఁజూచి) ఓ నారదా ! క్షణకాలమైనను గన్నులారఁ నా బిడ్డలను నా భార్యనుఁ జూచుకొని పోదునని యూ ? యిది యొక యంతరాయముఁ గల్పించి నన్నిచ్చటికిఁ బంపించితివి. మహాత్మా ! నీకును నట్టి కరుణయే పుట్ట వలయునా ?

ఆంజ:— అకటకటా !

సీ॥ సర్వథా స్వ ప్రతి ♦ జ్ఞా నిర్వహణ సాధ
నుండు మా సీతా మ ♦ నోహరుండు
బ్రహ్మాద్రి దేవ సం ♦ భావితామల పాద
పద్ముండు మా భక్త ♦ వత్సలుండు

కిన్నర ప్రముఖ శే ♦ గీయమానామితా
　　ఖ్యానుండు మా యనిలా ♦ త్మాధిపుండు
ఘనతర ధ్వాంత ది ♦ కాంత దివ్యతరప్రభా
　　రత్నాకరుండు మా ♦ రాఘవుండు
గీ॥ అమ్మహా స్వామితోడ నే ♦ నా? వివాద
　　మునకు డీకొను టిది యెంత ♦ మూఢమతియొ ?
　　భక్తుఁడై యుండి స్వామితోఁ ♦ బంతగింపఁ
　　బూనుకొను వాఁడు ధాత్రి నెం ♦ దైనఁ గలఁడె ?

ఆహా! యేమి యీ కాలవైపరీత్యము ? ఈ యయాతి భక్తాగ్రగణ్యుం డని యైనను దలంపక మా శ్రీరామచంద్రుం డెట్లు ప్రతిజ్ఞ జేసెనో కదా ? (యయాతినిఁ జూచి) నెచ్చెలీ ! నీ కిది చెప్పినవా రెవ్వరు ?

యయా:—మారుతాత్మజా ! నారద మహర్షి.

ఆం:—త్రిలోక సంచారి యగు నమ్మునీంద్రునకు గోచరముగాని విషయ ముండదు. ఇది యంతయు నిక్కము. తాతా ! మన కింకఁ గర్తవ్య మేమి ?

జాంబ:—నాయనా మారుతీ ! భగవంతుండగు రామచంద్రునితోఁ బగఁ బూని మనము నిలువఁజాలము. నీ విప్పట్టి వీనిం ద్యజించుటయే యుక్తము.

యయా:—(స్వ) అయ్యో? నాపాలిటికి యీయుపదేశకర్త యొకఁడు దొరకినాఁడు.

అంగ:—ఆంజనేయా ! మనకందఱకును వృద్ధుండును నాలోచనాతత్పరుండును నగు నీజాంబవంతుని మాట శిరంబున దాల్పఁదగినది సుమా ?

యయా:—(స్వ) కటకటా ! మొదట నాకు నిరాతంకముగ నభయదాన మిచ్చిన యీ యంగదుని బుద్ధియును నంతమున కిట్లు పరిణమించినది. కాని యింక నా ప్రాణత్యాగమునకీ యాంజనేయుం డొక్కఁడు మిగిలి యున్నాఁడు. ఈ యవశేషమును దీర్చికొని యేగెదఁగాక. ప్రాణములారా ! త్వరపడకుఁ డింకఁ గొలఁది కాలములోనే మీ యభీష్టము నెఱవేఱఁగలదు.

సుగ్రీ:—మారుతాత్మజా ! యింక నీ వీ ప్రతిజ్ఞ చేయలేదనియే యనుకొనుము. లేనిచో వీని చావట్లుండ ముందు మన చావు సిద్ధమగునట్లు తోఁచుచున్నది.
గీ॥ ప్రాణములు పోవు నప్పుడు ♦ మాన భంగ
　　సమయమున బొంక వచ్చు వి ♦ చారమేల ?

విభీ:—(దోసిలొగ్గి)

గీ॥ శరణుఁ జొచ్చిన వాని ద♦గ్గఱకుఁ బిలిచి
పైన నిటు వీడ వచ్చునే? ♦ వానరేంద్ర!

ఆంజ:—రాజా! చక్కని మాట నాడితివి.

జాంబ:—అధికారము మించిన పనులు దలపెట్ట రాదు.

ఆంజ:—తాతా!

ఉ॥ ఈనియతిన్ వచింప నగునే? తగునే? పగవానికేని నా
ప్రాణ ముకుందు నాశ్రితుని ♦ ప్రాణ మొకండని యెంచినావె?

జాంబ:— .... అ
య్యైన విదేహరాజ తన ♦ యా పతితో నెదిరించి నూత్న స
ఖ్యానము చేసినన్, కులపు ♦ మా తగునో? తగదో? వచించితిన్.

ఆంజ:—ఇవి యెక్కడి సాహసోక్తులు?

జాంబ:—సాహసోక్తు లేమి? తద్దాసుండవగు నీవే ప్రతిజ్ఞ విడచుటకు వెనుదీయు నప్పుడింక నా రామచంద్రుండు తనప్రతిజ్ఞ విడుచునా? పైన యుద్ధము తప్పునా?

ఆంజ:—(స్వ) ఇది నిజముగనే కన్పట్టుచున్నది.

చ॥ అనుపమ శక్తిశాలి మహి ♦ తారకకులాధిప చక్రవర్తి వై
రి నిచయ మర్దనుండు నధ ♦ రీకృత భార్గవ శౌర్యరాశి శూ
ర నతుఁ డమోఘ బాణుఁడు ని ♦ రంతరతావితథ ప్రతిజ్ఞుఁ డా
యనఘుఁడు రామచంద్రుఁ డెపు ♦ డైనను దాను బ్రతిజ్ఞ వీడునే?

(ప్ర) జాంబవంతా! నాకొక యుపాయము దోఁచుచున్నది.

మ॥ శరణంచున్ దల వంచి భక్తి నయ వి ♦ శ్వాసంబు లొప్పారఁ ద
చ్చరణాంభోజ యుగంబుఁ బట్టికొని యో ♦ స్వామీ! కృపాళూ! జగ
ద్భరణాధార! యటంచు నొక్క మొగి సం ♦ ప్రార్థింప నప్పైన నా
కరుణాసాగరుఁడైన రాఘవుఁడు వీఁ ♦ కన్ వీనిఁ గాపాడఁడే?

జాంబ:—ఆంజనేయా! ఏమి యీ వెఱ్ఱి? మహావీరుండగు పురుషుండు మన నమస్కారములకుఁ దనప్రతిజ్ఞా సంవిధానముం బరిత్యజించునని నాకుఁ దోఁపదు.

ఆంజ:—నిజము చెప్పితివి. ఎట్లైనను బ్రతిజ్ఞ వట్టిన తరువాతఁ దన కంఠము పోయినను పురుషుఁడగు వాఁడు ప్రతిజ్ఞ విడువ లేఁడు.

యయా:—(స్వ) ఇప్పట్టి వీరి వాక్యము నాకుఁ గొంత మేలైనది.

జాంబ:—అబ్బబ్బా? యింక నీతఁడిప్పట్టు వదలునట్లు కన్పట్టదేమి కానున్నదో?

ఆంజ:—జాంబవంతా! యింకఁ జింతించిన నినుమంతయుఁ గార్యము లేదు. ఈ యయాతి ప్రాణములతో నాప్రాణములును గలిపి యాశ్రీరామచంద్ర కోపాగ్ని కాహుతియైనం జేసెదఁగాని యీప్రతిజ్ఞ మాత్రము విడువనోప.

జాంబ:—అంగదా! మన యాంజనేయుని నిరుపమాన ప్రతాపము మన మెఱుఁగమా? యిప్పు డీతఁడు తప్పక రామభద్రునితో డీకొనునట్లే తోఁచుచున్నది. ఇఁక నేమైనం గానిమ్ము. మనమిట్లు వెనుదీయుట భావ్యము కాదు. మారుతీ! నీ యిష్టానుసారముగనే మేమును సంసిద్ధులమై యున్నారము.

అంగ:—ఆర్యా! సుగ్రీవా! అన్నిటికిని మనపక్షమం దాంజనేయుం డొక్కఁడు చాలు. ఇంక మనకు వచ్చిన భయము లేదు వాతాత్మజా! మన శక్తుల కొలఁదియు మన మీ కార్యంబు సాధించియే తీరవలయు.

సుగ్రీ:—ఆంజనేయా! నీ విఁక వెనుదీయ వలదు. వారు మన సహాయము లేక యే కార్యము నెఱవేర్చిరి? యట్టి వారితో మనము డీకొని గెలువఁజాలమా?

ఆంజ:—సుగ్రీవా! యిది మన సామర్థ్యమను కొంటివా? భగవత్సామర్థ్యముచేతనే మనకుఁ బేరు రావలసి వచ్చినది గాని మఱొండుగాదు.

సుగ్రీ:—అట్లైనఁ బుట్టినందుకు భగవంతునితోనే పోరాడి జయాపజయంబులలో నేదియో యొకటి యార్జించుటయే పరాక్రమవంతుల లక్షణము. ఇప్పుడే నేను ముందేగుటకు సన్నద్ధుండనై యున్నాను. మీరింక నావెనుక రండు.

యయా:—(స్వ) ఇఁక నేను బ్రతుకు కాలము సంప్రాప్తించినట్లున్నది.

ఆంజ:—(శోకముతో) సుగ్రీవా!

ఉ॥ ఇద్ధ చరిత్ర! నీ కెచట ♦ నేని జయంబగుఁ దండ్రి! యన్య సం
బద్ధము గాక నీ బలము ♦ వర్ధిలు నంచుఁ గృపా కటాక్ష సం
సిద్ధ వచః ప్రసంగముల ♦ చే నను ముద్దులఁ దేల్చు స్వామితో
యుద్ధము సేయ నా హృదయ ♦ మొప్పదు తప్ప దిఁకేమి సేయుదున్?

(జాంబవంతునిఁ జూచి)

మ॥ చనువొప్ప న్నను నొద్దఁ జేర్చికొని యీ ♦ సామ్రాజ్య మెల్లం ద్వదీ
య నవాసూన భుజ ప్రతాపమున సం ♦ ప్రాప్తించె మా కోయి వం

దన! యెందుక్ గరుణా కటాక్షమున నా ♦ నందించు మా రామచం
ద్రునితో నెట్టు లెదుర్కొనంగఁ జనువాఁ ♦ డన్ జాంబవంతా! యిఁకన్.

అంగదా!

మ॥ అకటా! యెంతటి పాప కర్ముఁడనొ? నే ♦ నా స్వామితోఁ బోరు వె
ట్టికొనంగా సమకట్టుకొంటి నిది తం ♦ డ్రీ! నల్వురున్ విన్నచో
నిఁక నేమేమని నన్నుదూఱెదరొ? యిం ♦ తేగాక మాయమ్మ యా
యకలంకాత్మ చరిత్ర జానకియుఁ గ ♦ ట్టా? యెంత చింతిల్లునో?

(ఆకాశ మూపలక్షించి) కటకటా!

మ॥ గణనాతీత గుణాలవాలుఁడవు రా ♦ కాచంద్ర సంకాశ ల
క్షణ సంయుక్త ముఖాంబుజాతుఁ డవు శ ♦ శ్వద్రామ పాదార్చనా
క్షణ నిర్నిద్ర వివేక చిత్తుఁ డవు నా ♦ సైదోడు వో తండ్రి! ల
క్ష్మణుఁడా! నీవును నేను నెట్టు లిఁక సం ♦ గ్రామంబు గావింతువో?

(క్రోధముతో) శోకమా! నీ విఁక నా కడ నుండకుము.

సీ॥ చిత్తమా! దుష్కృతా ♦ యత్తమై యీ మహా
ద్రోహంబు నీ వెట్టు ♦ లొప్పినావె?
చేతులారా! రామ ♦ సేవ వర్జించి యీ
పోరుకై మీ రెట్లు ♦ పూనినారె?
శాంతమా! క్రోధ సం ♦ క్రాంత మై యీ రీతిఁ
బంతంబు నీ వెట్లు ♦ పట్టినావె?
జ్ఞానమా! కలి పీడ్య ♦ మానమై యిప్పట్ల
నాఁగ కీ వెచ్చోటి ♦ కేగినావె?

గీ॥ ఊర్వరా! నీవు శూన్యత్వ ♦ మొందినావె?
యాకసమ! నీవు నెందైన ♦ నణఁగినావె?
కూళ దెసలార! మీ రెద్దె ♦ క్రుంగినారె?
యేమి సేయుదు నింక హా! ♦ రామచంద్ర!

(మూర్ఛిల్లు చున్నాఁడు.)

మయా:—హా! దైవమా!

మ॥ కలుషాత్ముండను పాపకర్ముఁడను నా ♦ కష్టంబు లట్లుండ ని
ట్టుల నీ మారుతి నూతి కుమ్మలిక పా ♦ టుం గల్గఁగాఁ జేసినా

నిలుపై నే నిఁక నున్న నూడినను నే ◆ మీ ? యింత మాత్రాన నే
యాలుకం బోదునె ? పాపజాతికిఁ జిరా ◆ యువ్యంబు గాదే ? ధరన్.

జాంబ:— అంగదా! యిఁక నేమిగతి? మన యాంజనేయుండు శ్రీరామచంద్రునితో
నెదిరింప సాహసింప నోపఁడు.

సుగ్రీ:— తాతా ! ప్రతినయు వీడ నోపఁడుగదా ?

అంగ:— తాతా! యిప్పుడెట్లైనను నీయుద్ధము తప్పునుపాయం బాలోచింపవలయు.

సుగ్రీ:— ఈయయాతిని విడిచినచోఁ దప్పు. ఇంతకన్న మఱొండుపాయ మేమున్నది?

యయా:— (స్వ) ఈ యాంజనేయుం డుండుట వలన నే నిచ్చట నింత కాలమైనఁ
బ్రాణములతో నుంటిఁ గాని వీరేగైనచో నా గతి యేమయ్యెడిదో ?

జాంబ:— నా కిట్లు తోఁచుచున్నది.

మ॥ తనకంటెన్ బలశాలులైన యెడ యు ◆ ద్ధం బెన్నఁడుం జేయ రా
దనహూ ! వైరులతోడ మానవలె లే ◆ దా ? పైకి నా రేగుచుం
చినచో సంధి నొనర్పఁగావలయు నొ ◆ చ్చెం జేముగన్ దీనిచే
మనకున్ లోకము వారికెల్లరకు శ్రే ◆ యం బబ్బునో యంగదా !

సుగ్రీ:— అంగదా ! యీ మాట నిజమే. మన యాంజనేయుంకు ప్రతిష్ఠ పట్టి
నట్లైజెంగిన యెడ నా రాముఁడు దప్పక సంధి కొప్పుకొనియే తీరును.

యయా:— (స్వ) ఈ సుగ్రీవుఁ డేగాలి కా చాప యెత్తుచున్నాఁడు.

అంగ:— తాతా ! యిది బాగుగనే యున్నది.

ఆం:— (మూర్ఛఁదేఱి) హా ! రామా ! హా ! దాశరథీ !

మ॥ అరిసైనన్ శరణన్న మాత్రమున నే ◆ యాలోచన లేక స
త్వర రీతిం దన యొద్దఁ జేర్చికొన్న సం ◆ భావించు నెందేనియున్
గురువై తా నుపదేశమున్ జలిపి కో ◆ రుకుల్ దీర్చు నా స్వామితో
దురముం జేయఁ దలంచి యెట్లు లెదిరిం ◆ తు న్నే నిఁకన్ దైవమా !

అక్కటా ! నాకు జగ మంతయు శూన్యమైనట్లున్నది.

సీ॥ అంతు లేని సముద్ర ◆ మంతయుం గొనగోట
మీటి లక్షింపకే ◆ దాఁటు నాఁడు
జంకు లేకుండ నా ◆ లంకిణిన్ బడవైచి
కచ్చుచే లంకలోఁ ◆ జొచ్చు నాఁడు

చండ వనమ్ములో ♦ నరుడు సీతా దేవి
కిచ్చెనే యుంగరం ♦ బిచ్చె వాఁడు
గుమి గూడి రక్కసుల్ ♦ గమకించి నాతోఁక
కుంచెలో నగ్గి ము ♦ ట్టించు వాఁడు
గీ॥ ఎఁదుకను నా కుపదర్శనం ♦ బింత యేని ?
గలుగకుండఁ గృపార్ద్రవీ ♦ క్షణము కల్గె
నకట ! నన్నుఁ గటాక్షించి ♦ నట్టి తండ్రి
తోడ నెదిరించి యెట్లు మా ♦ టాడు వాఁడ ?

"లలాటలిఖితా రేఖా పరిమార్ష్టుం నశక్యతే" యను నార్యోక్తి యెప్పటికిం దప్పదు.

మ॥ అకలంకంబయి భక్తి మార్గ సులభం ♦ బై నిత్యమై ముక్తి దా
యకమై సర్వ విపద్వినాశన చణం ♦ బై మాన్యమై సన్నుతా
స్తిక లోకార్చితమై జగద్విదితమై ♦ దీపించు నో రామ తా
రక మా ! యెట్టిఁక నా ప్రతిజ్ఞ నెఱవే ♦ ఱం జేసెదో ? యక్కటా ?

అయ్యో ; నే నితికర్తవ్యతా విమూఢచేతస్కుండ నైతిఁ గదా ?

మ॥ ప్రతినన్ వీడెద మన్న నేమి యిది నా ♦ ప్రాణంబులుం బోవుఁగా
కితరత్వంబున నాడి తప్పుటకు నిం ♦ తే నొప్ప దీ చిత్త మే
నతిదైన్యమ్మున నీవిఁ బ్రోవు మని నిన్ ♦ బ్రార్థింప నీ మాత్రి నీ
ప్రతినన్ మాత్రము వీడెదే ? పయినిఁ గ ♦ ర్జం బేమియో ? రాఘవా !

ఆహా ! నే నెంత కృతఘ్నుండను ?

మ॥ అకటా ? నన్ను విశేష భక్తునిఁగ నీ ♦ వాసించుచున్నందుకున్
సకలంబౌ నుపదేశమున్ జరిపి ని ♦ ద్రల్ మాను చున్నందుకున్
బ్రకటంబౌ బల మిచ్చినందుకును ని ♦ ర్భాగ్యుండనై నీకుఁ బ్రా
యక నేఁ జేయు మహోపకార మిది యా ♦ హా ! రామచంద్రా ! ప్రభో !

సుగ:— దేవా ! నే నిప్పుడే గోరక్షునాథుని కడకేగి యెట్లేని సంధి యొనరించి గాని వచ్చెద. ఊరడిల్లు మూరడిల్లుము.

రాజ:— హాయనా ! అంగదా ! యీమాట వినునంత నా కర్ణములలో నమృతధార లొలికించిన ట్లున్నది సుమా ?

అంగ:— జాంబవంతా ! యేమి సెలవు ?

జాంబ:—అంగదా! ఇఁక నాలస్యము చేయ రాదు. త్వరగా నీ వచ్చటి కేగి యీ కార్యము సాధించుకొని రావలయును. మఱియు

చ॥ శరణు రఘూత్తమా! కడు వి ♦ చారము నొందుచు నా యయాతి భూ
వరుఁడు పదంబుపైఁ బడినఁ ♦ ద్వత్పద దాసుఁడు మారుతాత్మజుం
డరయక ముందు వాని కథ ♦ యం బిడి పైన నెఱింగి దుఃఖ సా
గరమున మున్గి యే గతియుఁ ♦ గానఁడు కావు మటంచుఁ జెప్పుమా.

అంగ:—చిత్తము.

జాంబ:—అంగదా! యింకొక మాట యీ జాంబవంతునిదిగాఁ జెప్పుము.

గీ॥ వృద్ధుఁడ నుభయ పక్ష స ♦ మృద్ధిఁ గోరు
వాఁడఁ గాన వచింతు నీ ♦ పాద దాసు
నీ యయాతిని రక్షింపు ♦ మీ మహాత్మ!
యింత కన్న వరంబు మా ♦ కేమి కలదు?

ఆంజ:—అంగదా! మా శ్రీరామచంద్రునితో నే నొకమాట చెప్పవలయును.

సీ॥ రాతిగుండను వన్నె ♦ నాతిఁ జేసిన పాద
సారసమ్ములకు జో ♦ హారు లనుము
జగము లన్నియు వశం ♦ బుగఁ గొన్న మోహనా
కారంబునకు నమ ♦ స్కార మనుము
పరశురాముని భంగ ♦ పఱుపఁ జాలిన మహో
ద్దామమ్మునకు సత్ప్ర ♦ ణామ మనుము
ఆర్తులైన రక్షించు ♦ కరుణా కటాక్ష వీ
క్షణ జాలములకు వం ♦ దనము లనుము

గీ॥ పవన తనయుండు నీ ముఖ్య ♦ భక్తుఁ డనుము
మం దెఱుంగక ప్రతినను ♦ బూనె ననుము
దాసు తప్పులు క్షమియింపఁ ♦ దగిన వనుము
కడకు నీ భక్తుని యయాతిఁ ♦ గావు మనుము.

యయా:—మహాత్మా! అదియే నాకుఁ గావలసినది.

అంగ:—ఇంక నే నేగెద. ఏమి సెలవు?

ఆంజ:—అంగదా! మా లక్ష్మణునితోడను నొకటి నా మాటగాఁ జెప్పవలయును.

గీ॥ అన్నదమ్ముల కంటె న ♦ త్యధికముగను
సంచరింపుచు శ్రీరామ ♦ చంద్ర పాద
సేవనమె జీవనముగ నెం ♦ చితిమి దాని
నైనఁ దలపోసి వైరంబు ♦ మానుఁ డనుము.

జాంబ:— ఆర్యా! నా మాటకూడ నొకటి చిత్తగించి శ్రీరామచంద్రునితో మనవి చేయుటకుఁ బ్రార్థించుచున్నాఁడను.

సీ॥ నిరతంబుఁ దావక ♦ స్మరణ వైఖరిఁ దక్కఁ బరవిచారంబుఁ దా ♦ నెఱుఁగఁ డనుము
సతముఁ దావక పద ♦ స్తుతి విధానముఁ దక్క నన్యప్రసక్తిఁ దా ♦ నందఁ డనుము
ఎప్పుడుఁ దావక నామ ♦ జప భావనముఁ దక్క నితర సంగతికిఁ దా ♦ నేగఁ డనుము
అనయంబుఁ దావకా ♦ భినవ రూపముఁ దక్క వేఱు వస్తువులఁ దాఁ ♦ గోరఁ డనుము
గీ॥ సతియునుం దాను సుతులును ♦ సంతతంబు
నిన్నుఁ దక్క మఱొక్కని ♦ నెన్న రనుము
అట్టి నీ భక్తుఁడైన య ♦ య్యాతి యెడల
దాస మందార! దయ దప్పఁ ♦ దగని దనుము.

సుగ్రీ:— అంగదా! వారికందఱికిని మొత్తముమీఁద నామాటగా నిట్లు చెప్పుము.

గీ॥ మీకపజయంబు గల్గిన ♦ మాకె మేలు
మాకపజయంబు గల్గిన ♦ మాకె మేలు
కాన నీ రెంటి యర్థంబు ♦ మానసమున
నూని పైన విరోధంబు ♦ మానుఁ డనుము.

జాంబ:— అంగదా! యీ సంధి కా శ్రీరామచంద్రుఁ డొప్పని యెడ యుద్ధసన్నాహమే నిశ్చయింపఁబడినట్లెఱింగించి శీఘ్రముగ రమ్ము.

అంగ:— చిత్తము. (నిష్క్రమించుచున్నాఁడు.)

జాంబ:— ఆంజనేయా! నాకు వృద్ధాప్య మెక్కువగుచున్నయది. యాహారంబునకే వనంబునైన నేగవలయు. నీవును వచ్చెదవా?

సుగ్రీ:— నేను సంసిద్ధముగా నున్నాను. పద పద.

ఆంజ:— నెచ్చెలీ! యుగారీ! రమ్ము. (అందఱు నిష్క్రమించుచున్నారు.)

చతుర్థాంకము.

శ్రీరామాంజనేయము.

పంచమాంకము.

విష్కంభము.

[నారదుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

నార:— (భుజంగప్రయాతము.)

భజింతున్ నినున్ భక్తి • భావమ్ముతోడన్
యజింతున్ సదా త్వత్ప • దాబ్జ ద్వయమ్మున్
ద్యజింతున్ దురాశా వి • ధానమ్ము లెల్లన్
నిజానందితం బైన • నీ మార్గ మిమ్మా!

శ్రీహరీ! వాసుదేవా! జనార్దనా!

ఉ॥ నమ్మితి నామనమ్మున న • నారతమున్ భవదీయ పాద ప
ద్మమ్ములు దక్క వేరొకటి • ధ్యానముఁ జేసెడి వాఁడఁ గాను భా
వమ్ము నెఱింగి భక్తి పరి • పాక మెఱింగి బహు స్తుతి ప్రభా
వమ్ము నెఱింగి తావక కృ • పా రస మింత యనుగ్రహింపవే.

అబ్బబ్బా? కష్ట మనఁ గష్టమా? యెంత కష్ట మెంత కష్టము? ఇక్కడి నుండి యక్కడికి నక్కడి నుండి యిక్కడికిని దిరిగి తిరిగి కాళ్లు పడిపోవుచున్నవి. నా కష్టము గమనించు వాఁడొక్కఁడైన లేఁడు గదా? ఎన్నియో? పాట్లు పడి విశ్వామిత్రునిచే మొదట సమిధ వేయించితి. పిదప యయాతి కడ కేగి మదీయ మంత్ర ప్రభావము వినియోగించి వానికిఁ బ్రాణముపై నత్యంతాశఁ గలిగించి రామేశ్వరమున నుండు నాంజనేయుని సమీపమునకుఁ బంపితి. అప్పటి సందర్భ

మంతరయు నిప్పుడే రామునకుఁ జెప్పి వచ్చితి. ముందింకను నెంతమంది నాశ్రయింప వలయునో ? ఛీ ; భగవంతుఁడు నన్నీయుదరము లేకుండ సృజించి యున్న నాకీయగచాట్లు లేకుండెడివి. ఛీ ; యిది యేటి మనోరథము "కష్టేఫలీ" యనునట్లు కష్టించినవానికే ఫలము కలదు. లేనివాని కేమున్నది? (పరికించి) ఇక్కడెవ్వరో? వచ్చుచున్నట్లున్నది. కొంప ముంచి నా మాట లెవ్వరు విన లేదు గదా ?

అంగ:—(ప్రవేశించి) మునీంద్రా! నమస్కారము.

నార:—సుఖీభవ సుఖీభవ. అంగదా! నీ వెచ్చటికి పోవు చుంటివి ?

అంగ:—దేవా! శ్రీరామచంద్రుని కడకు వ్యవహారమున పోవుచుంటి. మా యుదంత మంతయు మీకుఁ దెలిసినదే గదా ?

నార:—నాకే కాదు. లోకమున కంతకుం దెలిసినదే. ఇంతకును దురాత్ముఁడా విశ్వామిత్రుఁడు చేసినాఁడు సుమా ?

అంగ:—ఎవరి ననిన నేమి లాభము ? మనము నిమిత్త మాత్రము గాని జరుగ వలసిన విధు లన్నియుఁ బ్రారబ్ధము ననుసరించి జరుగుచుండును.

నార:—ఆ మాట మాత్రము నిజము. ఎంతవాఁడేనియుఁ బ్రారబ్ధ వేగమున కడ్డు పడఁ జాలఁడు.

అంగ:—దేవా! నేను త్వరగా నేగ వలయు. నాకు సెల విమ్ము.

నార:—నేను గూడ నటే పోవలయు.

(నిష్క్రమింతురు)

విహారప్రదేశము.

[రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు ప్రవేశింతురు.]

రామ:—తమ్ములారా !

ఉ॥ నారదుఁ డాడినట్టి వచ ♦ నంబు నిజమ్ హనుమంతు తోడ ని
ష్కారణమైన సంగరము ♦ గల్గు నటంచొకబుద్ధిఁ దోఁచె నా
మారుతిపైన నుండు నభి ♦ మానము న్యూనము గాదు నాకు నే
తీరునఁ గెల్తునో ? తుదకు ♦ దేవుఁ డెఱుంగు యథావిధానముల్.

భర:—అన్నా ! రామచంద్రా ! యాంజనేయుండు మీ చరణారవిందంబుల నాశ్రయించి యయాతిని మనకొప్పగింపక మనతోఁ గయ్యంబునకియ్యకొనునా?

లక్ష్మ:—అన్నా! యీ విషయమున మనము విచారింపవలసిన పని యుండదు.

చ॥ మనము ప్రతిజ్ఞ బట్టిన క్ర ♦ మంబు నెఱింగిన నాంజనేయుఁ డా
తని విడనాడి శ్రీకర ప ♦ దద్వయమందున వ్రాలి తీరు నీ
మనమున నింక శంక యను ♦ మానము మానకు మన్న ! భక్తిలో
ఘనుఁడు గదన్న! యాతని ప్ర ♦ కార మెఱుంగ వటన్న! రాఘవా !

శత్రు.—ప్రతిజ్ఞా పరిపాలనమున నాంజనేయుండు మన యన్నగారికి ముఖ్య శిష్యుండే కదా ? యేమగునో ? నిశ్చయ మూహింపఁ జాలకున్నాను.

అంగ:—(నేపథ్యములో) దశరథతనయు లెక్కడ ? దశరథ తనయు లెక్కడ ?

రామ:—లక్ష్మణా ! వారెవరో ? చూడుము.

లక్ష్మ:—(పరికించి చూచి) ఇదిగో నంగదుఁడు వచ్చుచున్నాఁడు.

అంగ:—(ప్రవేశించి) దశరథతనయులకు సాష్టాంగ మాచరించుచున్నాఁడ.

రామ:—మంగళమగుఁ గాక—అంగదా !

మ॥ అవలాత్మోదగు వాయునేయునకు సౌ ♦ ఖ్యంబే ? మఱిన్ బ్రాణమి
త్రము సుగ్రీవ కపి ప్రవీరునకు భ ♦ ద్రంబే ? మహాలోచన స్థా
సమ శీలుం డగు జాంబవంతునకు ని ♦ చ్చల్ సేమమే ? తక్కు నీ
ల ముఖ్యావారణ వానరాఢ్యులకుఁ గ ♦ ల్యాణంబొకో ? చెప్పుమా !

అంగ:—దేవా! యుష్మత్కరుణా కటాక్షమున నందఱు సుఖంబుగ నేయున్నారు.

రామ:—(హైఁ గఱుచు) నాయనా !

చ॥ తలఁచునె? యెన్నఁడైన మముఁ ♦ దా ననిలాత్మజుండు భక్తిచేఁ
గొలుచునె? సుంతయైనఁ దన ♦ కున్ గులదైవ మటంచు నన్నుఁ దా
నిలుచునె? నా చరిత్రలు గ ♦ ణించెడి చోటులయందు నాపయిం
బలుకులచేతనైన నభి ♦ మానము నుంచునె? చెప్పు మంగదా!

అంగ:— దేవా! యిట్లనెద వేమి?

ఉ॥ ధ్యానము సేయు నిన్ననుప ♦ దంబును మా పవమాన సూనుఁడే
చ్చోనయినన్ ద్వదీయ పరి ♦ శుద్ధ చరిత్రలు పాడుచుండు నెం
దేనియు నీపదాంబుజము ♦ లే స్మరియించును మాటలేల? తాఁ
బ్రాణము నైన నీకనిన ♦ నర్పణ సేయఁ దలంచు రాఘవా!

రామ:— పూర్వమునుండియు నాతని భక్తి విశ్వాసంబు లట్టివే.

గీ॥ మేనులే రెండు గాని యీ ♦ ప్రాణ మొకఁడె
మారుతికి నాకు నంచు నా ♦ మదిని గలదు.
కాన నీక్షణమున వాని ♦ వాని నిన్నుఁ
జూచి నంతన ప్రాణముల్ ♦ లేచి వచ్చె.

అంగదా! నీవు వచ్చిన కార్యమేదియో తెలుపుము.

అంగ:— దేవా! యేమి చెప్పుదు?

చ॥ అనఘుఁడు నీ పదాబ్జము ల ♦ హర్నిశముల్ స్మరియించువాఁడు స
జ్జనుఁడు యయాతి పేరు గల ♦ క్ష్మాపతి యొక్కఁడు మమ్ముఁ జేరి వేఁ
డిన భవదీయ భక్తుఁడని ♦ డెందమునందుఁ దలంచి మా మరు
త్తనయుఁడు ప్రాణ మిత్తునని ♦ దానముఁ జేసె విధేయరక్షణా!

రామ:— ఎంత యవిచారిత కార్యముం జేసియున్నాఁడు? పిదప నేమయ్యె?

అంగ:— దేవా! అతండు మా యాంజనేయునివలన వాగ్దానముం దీసికొని శ్రీరామచంద్రుండు నన్ను వధింతు నని ప్రతిజ్ఞ వట్టె నని యెఱింగించె. అంత నార్తున కొసంగిన యభయ దానంబు ద్రిప్పుకొనఁ జాలక విచారింపక ముందుఁ దా నొనర్చిన పని కెంతయుం జింతిల్లుచుఁ దుదకు శరణాగతత్రాణ బిరుదాంకుండవగు దేవరతో విన్నవింపుమని మా మారుతాత్మజుండు నన్ను మీ కడకుఁ బంపి యున్నాఁడు.

రామ:— మంచిది. మీ యభిప్రాయ మేమి?

అంగ:— దేవా! అద్భుత కథయ మొసంగిన మమ్ము మన్నించి యా యయాతి ననుగ్రహింపవలయు. ఇంతకన్న మా యభిప్రాయ మేమున్నది?

రామ:— ఆంజనేయుని యాంతర్య మెట్లున్నది?

అంగ:— దేవా! యుష్మత్పాదారవిందంబుల కనేక సాష్టాంగ వందనంబు లాచరించి ముహుర్ముహు ర్వినమిత శిరః ప్రకటీకృత భక్తిభావ తరంగితాంతరంగంబున వినయాంజలిం బెట్టి భవచ్చిర శుశ్రూషాసంవిధాన పరిపక్వ వచః ప్రసాగం బైన నాంజనేయుండు నీ కిట్లు విన్నవించె.

సీ॥ నా మనంబున భవ • న్నామ మంత్ర జపంబుఁ
జేయుచుండు నటంచుఁ • జెప్ప మనియె
నా నేత్రములఁ దావ • కీన రూపాలోక
మాచరింతు నటంచు • నాడు మనియె
నా కేల భవదంఘ్రి • నళిన కైంకర్యంబు
సలుపుచుండు నటంచుఁ • బలుకు మనియె
నా నోట భవదీయ • నవ కథామృత ఝరిఁ
గ్రోలుచుండు నటంచు • నుడువు మనియె
గీ॥ ఎపుడు చూచిన నీ మహా • తపములోన
నోడ లెఱుంగక కాలంబుఁ • గడపుచుందు
నను మనియె నీకు దాసుఁడ • ననియె మఱవ
వలదనియె నా విచారంబుఁ • దెలియ మనియె.

రామ:— (చిఱునగవుతో) అతని కంత విచారంబు గలుగుటకుఁ గారణ మేమి?

అంగ:— దేవా! నీ వెఱుంగని కారణ మున్నదే?

రామ:— నే నెఱింగి యేమి చేయ వలయు?

అంగ:— యయాతి మీకుఁ బుత్తెంచిన మొఱ్ఱ లాలింపవలయు.

సీ॥ ఏ దోస మెఱుఁగని • యీ దాసుపై నింత
కోప ముండిన నుండ • నోప ననియె
ఏ కర్మ మెఱుఁగని • యీ కూనపై నింత
నిర్దయత్వంబున్న • నిలువ ననియె

ఏ కృత్య మెఱుఁగని ♦ యీ భృత్యుపై నింత
ఖేద మెంచిన నెందుఁ ♦ బోదు ననిరొ
ఏ పాప మెఱుఁగని ♦ యీ పుత్రిపై నింత
పంత మూనిన నింక ♦ బ్రతుక ననిరొ
గీ॥ కడకు నాడ లెల్ల గడగడ ♦ వడఁకుచుండ
సతికి సుతులకు బంధు సం ♦ తతికిఁ గూడ
గతి మఱొకఁడు లేదని ♦ కరము లెత్తి
యార్చి నినుఁగూర్చి కన్నీరు ♦ గార్చి మిగుల.

వివేక శాలురగు మా జాంబవదాదులు గూడ పూర్వోక్త పథంబుననే మీకు విజ్ఞాపింపు మనిరి. పైన మీ చిత్తము మా భాగ్యము.

రామ:—అంగదా! అటులైన మాప్రతిజ్ఞ యెట్లు నెఱవేఱవలయునని యెంచితివి?

అంగ:—దేవర! శ్రీమన్నారాయణావతారము గాదే? మీకు వీలు గాని దేది?

రామ:—అనన్యగతికమగు ప్రతిజ్ఞఁ బూనినచో నాకువీల్పడనిది లేనిమాట నిజమే.

లక్ష్మ:—ఓయీ! యాంజనేయుండు మాకు భక్తుండు గదా? మేము చంపెద మనిన వానికేల తా నభయ మొసంగ వలయును?

అంగ:—అయ్యా! యెఱిఁగి యొసంగిన నిచ్చునా?

భర:—ఇప్పుడు తెలిసినది గదా విడువఁ గూడదా?

అంగ:—పురుషుఁ డగు వాఁ డాడి తప్పఁ గలఁడా?

రామ:—అట్లైన రాముఁడు పురుషుఁడు కాఁడని యనుకొంటిరా?

అంగ:—దేవా! నిగ్రహానుగ్రహ సమర్థుండవగు నీవు భక్తపరాయణుండ వని శరణుఁ జొచ్చితిమి గాని పురుషుఁడు కాఁడను కొన లేదు.

శత్రు:—శరణమునకును బ్రతిజ్ఞకును సంబంధము లేదు.

అంగ:—అయ్యా! నిరపరాధి యగు యయాతి నెట్లు చంపెదరు?

రామ:—ప్రతిజ్ఞకు నిరపరాధియు సాపరాధియు నొకఁడే తీరు నాఁకే.

అంగ:—దేవా! యట్లైన మే మొనర్చిన మేలైనం దలంపరాదే?

లక్ష్మ:—యయాతిం గాచుటకు మీ మేలెంచుటతో నేమి పని?

అంగ:—మా యాంజనేయుం డాతని కభయ మిచ్చుటచేతనే మున్ను మీకు మే మొనర్చిన యుపకారములకుఁ బ్రత్యుపకార మిది యొక్కటియైనం జేసి మమ్మనుగ్రహింపుఁడని ప్రార్థించుచున్నాఁడ.

శత్రు:—మీకు మే మేమియు నుపకారములు చేయ లేదు కాఁబోలు.

అంగ:—స్వామీ ! చేయ కేమి ?

భర:—అట్లైన మాకు మీరు మహోపకారములు చేసినట్లు మాటమాటకు నుద్ఘాటించెద వేమి ?

రామ:—అంగదా ! మీరు మా కుపకారములు చేసినమాట నిజమే కాని. యా యుపకారముల కిది యేటి ప్రత్యుపకారము ? ఇప్పట్ల నే నీ యయాతిని సైఁచినయెడ లోకులు రాముఁ డాడితప్పువాఁడని నిందించుచున్న మీరు మాత్రము విని సహింపఁ గలరా ? యీమాటల కేమిగాని యిది యొక్కటి యాంజనేయునితోఁ జెప్పుము.

చ॥ అరయుము నా భటుండ వయి ♦ నందుకు వాయుతనూజ ! నీవు గ్రి
చ్చఱ నొనరించి నట్టి శర ♦ ణాగత రక్షణ దాన మాత్మకుఁ
గరము ముదమ్ముఁ గూర్చె నది ♦ గాని యెఱుంగక ముందు నీవు ప
త్వరమునఁ జేయ రా దయిన ♦ వానిఁ ద్యజింపుము చాలు నిత్తఱిన్.

అంగ:—ఈ మాటలే కాని మమ్మనుగ్రహించు మాట లేదా ?

లక్ష్మ:—పూర్వము నుండియు మిమ్ము మే మనుగ్రహింపకున్న మీ రింతవఱకును నిట్లుందు వారా ?

అంగ:—అయ్యో! నేనర్థించునది యొకటియు మీరు వచించునది యొకటిగా నున్నది.

రామ:—అంగదా ! పలుమాటలేల ? మీ రందఱును నా భటు లగుటచే నా ప్రతిజ్ఞ నెఱవేర్చి లోకంబునఁ గీర్తిఁ గాంచుఁడు.

అంగ:—దేవా ! మీ భటుండగు వాయుసుతుని ప్రతిజ్ఞ యెట్లు నెఱవేఱవలయు?

రామ:—ఇట్టి ప్రతిజ్ఞ లన్నియుం బెట్టుకొనినయెడ ముం దాతనికి రాఁబోవు లాభము లన్నియుం జెడు నని చెప్పుము.

అంగ:—ఇంతకును వాని వధించు మాటయే నిశ్చితమా ?

రామ:—నిశ్చయింపఁబడక యన్యోపాయ మే మున్నది ?

అంగ:—అట్లైన నీ సంధికి మీ రొప్పని యెడ యుద్ధమే నిశ్చయింపఁబడినట్లు మా యాంజనేయుండు మీతో మనవి చేసి రమ్మనియె. నాకు సెలవిండు.

రామ:—(కైవసఁజూచి) ఆహా? యాంజనేయా! యెంతవాఁడవైతివి సాధకుండవై నన్నెదుర్కొన సాహసించితివా? అంగదా! అట్లైన శీఘ్రముగాఁబొమ్ము.

అంగ:—చిత్తము (నిష్క్రమించుచున్నాఁడు.)

లక్ష్మ:—అన్నా! యాతని గర్వసర్వస్వమును మున్నెన్నండును నిర్మూలింపక పోవుటచేతనే యాతనికి దురభిమాన మెక్కువైనది.

భర:—లక్ష్మణా! యాతండు మనతో నని సేయఁ గలఁడా? యేమి [illegible]కొని యిట్లు చెప్పి పంపెనో? తెలియఁ బడకున్నయది.

శత్రు:—మనచేత రాజ్యాభిషేకాదులంబొందిన యాసుగ్రీవునకైనం దెలియలేదా?

రామ:—ఆలోచింపనేమిలాభము? నాఁడు జేతులాడఁజాలని కాలము దాపరించినది.

(శిరము వంచికొనుచున్నాఁడు.)

లక్ష్మ:—అన్నయ్యా! అదిగో!

॥ గీ॥ [illegible] తెల్ల నా ◆ కొడుకు వారు
[illegible] పుష్పింప నక్షత్ర ◆ రత్నరాశి
[illegible] యంగాంతి యా ◆ తైల వీరి
[illegible]జాల నను నట్లు ◆ పాప్తిస్ గుంకె.

[illegible] సెలవు.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

ఇది శ్రీ [illegible] భారద్వాజస గోత్రాపస్తంబసూత్ర యజుశ్శాఖా
[illegible] రామ పుత్త్ర కనకాంబా గర్భ శుక్తి ముక్తాఫల
[illegible] పరిపాద సముపేత ఘటికాశత గ్రంథ
సామ్రాజ్య చిదంబర కవీంద్ర ప్రణీత
శ్రీరామాంజనేయ నాటకము.
పంచమాంకము.

శ్రీరామాంజనేయము.

షష్ఠాంకము.

విష్కంభము.

[విశ్వామిత్రుఁడు ప్రవేశించుచున్నాఁడు]

విశ్వా:—అబ్బబ్బా? యీ నారదుఁ డెంత దుర్మార్గుఁడు? మొదట నన్ను రామచంద్రుని కడ కంపి యటుపైనఁ దా నా యయాతి కడ కేగి యాతని నాంజనేయుని కడకుఁ బంపినాఁడు. వీని కలహాముకోల? యెంత పెంచినాఁడు? మొదటనే నాకు వీఁడిట్టి యుపదేశకర్త యని తెలిసి యుండిన నే నట్టి కార్యమునకుఁ బాల్పడుదునా? అన్నా! యెంత చేసినాఁడు. ఇప్పుడా రామచంద్రుఁడు యయాతి కభయ మిచ్చిన యాంజనేయుని మొదటఁ జంపిక దా యయాతిని జంప వలసినది. ఎంతకష్ట మెంతకష్టము. ఈ కలహ మెంత వఱ కెక్కినది. కటకటా? యీ సంగతి తలంచుకొనిన కొలఁదియు నా గుండె లడలుచున్నవి. ఇది గాక.

సీ॥ నిరతంబు శ్రీరామ ♦ చరణ పాథోజముల్
తగు భక్తి నెత్తిపైఁ ♦ దాల్చువాఁడు
సతతంబు శ్రీరామ ♦ చంద్ర నామ ధ్యాన
మే యనూనమ్ముగాఁ ♦ జేయువాఁడు
అనయమ్ము శ్రీరామ ♦ ఘన చరిత్రంబులే
జప తపమ్ముల మాడ్కిఁ ♦ జలుపువాఁడు
ఉపకారముల నెన్ని ♦ యూను జేసి రామ ద
యార్ద్రదృష్టికిఁ బాత్ర ♦ మైనవాఁడు

గీ॥ అట్టి వాయుతనూజాతు • నట్టు లింక
యుద్ధమును జేయ నా రాముఁ • డొప్పికొనునొ?
ఒప్పెఁబో, యా చిరంజీవి • కెప్పుడైనఁ
బ్రాణభయ మున్నదే? విచా • రమ్ము సేయ.

ఇది యంతయు నాలోచింపఁగా నతివిచిత్రముగాఁ దోఁచుచున్నది. దీని వలన నే మహాప్రళయ ముద్భవిల్లునో? దీని కంతకును నేను గదా కారకుఁడను. లోకు లందఱు నన్నెంత నిందింతురో? పోనీ? దీని నింతట విరమింపఁ జేయుద మన్న నా కే యుపాయమును తోఁచకున్నయది. (ప్రాగ్దిశఁ జూచి) ఆహా! యీ సమయంబున నా స్వాంతమునకుం బోలెఁ గుముదినీ కాంత కెంత సంతాప ముదయించుచున్నది.

గీ॥ క్రమము విఱిచిన స్నేహంబు • గానుపింప
సమయమున వచ్చి కర మిచ్చి • యమృతరూపుఁ
డలమి నన్నుఁ బ్రోచి చేసిన • కృత్యమునకుఁ
గురుత వహించుచున్నది యెల్ల • కలికి మిన్న.

(యోగదృష్టితో) మా రాముఁ డాంజనేయునితో నేకాంతమునఁ గలసి యున్నట్లు తోఁచుచున్నది. చూడవలయు.

(నిష్క్రమించుచున్నాఁడు)

ఏకాంతస్థలము.

[శ్రీరామాంజనేయులు ప్రవేశింతురు]

ఆంజ:—(దోసిలొగ్గి)

సీ॥ శ్రిత పాలకాయ వాం ♦ ఛిత దాయకాయ పా
 వన చారితాయ తు ♦ భ్యం నమోఽస్తు
మంగళాకారాయ ♦ మహిత పరివారాయ
 భాసమానాయ తు ♦ భ్యం నమోఽస్తు
కరుణాకరాయ స ♦ ద్గురు పదావాసాయ
 భవ తారకాయ తు ♦ భ్యం నమోఽస్తు
త్యక్త సంయోగాయ ♦ ముక్త దుష్ట జనాయ
 భక్త సక్తాయ తు ♦ భ్యం నమోఽస్తు
గీ॥ బ్రహ్మ తత్వ మయాయ తు ♦ భ్యం నమోఽస్తు
భవ్య గుణ సాగరాయ తు ♦ భ్యం నమోఽస్తు
అర్క వంశోద్భవాయ తు ♦ భ్యం నమోఽస్తు
భావ రఘు నాయకాయ తు ♦ భ్యం నమోఽస్తు.

(పాదములపైఁ బడుచున్నాఁడు)

రామ:—ఆంజనేయా ! లెమ్ము. లెమ్ము.

ఉ॥ మాటలు జూడఁ జందన స ♦ మానములున్ హృదయంబు గర్కశా
స్ఫోటన పూరిత క్రకచ ♦ మున్ మును నెన్నఁ గెలుంగ పట్టి దు
ష్పాటవ పాండితీ గరిమ ♦ జాపురె యెప్పుడు నేర్చినాఁడ విం
కేటికి నీ నమస్కరణ ♦ మేటికి నీ వినయ ప్రసంగముల్.

కంటఁబడి నప్పుడే యీనమస్కారములుగాని కార్యసమయమున నుండవుసుమా?

ఆంజ:—దేవా ! అట్లు నేను చేసిన దేమి ?

రామ:—మారుతీ ! నీవు చేయక పోయిన దేమి ? అట్లైన మునుపటివలె నాయం దిప్పుడును భక్తి విశ్వాసములు గలిగి యున్నాఁడవా ?

ఆంజ:—దేవా ! అట్లనెద వేమి ?

చ॥ అనుదినమున్ ద్వదీయ చర ♦ ణాబ్జములన్ భజియించుచుందు నీ
ఘనమగు నామమంత్ర మది ♦ కమ్మఁగ నెమ్మి జపించుచుందు నో
య్యన భవదీయ కీర్తనల ♦ హర్నిశమున్ బఠియించుచుందు నెం
దునఁ బలుమాటలేల? కల ♦ నన్ నిను నేను స్మరించుచుండెదన్.

రాము:—మారుతీ! యిది నీ హృదయమునుండి వచ్చిన మాటయేనా?

సీ॥ మైథిలీ భూషణాం ♦ బర మిచ్చి సుగ్రీవు
గొప్ప సఖ్యము నాకుఁ ♦ గూర్చు వాఁడు
సతిఁ బాసి విలపించు ♦ సమయమందున లంకఁ
జొచ్చి తత్సుఖవార్త ♦ దెచ్చు వాఁడు
శ్రద్ధమై నేకాగ్ర ♦ బుద్ధిచే రాక్షస
శ్రేణి నెల్లను నుగ్గు ♦ సేయు వాఁడు
సంజీవినీ మహౌ ♦ షధిచేత సౌమిత్రి
కిచ్చమైఁ బ్రాణమ్ము ♦ లిచ్చు వాఁడు

గీ॥ పాయకుండిన భక్తి వి ♦ శ్వాస వినయ
గుణ విధేయత లిప్పు ని ♦ క్కము గాను
కలవె? నీ కేను చంపఁగాఁ ♦ దలఁచి నట్టి
వానిఁ బైఁ బూని కొని యిట్లు ♦ వచ్చినావు

ఆంజ:—దేవా! నీకుఁ దెలియని యంశ మీ త్రిభువనంబుల యందును లేదు. నేను నీయందు భక్తి విశ్వాసములు లేక యుంటినో? యీ యనివార్య విరోధంబునకుఁ జింతాక్రాంత చిత్తుండనై యుంటినో? నీవే యెఱుంగుదువు.

రాము:—అవును నే నెఱుంగ కేమి? నా యందు నీకు భక్తి విశ్వాసంబు లున్న నా యుపదేశంబునకు నీ వేల? యాశింప కుందువు?

ఆంజ:—స్వామీ! దానికి నేను గీఁటు దాఁటిన దేమి?

ఉ॥ అరయక ముందొనర్పఁ బడె ♦ నట్టి ప్రతిజ్ఞ యదట్టులుండ నో
గురువర! చిత్తగింపు మిఁకఁ ♦ గోపము సేయకు మిట్టి వారలున్
శరణ మటంచు వచ్చిన వి ♦ చారణ సేయక బ్రోచు భారమున్
శిరమునఁ దాల్ప మంటి విది ♦ నీ యుపదేశము గాదె? రాఘవా!

రామ:— ఆంజనేయా! నీ యుపన్యాసమున కెంతయు సంతసించితి. కాని యిన్నిటికిని నా యుపదేశము నీకు బాటఁ దగనిదే కదా? నే నా విశ్వామిత్రుని యెదుట యయాతిని వధింతు నని ప్రతిన పట్టియున్నాఁడ. కాన నిప్పుడు నా మాట విని వాని విడువుము.

ఆంజ:— దేవా! నీ వొనర్చిన మహోపదేశము తప్పక గ్రహింపఁ దగినదే కాని, యిప్పట్లు మాత్రము శరణార్థి యగు వాని విడుచుట నా కధర్మ మని తోఁచుచున్నది. క్షమింపుము.

రామ:— మారుతీ! నీకు ధర్మోపదేశకుం డెవండు?

ఆంజ:— దేవా! నీకన్న నాకు ధర్మోపదేశకుం డెవండు?

రామ:— అయిన నా మాట యొకటి వినుము. నీ వాతని విడుచుట యధర్మ మెన్నటికిం గాదు. దేశకుండు నియోగించిన పిదప శిష్యుం డేపనియైనం జేయవచ్చు, దాన నాతని కే దోషముం గలుగనేరదు. మున్ను నేను విశ్వామిత్రాజ్ఞానుసరణమున స్త్రీ యగు తాటకను వధింప లేదా? సంశయింపకుము. వానిని విడువుము.

ఆంజ:— రామచంద్రా! యేమి నీతి బోధించితివి? మున్ను నీవు శరణార్థు లగు వారిలో నెవ్వరిని విడిచితివి?

సీ॥ అపరాధ మొనరించె ♦ నని యైనఁ గాకాసు
రుని నావలకుఁ బట్టి ♦ త్రోచి నావె?
అరికిఁ దమ్ముండంచు ♦ నైన సంకోచించి
యా విభీషణునిఁ బో ♦ నాడి నావె!
ఏతఁ డేమొనరించుఁ ♦ గ్రోఁతి యంచైన మా
సుగ్రీవు నెగ్గుగాఁ ♦ జూచి నావె?
వీరిచే మన కుప ♦ కార మేమంచు మా
బోఁటి దాసుల గోట ♦ మీటి నావె?

గీ॥ అయ్య! కరుణాలవాలుఁ డ ♦ వైన నీకు
వీనిఁ గాపాడఁ దగదె? నా ♦ విన్నపంబు
సావధాన మనంబుతో ♦ నాలకించి
విడువు విడువు మటంచు నీ ♦ వడుగ నేలె?

రాము:—వాయునందనా! యిది నిశ్చయమే కాని, మున్ను నాకిట్టి యుసందర్భములు రాలేదు. మఱియు నప్పట్ల నిట్లెవ్వరును జెప్ప లేదే? యిది గాక.

సీ॥ యతి జన ద్రోహ న ♦ మ్మత చిత్తులైన దు
ర్జనుల నెంతైన నే ♦ సైఁచి నానె?
గురు జన ధిక్కార ♦ కరణాంఘ్రులైన దు
ర్మదుల నెంతైన నే ♦ వదలి నానె?
సజ్జన వ్యాపాప ♦ చార కారకులైన
ఖలుల నెంతైన నేఁ ♦ గాఁచి నానె?
కోవిద గ్రామ సం ♦ క్షోభ తత్పరులైన
జనుల నెంతైన నే ♦ మనిచి నానె?
గీ॥ ఎన్ని దినములో నా కడ ♦ నున్న వాఁడ
వాసమెయి నాకు శుశ్రూషఁ ♦ జేసి వాఁడ
వీ వెఱుంగని దొక యింత ♦ యేని గలదె?
మంజులోక్తి విధేయ! యో ♦ యాంజనేయ!

ఆంజ:—రామచంద్రా! యాతం డట్టి వాఁడే నా? అతని గొనంబులు నీకుఁ దెలియని వా? యిదిగో భృత్యానుభృత్యుండనై చెప్పుచున్నాఁడ వినుము.

సీ॥ సతతంబు నీ నామ ♦ జపము సల్పెడి వాఁడు
నీ రూప మెప్డుడు ధ్యా ♦ నించు వాఁడు
శిష్ట సన్నిధికి నా ♦ నించి చేరెడి వాఁడు
దుష్ట శబ్దము విన్నఁ ♦ దొలఁగు వాఁడు
స్వ పర భేదముల ని ♦ చ్చను వహింపని వాఁడు
ధర్మమే జయ మని ♦ తలఁచు వాఁడు
భక్త బృందముల లో ♦ పల మేటి యగు వాఁడు
నపరాధములు సేయ ♦ నట్టి వాఁడు
గీ॥ ఆశ్రితుండును దయనీయుఁ ♦ డైన వాఁడు
తవిలి నీ పుత్త్రిగాఁ జూడఁ ♦ దగిన వాఁడు
గాన నిట్టి యయాతి నిం ♦ కైనఁ బ్రోవు
మయ్య! శ్రీరామభద్ర! ద ♦ యాసముద్ర!

రామ:—నాకు నీవు ధర్మోపదేశము సేయ నక్కఱ లేదు. మారుతీ! ముఖ్య ధూర్తుండ వగు నిన్ను వధించుటకు నా చేతు లాడకున్నయవి. నా మాట విని యాతని విడువుము. ఈ సర్వ సర్వంసహా మండలంబునకు నిన్నేక ఛత్రాధిపతిఁగా నొనరించెద.

ఆంజ:—దేవా! రాజ్యాది తుచ్ఛ సుఖంబులు ధర్మంబు కన్న నతిరేకంబులే?

మ॥ అపరాధంబులు లేని వాని భవదీ ♦ య ధ్యాన పారాయణుఁ
గృపలే కిట్లు త్యజించుమం చనుట కం ♦ టెన్ దేవ! యీ పాపకా
ర్యపరున్ నింద్య చరిత్రు దుర్మతిని వి ♦ శ్వామిత్రుఁ బోనాడి యీ
కృపణుం డైన యయాతిఁ బ్రోవ దయరా ♦ దే? వాద మింతేటికిన్.

రామ:—(కోపముతో) ఓరీ దుర్మతీ? మా గురూత్తమునిఁ గూడఁ దిరస్కరించు చున్నాఁడ వింక నీ వుండవు సుమా? యొడ లెఱింగి ప్రసంగింపుము. గర్వాంధా! యమ్మహనీయుని మాహాత్మ్యము నీ కేమి తెలియును?

సీ॥ అల బలాతిబల వి ♦ ద్యల మహా వాత్సల్య
మ్ముంచి నాకు నుపదే ♦ శించినాఁడు
తాటకాది మహా ని ♦ శాట వర్గమును గో
పించి నాచేతఁ జం ♦ పించి నాఁడు
అనుపమాన శ్రీమ ♦ హాదేవ చాపంబుఁ
గాంచి నాచేతఁ ద్రుం ♦ పించి నాఁడు
మైథిలీ మానినీ ♦ మణి కరంబును ప్రేమ
యుంచి నాచేతఁ బ ♦ ట్టించి నాఁడు

గీ॥ మించి బ్రహ్మర్షి పదము సా ♦ ధించి నాఁడు
అంచితంబైన ఖ్యాతి నా ♦ ర్జించి నాఁడు
అట్టి మహనీయునకు నిచ్చి ♦ నట్టి మాట
తప్పు మని యింత కట్లు నో ♦ రొప్పె? నీకు

అట్లననేల? వానరా! నీ స్వభావము కొలఁదియు నీ కంటివిగాని వేరుగాదు.

ఆంజ:—దేవా! మొదటి నుండియు నా స్వభావము ఇట్టిదే.

సీ॥ అలవి గానట్టి యా ♦ జలధి నంతయు దాఁటి
వ్రాల్చి వాలము లంకఁ ♦ గాల్చి నేన?
ప్రాణముల్ విడనాడఁ ♦ బూను సీతామహా
దేవి కా సుఖవార్తఁ ♦ దెల్పి నేన?
రణ మృతుండైన ల ♦ క్ష్మణుని సంజీవనీ
గిరి నెత్తి తెచ్చి ర ♦ క్షించి నేన?
పడరాని కష్టముల్ ♦ పడి యొకేనియుఁ జలా
యించి కార్యంబు సా ♦ ధించి నేన?
గీ॥ కోపమున రక్కసుల రూపు ♦ మాపి నేన?
దాసుఁడై మీకు నుపకృతుల్ ♦ సేసి నేన?
అట్టి నా దుస్స్వభావము ♦ లెట్లు లింక
మానునో? చెప్పు మయ్య! న ♦ మస్కరింతు.

రామ:—(చిఱునగవుతో) ఆఁ. ఇవి యన్నియు నీసామర్థ్యము వలననే యైనట్లు పొగడుకొనుచుంటివా? యెంతవాఁడవోయి!

మ॥ కడఁకన్ ధైర్యము దగ్గకుండ నటువై ♦ గంభీర వారాశిలోఁ
బడి పోకుండఁగ యుద్ధమందు మఱి యే ♦ భంగంబు రాకుండ నె
న్నఁడుగానీ? మతిజాడ్యముల్ గలుగకుం ♦ డన్ నిన్ను మున్నుండి నేఁ
గడగంటన్ గనకున్న నేమగునో? నీ ♦ గర్జించుటల్ వానరా!

దీనికేమిగాని యల్పుని నిమిత్తమై నాతో నెదిరింప సాహసించితివా? నా మాట యింత మాత్రము వినఁ గూడదా? నిన్ను నేను స్వయముగా నర్థింపనున్నాను. కయ్యమును మానుము అస్మత్కరుణాకటాక్ష పాత్రుండవై నీవనేక సహస్ర వర్షంబు లీలోకంబునఁ బూజ్యుండవు గాఁగలవు.

అంజ:—దేవా! నే ననేక విధంబుల నంగదునితోఁ జెప్పి పంపినను నీ వంగీకరింప వైతివి. నిన్నిప్పుడు స్వయముగఁ బ్రార్థించుచున్నాను. దీనుండగు యయాతిని రక్షింపుము. భక్తవత్సలుండను మాట సార్థకంబు గావింపుము.

రామ:—వాయుజా! నే నా గాధేయున కిచ్చిన మాట దాఁటఁజాలకున్నాఁడ.

ఉ॥ న్యాయము నెంచుమన్న! గురు ♦ నానతి దాఁటకుమన్న! నీకు శ్రే
యము లబ్బునన్న! విప ♦ రీతము లాడకుమన్న! తిన్నఁగా

నీయెడ నొక్కమారు మద ♦ భీప్సితము నెఱవేర్పు మన్న! దీ
ర్ఘాయువు గల్గు నన్న! సుకృ ♦ తాత్ముఁడ వయ్యెద నన్న! మారుతీ!

ఆంజ:—స్వామీ! యెంత పరిహాస మెంత పరిహాసము?

ఉ॥ ఎందఱ కెన్ని కాంక్షితము ♦ లేని? యొసంగుదు వందు గొప్ప పే
రొందితి వయ్య! పాదముల ♦ నొత్తెడి భక్తున కొక్క కోర్కె యా
నందముతోడ నీయఁదగు ♦ నా? తగదా? వచియింపు మయ్య! యా
సందియ మేటి కయ్య! తగు ♦ సర్వ సమర్థుఁడ వయ్య! రాఘవా!

రామ:—ఆంజనేయా! మాటకు మాట దప్పఁ గార్య మేమియు లేదా?

ఆంజ:—దేవా! లేక యేమి?

క॥ శరణన్న వాని నెప్పుడుఁ
గరుణింపుట నీకు గొప్ప ♦ కార్యము గాదే?

రామ:— గురు నాన దాఁటి యాడియు
మఱి తప్పుట స్వల్ప ♦ కార్యమా? హనుమయ్యా!

ఆంజ:—దేవా! నీతోడ నేను మాటలాడఁ గలుగుదునే? నిగ్రహానుగ్రహ సమర్థుండ వగు నీవు ననుగ్రహింపకున్న నింక మాకు దిక్కెవ్వరు?

రామ:—వానరా! నేను పట్టిన ప్రతిజ్ఞ భూ నభోంతరములు గ్రుంగినను దుదకుఁ బ్రాణభంగంబు వాటిల్లినను దప్ప దని నీ వెఱుంగవే? యీ లోకంబున నా కవమానంబు ప్రాప్తించిన నీకుఁ బ్రాప్తించి నట్లు కాదా? ప్రతిజ్ఞ విడనాడితే నీ లోక నింద సహింపఁ గలనా?

ఆంజ:—(దోసిలొగ్గి) దేవా! మహానుభావా!

గీ॥ నిజమె నీ మాట కాని యీ ♦ ప్రజలు నన్ను
రామ భక్తుండనై యుండు ♦ నీ మహత్త్వ
మేడఁ బోయెను బ్రతినను ♦ వీడి నావె?
యనుచు నిందింప దానికే ♦ నాఁగఁ గలనె?

రామ:—అటయిన యుద్ధమునకు డీకొనఁ గలవా?

ఆంజ:—దేవా! నా ప్రతిజ్ఞ మాత్రము విడువఁ గలనా?

రామ:—వినుతక యుండి యీ రామ బాణమునకు దీటుగా నిలువఁ గలవా?

మ॥ అదనుం దప్పినఁ దప్పి పోవుటకు బ్ర ♦ హ్మాస్త్రంబుగా దేగియున్
దుదకున్ బ్రాణముఁ దీయకుండుటకుఁ గ ♦ న్నుల్ లేని వజ్రాయుధం

బది గా నెట్టులో గ్రొత్త గంతులను జే ♦ యఁగ వారు వీర! కాదు నీ
మదిలో నియ్యది రామబాణ మను గా ♦ మ్మా క్రిమ్మఱఁగన్ మారుతీ!

ఆంజ:—దేవా! యెట్లైన నేమి? దేహత్యాగంబున కియ్యకొంటి. రానిమ్ము.

రామ:—ఓయీ! మహాబల శాలివగు నిన్ను మే మెదిరింపఁ గలమా?

మ॥ సురపక్షం జంపితి వంత దాని నటుపై ♦ క్షోణిం బడం గూల్చినా
వురు ధైర్యమ్మున లంకిణిన్ మఱియు ను ♦ ద్యోగించి శాసించినా
వరరే? యంతటి రాక్షసాగ్రణుల నా ♦ హా! యేమి? నీ శౌర్య మీ
ధరణిన్ నిర్ణేకరింప మాదృశులు సుం ♦ తన్ శక్తులే? మారుతీ!

ఆంజ:—దేవా! యుష్మత్పాద సేవకుండనగు నేను మీవలె బలశాలి నెట్లగుదును?

మ॥ వనమం దార్చెడి తాటకాంగనను జం ♦ పం గల్గినానే? సనా
తన విప్రోత్తముఁడైన భార్గవునితోఁ ♦ దార్కొంటినే? వీర ధై
ర్య నివేశంబునఁ జెట్టు చాటునకుఁ జే ♦ రంబోయి యెంతో ఘనం
బని నే నంతటి వాలి నొంచితినె? దే ♦ వా! జానకీవల్లభా!

రామ:—(కోపముతో) వానరా! చదువఁ జదువ నున్న మతి పోయె నన్నట్లు శ్రుతికి మించిన మాట లాడుచుంటివి. పరశురామాది మహావీర విజయుండగు నీ రాముఁడు నీ కంటికిఁ దృణప్రాయంబుగాఁ గన్పట్టుచున్నాఁడే? నీకుఁ జిరంజీవి నను గర్వ మున్న దేమో? ఆ చిరంజీవిత్వము నీ రామబాణమున కడ్డుపడవు సుమీ? సురాసుర యక్ష రాక్షస గంధర్వ విద్యాధరాది వర్గంబులైనను నాతో నెదిరించి నిలువఁజాలరు. నేను సామాన్య నరుండ నని తలంచుచున్నావేమో? యొక దృష్టాంతముం జెప్పెద వినుము.

చ॥ మును సురవీరు లెల్లరు వి ♦ భూ! మముఁ బ్రోవు మటంచు నొక్కఁడె పె
ట్టున మొఱవెట్ట దానిని గ ♦ డుంగముఁ గూరిమి నాలకించి నే
నిన కుల మందుఁ బుట్టి వధి ♦ యించితి రాక్షస వర్గ మెల్ల నా
వొకటి విక్రమం బెఱుఁగ ♦ వే? యిది క్రొత్తయె నీకు మారుతీ!

ఆంజ:—స్వామీ!

క॥ అంతటి వానికి నీకే
నింతటి భక్తుండ నగుచు ♦ నిట్టి పరీక్షన్

పంతము నెఱవేర్పక నీ
కంతటి యపకీర్తిఁ దెత్తు ♦ నా ? శ్రీరామా !

రామ:—భక్తవాత్సల్యము నన్నుఁ బట్టి వేధించుచున్నయది. వాయునందనా !
నా ప్రతిజ్ఞ నెఱవేఱుట నీ కిష్టమా ? లేదా ?

ఆంజ:—స్వామీ! మీ దాసుండనగు నాప్రతిజ్ఞ నెఱవేఱ్చుట మీకుభాగ్యము కాదా?

రామ:—నయభయంబులచే నెంత బోధించినను నీమూర్ఖత విడవకున్నావు వానరా!

సీ॥ చెట్టు గుట్టలలోనఁ ♦ జేరి కాయలు పిందె
లును గూడఁ దెంచుకో ♦ తిను పశువులు
చీనాంబరముల ని ♦ చ్చినను చేతికిఁ జించి
పాఱవేసెడి దురా ♦ చార పరులు
రత్నములను నైన ♦ ఱాల మాదిరి పార
మఁగ నెట్టులో ఉప్పు ♦ పొగరుఁ బోతు
లెంత వారలనైన ♦ నంతరం బెఱుక యింత
యేని లేక కికిలింతు ♦ హీన మతులు

గీ॥ యుక్త మిద యుక్త మిది యను ♦ నూహ లేక
సంచరింతుము నుండెడి ♦ జనులు నిట్టి
జ్ఞాన మిసుమంత యేనను లేని ♦ వానరులము
మంచి వాక్యము లెట్లు రు ♦ చించు నయ్యా !

ఆం:—దేవా ! నీ మే

సీ॥ నిదుర లేచినదియే ♦ మొదలు కొంపలను ముం
చెడి దురాలోచనల్ ♦ సేయఁ గలమె ?
ధాటిమై నెదిరించి ♦ కూట సాక్ష్యములచే
సచ్చరితుల మోస ♦ పుచ్చఁ గలమె ?
మృగ శాబకముల బ ♦ లిమిని బట్టి చంపి తు
చ్ఛంపు మాంసంబు భ ♦ క్షింపఁ గలమె ?
శాతికిఁ దగని వే ♦ షముల దాలిచి సిగ్గు
విడనాడి స్వేచ్ఛగా ♦ నడువఁ గలమె ?

గీ॥ పశుసమముల మృగము మా కోఁటి ♦ వానరులకు
నరులకుండెడి జ్ఞానంబు ♦ దొరకు టెట్లు?
మంచి మాటలు చెవికి రు ♦ చించు టెట్లు?
స్వామి! కరుణాసముద్ర! శ్రీ ♦ రామభద్ర!

రామ:—ఓరీ కృతఘ్నా! ముందు వెనుక లరయక మాట లాడుచున్నావు. నీ కంతకాలము సంప్రాప్తించిన నీ యతివినయమును నీ నియుక్త కార్య విధానోన్ముఖత్వమును నీ భక్తిప్రభావమును జూచి మున్నేమో? యనుకొంటిఁ గాని నీ విట్టి గోముఖవ్యాఘ్రమవని యెఱుంగనైతి. అవురా? నా వద్ద నున్న యన్ని దినములలో నీ ధైర్య శౌర్య బలాదు లెందుండి నీ కిప్పుడు వచ్చినవి? గురుద్రోహీ!

ఉ॥ నిన్ను వధించి ముందుఁ బంపు ♦ నిఁక గడతేర్చెద నా యయాతి భూ
పు న్నిజ మిప్పుడేని తలఁ ♦ పోసి త్యజింపుము వాని బుద్ధి సం
పన్న తెఱుంగరే? తనమె ♦ మాలిన ధర్మము లోకమందు నెం
దున్నదియో? వచింపఁ గల ♦ వోయి! క్రమమ్మున వానరాగ్రణీ!

ఆంజ:—(స్వ) ఛీ! యీ క్షణభంగురంబులగు శరీరములపై నాస యేల? యెట్లైన నిప్పట్లు వానిని విడుచుట నాకుధర్మముగాదు. పోనీ? యీ రామచంద్రుని హస్తంబులో నా ప్రాణములు పోవునెడ ననంత సౌఖ్యంబు లభించుటే కాక ప్రతిజ్ఞాపరిపాలనార్థమై తన ప్రాణములను నిచ్చినాఁడను గొప్ప యశంబును నాకుఁ బొంద నయ్యెడిని. ఇంక వెనుదీయఁ గూడదు.
(ప్ర) భక్తవత్సలా!

శా॥ ఏ నింతేని యెఱుంగఁ కీ ప్రతిన స్వా ♦ మీ! చేసినా నింక నా
ప్రాణంబైనను నిచ్చి తీరవలె నే ♦ దా? యాతనిం బ్రోవఁగాఁ
బూనంగా వలెఁ గాన నింతకును సం ♦ పూర్ణమ్ముగా రామచం
ద్రా! నీతోడనె నాకు సంగరము సం ♦ ప్రాప్తించె నింతేటికిన్.

రామ:—ఓరీ! జ్ఞానలవ దుర్విదగ్ధా!

గీ॥ నీవెపస వానర్చి నట్టి నా ♦ బోధ మెల్ల
బూదిలోఁ జల్లు నాజ్యంబు ♦ భాతి నయ్యె.

ఆంజ:— స్వామి! నా ప్రార్థనంబులు ♦ చవుట నేలఁ
జల్లు బీజము లట్లు ని ♦ ష్ఫలము లయ్యె.

రా:—మారుతీ! శరీరముండఁ జూచుకొనినయెడ నాతో నెయ్యంబునకియ్యకొనుము.

ఆంజ:—దేవా! సర్వభూతాంతర్యామివి నీవుఁ దెలియని ధర్మంబు లెందుంగానరావు.

ఉ॥ మాటయె శాశ్వతం బవని ♦ మండలమందున నీ శరీరముల్
బూటక మంచు నీవ మును ♦ మున్నటి దాఁక వచింపలేదె? ము
మ్మాటికి నిప్పు డట్టి గురు ♦ మంత్రము నావల నెట్లు త్రోతు ధ
ర్మాటవి నెట్లు కాల్పఁ గల ♦ నయ్యా! యొకింత మహాత్మ! తెల్పుమా!

రామ:—(స్వ) ఏమీ ధైర్యము? యింక నా ప్రభావముఁ జూపినం గాని వీని కధైర్యము గలుగ నేరదని తోఁచుచున్నది. (ప్ర) వాయునందనా!

మ॥ అనఘాత్ముండవు ముఖ్యభక్తుఁడవు నా ♦ కాప్తుండవుం గాన ని
ట్లనుకూలంబుగ నింత దూరమును మా ♦ టాడంగ రా నయ్యెఁ దీ
అని ప్రేమమ్మున నింక నస్మదవ తా ♦ ర ప్రక్రియం జూచి రై
నను జ్ఞానమ్మును దెచ్చికొమ్ము పయి సం ♦ దర్భమ్ము లింకేటికిన్.

ఇదిగో క్షీరపారావార మధ్యంబున సహస్రకోటి ఫణామండల విరాజమానం బగు నాదిశేష వాహనంబు నధిష్ఠించిన నా విష్ణ్వవతారముం జూడుము.

ఆంజ:—(దోసిలొగ్గి) ధన్యోస్మి. ధన్యోస్మి.

(భుజంగప్రయాతము.)

హరీ! నేను ధన్యుండ ♦ నైతిన్ మదీయ
స్ఫురత్పూర్వ పుణ్యంబు ♦ పూర్ణత్వ మొందెన్
గురూ మత్కులం బెల్ల ♦ నుం బావనం బై
తరించెన్ మహాత్మా! స ♦ దా భూరి నిష్ఠన్
గరమ్ముం దపమ్మున్న ♦ కం జోద్భవాదుల్
పరీక్షింపఁగా లేని ♦ త్వద్దివ్య రూప
స్థిర ప్రాభవంబున్ బ్రి ♦ తీక్షించి నాఁడన్

ధరామండలం బందు ♦ నకా నాకు నింకకా
గోఅల్ గల్గునే? దేవ ♦ కోటీర విన్య
స్త రత్న ప్రభాలంకృ ♦ త శ్రీపదాబ్జా!
సురానీక సంసేవ్య ♦ శుద్ధ స్వరూపా!
పరానంద మూర్తీ! వి ♦ భాస్వ త్సుకీర్తీ!
పరేశా! పురాణాధి ♦ పా! సర్వ విశ్వం
భరేశా! నమస్తే న ♦ మస్తే నమస్తే.

సీ॥ నవనవాకృతిఁ బోల్చు ♦ నవతారములు దాల్చి
మించి దుర్జనుల శి ♦ క్షించి నావు
కరుణా కటాక్ష వీ ♦ క్షణ నవాంకూరముల్
పెంచి సజ్జనుల ర ♦ క్షించి నావు
అనుపమ భక్తి సా ♦ ధన శక్తి మెయి నాశ్రి
యించు భక్తులను బ్రోచి ♦ మించి నావు
లోకత్రియాధికా ♦ లోకన స్ఫూర్తిచే
సంచితార్థములు ని ♦ ర్మించి నావు
గీ॥ సగుణుఁడవు నిర్గుణుండవు ♦ సర్వసముఁడ
వాది శూన్యుండ వమిత ద ♦ యా మయుండ
వోలి నీ దర్శనమున ధ ♦ న్యుండ నైతి
విశ్వ పావన రోచిష్ణు! ♦ విష్ణు! జిష్ణు!

(యవనిక పడుచున్నది.)

రామ:— ఆంజనేయా! నీ కిప్పటికైన జ్ఞానము వచ్చినదా? యింక నైన వాని విడుతువా?

అంజ:— స్వామీ! నీ ప్రభావదర్శనానంతరము నాకిప్పుడు నిశ్చయజ్ఞానముగలిగినది.

ఉ॥ నిన్ను జయింతు నేని? ధర ♦ జే తల మందున రామ భక్తికిన్
వన్నెలు పెట్టి నాఁడ నెడు ♦ వాసి గడించెద లేక నీ శరా
సన్న కృశాను కీలలకుఁ ♦ జచ్చితి నేని? ముదమ్ము మి[illegible] న
భ్యున్నతమైన మోక్ష సుఖ ♦ మొందెద నాకిఁక నేమి? రాఘవా!

మొదట నా దైవంబ వగు నీవు బాణము విడిచినం గాని నేను సన్నద్ధుండఁ గాఁజాల. క్రోఁతియని మాత్రము స్వల్పయుద్ధమునకుఁ బూన వలదుసుమా?

రామ:—మిత్రద్రోహీ! నీ కకాల మృత్యువు దాపరించుటచేతనే యిట్టి దుర్బుద్ధు లుద్భవిల్లినవి. ఇంక నీయెడఁ జతుర్థోపాయంబు కన్న సాధనంబు గానరాదు. కడపటి మాట యిదియే. నీ విఁకనైన వాని విడిచెదవా? లేదా॥

ఆంజ:—దేవా! పలు మాట లేల? ముమ్మాటికి విడువను.

రామ:—అట్లైన మరణమునకు సంసిద్ధుండ వైతివా?

ఆంజ:—అది కర్మాధీనము. యుద్ధమునకు మాత్రము సంసిద్ధుండ నైతి.

రామ:—(క్రోధముతో)

(భుజంగప్రయాతము.)

దురాత్మా! దురాచార! ♦ దుర్మార్గ వర్తీ!
హరింతుఁ గురుద్రోహి ♦ వౌ నిన్ను నస్మత్
కరాళ ప్రభావా స్ప ♦ ద స్ఫార శక్తి
స్ఫురత్ఖడ్గ నైపుణ్య ♦ ముం జూచికొమ్మా!

(ఆంజనేయుని లాఁగికొని పోవుచున్నాఁడు.)

గద్య. శ్రీమత్పరమ పవిత్ర భారద్వాజస గోత్రాపస్తంబసూత్ర యజుశ్శాఖా
పాత్ర సీతారామ పుత్ర కనకాంబా గర్భ శుక్తి ముక్తాఫల
పరమేశ్వర ప్రసాద సముపలబ్ధ ఘటికాశత గ్రంథ
కవన సామ్రాజ్య చిదంబర కవీంద్ర ప్రణీత
శ్రీరామాంజనేయ నాటకము.
షష్ఠాంకము.

శ్రీ రామాంజనేయము.

సప్తమాంకము.

[గంధర్వమిథునము ప్రవేశించుచున్నది.]

నాథ:— కాంతా! యేమి? యీ వైపరీత్యము.

గీ॥ ప్రతినఁ బట్టిన యాతఁడా • రామచంద్రుఁ
డఁట యభయ మిచ్చి నట్టి వాఁ • డాంజనేయుఁ
డఁట యుభయులకును గలహ • మఁట కటకట!
కాల మహాత్మ్య మాశ్చర్య • కరము గాదె?

కాంత:—(ఆవేగముతో) నాథా! యేమీ ప్రళయము? లోకములు మండిపోవు నని తోఁచుచున్నది.

నాథ:— కలికీ! భరత లక్ష్మణ శత్రుఘ్నులొక ప్రక్కను సుగ్రీవాంగద జాంబవంతులొక ప్రక్కను యుద్ధ భూమిలోఁ బ్రవేశించియున్నారు. చూడుము.

కాంత:—(చూచి) ప్రాణేశ్వరా! యీ మహర్షి యెవ్వరు?

నాథ:— విశ్వామిత్రుఁడు. అతఁడే యీ కలహమునకు మూలము.

కాంత:—(భయముతో) నాథా! వారి భీకరాకారములు నాకు భయంకరము లగుచున్నవి. ఇచ్చట నే నుండఁ జాల.

నాథ:— భీరూ! అంతరిక్షమున నుండి చూతము రమ్ము.

(అంతరిక్షమున కేగి చూచుచుందురు.)

యుద్ధభూమి.

[భరత లక్ష్మణ శత్రుఘ్న విశ్వామిత్ర సుగ్రీవాంగద జాంబవంతులు ప్రవేశింతురు.]

జాంబ:—అహో! యేమి? యీ కాల వైపరీత్యము.

శత్రు:—కాల వైపరీత్య మేమి? భావి కాలానుసారంబుగా శిష్యులు గురువునకుఁ బంగనామములు దిద్ద నున్నారు. ఇందుఁ దప్పేమున్నది?

సుగ్రీ:—మా సంధి కొప్పికొనక మీ రీ కలహమునకుఁ గాలు ద్రవ్వితిరి గాని మే మెన్నఁడును నిట్టి యపచారములకు సమకట్టిన వారము కాము.

లక్ష్మ:—సుగ్రీవా! నీవాచాలత చాలు. మాయన్నగారు మొదట చంపెద నని ప్రతినఁ బట్టిన వాని మీ రిట్లు రక్షింతు మని కంకణముఁ గట్టుకొంటిరా? మీరు ముందు రక్షింతు మని ప్రతినఁ బట్టిన వాని మే మిట్లు శిక్షించుటకు సమకట్టుకొంటిమా? నీ తెలిసీ తెలియని మాట లిఁకఁ గట్టి పెట్టుము.

సుగ్రీ:—సౌమిత్రీ! త్వరపడ నేల? యిప్పుడు తెలియకున్నను ముందుఁ దెలియఁగలదు.

భర:—ప్లవగాధిపా! యిప్పుడు తెలియక నీ వేమి చేయఁగలిగితివో? ముందుఁ దెలిసియు నంతకన్న నీవు చేయునది లేదు.

అంగ:—నీవు త్రికాల వేదివి కాఁబోలు.

భర:—నేను త్రికాలవేదిని కానేరఁ గాని మీరందఱు చరమ కాల వేదు లనుటకు సందియము లేదు.

జాంబ:—కాలము వచ్చి నప్పుడు చరమ కాల వేది కానివాఁ డెవ్వఁడు?

శత్రు:—మీ కిప్పుడు కాలము వచ్చినదా? యేమి?

సుగ్రీ:—కాలము వచ్చిన హేతువుననే చిరంజీవితోఁ గలహము సంప్రాప్తించినది.

లక్ష్మ:—వానరా! నోరు మూయుము. మీచిరంజీవి ప్లవగాధిపతిత్వము లీ లక్ష్మణ ధను ర్నిర్ముక్త నారాచ పరంపరాగ్ని జ్వాలలకు శలభంబులు కావలయు.

సుగ్రీ:—లక్ష్మణా! మాట లెచ్చుచున్నవి.

చ॥ ఎవఁడును దిక్కు లేక చరి ♦ యించుచుఁ గానన వీధులందు మా
సవిధమునందుఁ జేరి పయి ♦ సఖ్యము నెంతయుఁ జేసి పిమ్మటన్
దవిలి మహోపకారములు ♦ తద్దయు మా వలనన్ గ్రహించియున్
జివరకు నిట్లు రాఁగలిగె ♦ నే? యవివేకము రాఘవానుజా!

లక్ష్మ:—సుగ్రీవా! మైమఱచి మాట్లాడకుము. ఇంత బలశాలివగు నీవు మహోప కారములు చేయకున్న నింక మా గతి యేమున్నది?

చ॥ ఎఱుఁగమె? నీ బలంబు మును • నింతయుఁ జేయని వాలి చేతనుఁ
బరిభవ మొంది నిల్చుటకుఁ • బట్టును లేక మహాద్రి కాననాం
తరముల నాశ్రయించి పలు • దారులనుం గడతేర లేక మా
మఱుఁగునఁ జొచ్చి నట్టి బహు • మాన్య చరిత్రుఁడ వీవు వానరా!

సుగ్రీ:—లక్ష్మణా! యిట్లెత్తిపొడుపు మాటలకే పూనుకొనిన మీయెడలను లెక్కకు మిక్కుటముగానే యున్నవి.

గీ॥ రావణునిచేత మును సంగ • రంబు నందుఁ
గూలినది సేన కాఁబోలు • శీల వాలి!
తెలిసి తెలియని మాటలు • పలుక నేల?
యుండ ఱకును జయాపజ • యములు గలవు.

లక్ష్మ:—వానరా! యూరక పేలకుము. సందర్భయుక్తముగా మాట లాడు టన్న భార్య నొకని కొప్పగించి యేడ్చుచు మా యన్నగారి పాదముల పైఁ బడు టనుకొంటివా?

అంగ:—రామానుజా! అట్లనుకొనలేదు. మా యాంజనేయుండు మహా సాగర మెల్ల దాఁటి యక్కడి రక్కసుల నెల్ల నుక్కడంచి లంకాపురం బంతయు దగ్ధము చేసి వచ్చి సీతా దేవి వార్త నెఱింగించి యా యుంగర మీయ నప్పుడు నిశ్చేష్టులై యొకరి మొగా లొకరు చూచుకొను టనుకొంటిమి.

శత్రు:—అంగదా! యొకరి మొగా లొకరు చూచుకొనిరో? రాక్షసాధముం డగు నా నీచుని పీచమడంచిరో? నీకుఁ గనులు లేవా?

సుగ్రీ:—కనులతో లాభము లేదు. జ్ఞానము ప్రధానము.

భర:—వానరేశ్వరా! కీశాగ్రేసర చక్రవర్తి శిరోమణు లగు మీ జ్ఞానమునకు మీరు సంతసింపకున్న దిక్కే మున్నది?

జాంబ:—సుగ్రీవా! యింక నీవు మాట లాడవలదు.

భర:—జాంబవంతా! వృద్ధుఁడ వగు నీకైనఁ దోఁప లేదా?

జాంబ:—తోఁపకేమి? మీయంతటివారే జ్ఞానశూన్యులగుచుండ నేమొక లెక్క?

లక్ష్మ:—ఓరీ! దురాత్మా! యింక మీ యెడల సామ వచనంబులు పనికిరావు. చతుర్థోపాయమే సాధనముగాఁ దోఁచుచున్నది.

గీ॥ కొండతోడను హస్తి డీ • కొన్న యట్లు
ఉదధితోడను గాల్వ పెం • డొడ్డి నట్లు
అగ్గితోఁ బురువు చెర్లాట • లాడి నట్లు
కాదె? మాతోడ వైరంబు • కడకు మీకు.

మీ కంఠకాల మాసన్న మైనది.

జాంబ:—దురాగ్రహావేశ పరవశా!

చ॥ ఉలికెద మే? త్వదీయ వచ • నోద్ధతి కేటికి? వట్టి డంబముల్
పలికెద విప్పుడే మిము ని • లం బడఁగూల్చి జగంబు మెచ్చ నెం
దులఁ బటు శక్తి తోడఁ బులి • నోటను మాంసముఁ బుచ్చికొన్న య
ట్టుల నిదె మీదు ప్రాణము లి • టుల్ బలిగొందుము చూడు లక్ష్మణా!

సుగ్రీ:—తాతా! యిచ్చట నాతోడ యుద్ధము చేయుటకుఁ దగిన వాఁడెవ్వఁడును గన్పట్టకున్నాఁడు. ఇప్పుడీ విశ్వామిత్రుని పై కేగుదునా?

విశ్వా:—సుగ్రీవా! నీ మర్కట చేష్టలు మానవైతివే.

అంగ:—ఓరీ! కౌశికా! యింతకును నీవుకారకుఁడవు. నీప్రాణములు చూచికొమ్ము.

విశ్వా:—ఓరీ! కండక్రొవ్వున నెవ్వరి నెట్లన వలయునో? యెఱుఁగక ప్రేలెదము.

జాంబ:—విశ్వామిత్రా! నిన్ను ధ్వంసము గావించినఁగాని లోకము సంతసింపదు.

లక్ష్మ:—మితి మీఱుచున్నది. (మత్తకోకిల.)

ఓరి! క్రొవ్వున మాట లాడుదు • నంటి వీవు తృణంబులో
నీలు జేసెద నీదు గర్వము • నిల్వ నిచ్చట దుర్మతీ!

జాంబ:— కాఱుకూఁతలు గూయ నేటికిఁ • గత్తిఁబట్టి రణంబునన్
శూర భావముఁ దాల్చి రా నిను • నుగ్గుఁ జేసెద లక్ష్మణా!

భర:—జాంబవంతా! మీ యహంభావ మడఁగించు కాలము సంప్రాప్తించినది.

జాంబ:—భరతా! హెచ్చు మాట లాడ వలదు. సంగరమున దిగినంగాని మీమా సామర్థ్యములు తేటపడవు.

భర:—ఓరీ! గర్వాంధా!

క॥ నిలువుము నే నీ క్షణమున
ఖలుఁడా! మామక కఠోర ♦ ఖడ్గముచే నీ
తలఁ దీసెద నీ సంగర
తలమందునఁ గాచుకొమ్ము ♦ డంభ చరిత్రా!

అంగ:—ఈప్రగల్భంబులచే లాభమేమి? నీదర్పమడంచుట కీయంగదుఁడు చాలఁడా?

శత్రు:—ఓరీ! నీచా! శరత్కాల మేఘగర్జితంబుల కైవడి వట్టి ప్రలాపము లేల? వాచాలా! నీ ప్రాణాంతకుండు శత్రుఘ్నుండిదే వచ్చుచున్నాఁడు.

సుగ్రీ:—కపి కులాగ్రణినైన నా కింతటి సేనలో యుద్ధమునకు దీటైన వాఁడొక్కండును లేఁడుగదా? ఛీ! శత్రుఘ్నా! యెక్కడికేగెదవు. ఇటురమ్ము.

శత్రు:—వానరకీటమా! త్వదహంకార తూల నిర్మూలంబున కిదిగో మదీయ నారాచాగ్ని జ్వాలాకణంబు కాచికొమ్ము. (శరము సంధింపఁబోవుచున్నాఁడు.)

సుగ్రీ:—(స్వ) కొంప ముంచి వీఁడు నన్నిప్పుడే చంపునా? యేమి? యిట్లని తప్పించుకొనెద. (ప్ర) శత్రుఘ్నా! నిలు నిలు. నేను కిష్కింధాధిపతిని. మీ యన్న యయోధ్యాధిపతియుఁ గాన నా యంతటి వానితో నేను యుద్ధము చేయవలయుఁగాని నీ బోఁటి కుఱ్ఱలతో నా కిష్టములేదు.
(అవలకుఁ బోవుచున్నాఁడు.)

క॥ శిరములఁ దునుమాడిన యీ
కరవాలముతోడ నిన్ను ♦ క్షణ కాలములో
నఱకెదఁ గిన్నర విద్యా
ధరు లచ్చెరు వొందునట్లు ♦ ధైర్య విహీనా!

(అందఱు యుద్ధముఁ జేయుచున్నారు.)

(సుగ్రీవాంగద జాంబవంతులు మూర్ఛిల్లుదురు.)

శత్రు:—అన్నా! అదిగో నాంజనేయుండు వచ్చుచున్నాఁడు.

లక్ష్మ:—పిల్లివలె వానివెనుక నాయయాతి యెట్లు వచ్చుచున్నాఁడో? చూడుము.

[ఆంజనేయుఁడు యయాతియుఁ బ్రవేశించుచున్నారు.]

ఆంజ:—(శోకముతో) హా! జాంబవంతా!

సీ॥ తగిన యాలోచనలును సం ♦ దర్భములును
గుర్తెఱుంగఁగఁ జేసెడి ♦ కోవిదుఁడవు
నీవు లేకున్న నింక నే ♦ నేవిధమున
బ్రతుకువాఁడనో? తెలియఁగాఁ ♦ బడదు తాత!

కలుషాత్ముండ నగు నేను మీ కట్టి విపత్తు గలుగఁజేసితిని. కటకటా!

మ॥ అనఘాత్ముండవు సాధు వర్తనుఁడ వ ♦ య్యాపట్ల నా కెంతయో
యనుకూలంబుగ సంచరించితివి కా ♦ ర్యాకార్య సంవేది వై
చనుమానంబున నుంటి విన్న దినముల్ ♦ పైదోడు వై యింతలో
నను నిర్భాగ్యునిఁ జేసి పోయితివె? య ♦ న్నా! యంగదా యంగదా?

నాకతంబున మీ కట్టియిక్కట్టు సంప్రాప్తించినది. అయ్యో! యింక నేమి చేయుదు.

శా॥ ఏ వేళన్ గరుణా కటాక్షమున నన్ ♦ వీక్షించుచున్ గొప్పగా
భావంబందున నెంచుచున్ మిగుల వి ♦ శ్వాసమ్ముమై సంతత
శ్రీ వర్ధిల్లఁగఁ బ్రోచుచున్ దివికిఁ దం ♦ డ్రీ! పోతివే? యింక సు
గ్రీవా! నిన్ విడనాడి యెవ్విధి ధరి ♦ త్రిన్ నేను జీవింతునో?

దైవమా! మత్ప్రాణాధికులగు వీరందఱును బోయిన వెనుక నా ప్రాణములు మాత్ర మేటికి? ఇప్పుడే శ్రీరామచంద్ర శరపరంపరకు బలిగా సమర్పించెద. (స్మృతి నభినయించి) ఆఁ. యేమి యీ సంభ్రమము? యయాతి ప్రాణములు దక్కించిక దా నాప్రాణములు వీడవలయు. (కోపముతో లక్ష్మణాదులం జూచి)

(పంచచామరము.)

దురాత్ములార! రండు రండు ♦ తూర్ణరీతి మిమ్ము ము
వ్వురన్ క్షణంబులోన నొంపఁ ♦ బూని వాఁడ నిత్తఱిన్
జరాచర ప్రపంచ మెల్ల ♦ సైఁప లేక క్రుంగినన్
హరాదు లడ్డమైనఁ గాని ♦ యాఁగ లేరు నన్నిఁకన్.

భర:—ఓరీ! నీ ప్రాణముల నేలగోలుపోయెదవు. ఇంతటనైన వానివిడువుము లేనిచో?

శా॥ గోటన్ మీటి భవత్ప్రతాపమును నీ ♦ కుం బూర్తిగా నన్న యా
నీటున్ గిటడఁగించి నీ గడుసు గుం ♦ డెల్ బ్రద్దలం జేసి యీ
యాటోపంబు నడంతు మీ క్షణములో ♦ నస్మత్తీక్ష్ణరాశి ప్రభా
తాటంక ప్రతిభాసమాన శర సం ♦ ధానంబునన్ వానరా!

ఆంజ:—భరతా!

ఉ॥ మించిన మాట లేల? బల ♦ మే కలదేని? గ్రహించి ఖడ్గ మె
క్కించుక రమ్ము మీఁది కిటు ♦ లేమగునో? యని పాఱి పోవ క
త్యంచిత విక్రమంబున జ ♦ యాపజయంబుల లోన నేదియో?
కాంచుము సర్వ సమ్మతము ♦ గా బవర మ్మొనరింపు మింతకున్.

లక్ష్మ:—ఓరీ! వానరా!

సీ॥ లఘువుగా మత్స్యావ ♦ ల్లభుచేఁ బరాభవం
బంది ఛీ! జీవించి ♦ నట్లు గాదు
అనదలచేత లం ♦ కను నీచ కృత్యంబు
లంది ఛీ! జీవించి ♦ నట్లు గాదు
ఆ యింద్రజిన్న్యస్త ♦ సాయకమ్మున మూర్ఛ
నంది ఛీ! జీవించి ♦ నట్లు గాదు
అనయమ్ము మాకు దా ♦ సానుదాసుండవై
యెట్లో? ఛీ! జీవించి ♦ నట్లు గాదు

గీ॥ కాంచుమీ? నాదు వజ్రక ♦ ఠోరములైన
బాణములచేత నేఁడు నీ ♦ ప్రాణములను
దీసెదను గాక నిలునిలు ♦ దోసకారి!
తాళఁ డీ లక్ష్మణుండు నీ ♦ పాల యముఁడు.

ఆంజ:—అధమాధములగు రాక్షసులవలన యుద్ధ రంగమున నీవు మూర్ఛిల్లి నప్పుడు నిన్ను బ్రతికించిన వాఁడెవ్వఁడో? నీకు జ్ఞప్తిలోనున్న నీమాటలు రానేరవు.

శత్రు:—మాటలతో మాకుఁ బనిలేదు. నీ వింకఁ దొలఁగుము.

ఆంజ:—నేను తొలఁగ వలయునా?

(పంచచామరము.)

శరంబులన్ ధరించినన్ బ్ర ♦ శస్త్ర చాప మూనినన్
కరాళమైన ఖడ్గ మెత్తి ♦ కండు మీఱి వచ్చినన్
దురంబులోనఁ బాఱిపోవు ♦ దుర్బలుండఁ గాను న
న్నెఱుంగుమింక మిమ్మెదిర్చి ♦ యీ యయోధిఁ గాచెదన్.

భర:—(కోపముతో) (మత్తకోకిల.)

మన్న మిన్నను గానకుంటివి • మారుతాత్మజ! చూడుమీ

ఆంజ:— ఎన్నఁడైనను గాని మీ వీఁక • నిట్టి చందము మానుమీ

శత్రు:— మున్ను మా పరిచారకుండయి • మ్రొక్కినట్టులఁ గాదెఁకన్

ఆంజ:— మిన్నపై యిపు డీవు చేసెడి • మేటి కర్జ మదేమొకో ?

లక్ష్మ:— నిన్నదే నిముసమ్ములో నవ • సీతలమ్మనఁ గూల్చెదన్

ఆంజ:— నిన్ను సైఁపఁగ రాదు చూడుమ • నిన్ వధిం దెగటార్చెదన్.

(యుద్ధము చేయుచున్నారు.)

(భరత లక్ష్మణ శత్రుఘ్నులు మూర్ఛిల్లుచున్నారు.)

విశ్వా:—(గడగడ వడఁకుచున్నాఁడు.)

ఆంజ:—ఓరీ దురాత్మ! విశ్వామిత్రా!

సీ॥ అల వసిష్ఠుని తనూ • జుల నూర్వురం జంపి
నట్టి యా వైపరీ • త్యంబునందు
అల హరిశ్చంద్రుచే • బలిమిమై నీచ దా
స్యమ్ముఁ జేయించిన • సమయమందు
అల రంభను శిలోచ్చ • యాకారముగఁ జేయఁ
గలిగిన నిష్ఠుర • కాలమందు
అల మహో కపిల గో • తిలకంబు కంఠంబు
విఱిచి యున్నట్టి య • వ్వేళ యందు

గీ॥ నీ యహంభావ మడఁగింపఁ • జేయునట్టి
వాఁడొకండును లేఁడయ్యె • వాఁడు నేఁడు
చూడు మిఁక ముందు నీ పనిఁ • జూచి పైనఁ
బూనఁ గల నట్టి కర్జము • నైన నేను.

విశ్వా:—(స్వ) ఏమిది? యీతఁ డిప్పట్ల నా ప్రాణములు తీయునా యేమి? వీని యుద్యమము చూడ నట్లే కన్పట్టుచున్నయది. ఈ చిరంజీవి కడ నా శాపకోపము లేమియుం జేయ నోపవు. ఇంతటితో నీ వైర ముపశమించిన నా కెంతయు మేలగును. కటకటా! దీని నివారించుట కెవ్వరి తరము?

రామ:—(నేపథ్యములో) తమ్ములారా! తమ్ములారా!

విశ్వా:—మా రాముఁ డిటే దుఃఖముతో వచ్చుచున్నట్లున్నది. నేనిప్పుడుఁ బ్రతికితిని.

రామ:—(ప్రవేశించి శోకముతో)

మ॥ అప్పురా? సద్గుణ వార్నిధుల్ నయచరుల్ ♦ న్యాయానుకూలుల్ సమ
స్త విశేషార్థ వివేచనా పరులు నా ♦ తండ్రుల్ కుమారుల్ లల
న్నవ శోభానిధు లిట్టి తమ్ములను నే ♦ న్నండింక నేఁ జూతు ని
య్యవనిన్ నాకు జగమ్ము సర్వమును శూ ♦ న్యంబై నటుల్ దోఁచెడిన్.

(లక్ష్మణుని గాఁగిలించుకొని) హా! లక్ష్మణా!

సీ॥ ననుఁ దండ్రిఁగా నెంచి ♦ యనుసరించితి గాని
తమ్ముఁడా! మార్గంబు ♦ దప్పవైతి
సీత నే మాతఁగా ♦ సేవించితివి గాని
తమ్ముఁడా! యన్యథా ♦ తలఁపవైతి
వనుల మాతో పాటు ♦ వసియించితివి గాని
తమ్ముఁడా! విను వింత ♦ దాల్పవైతి
రాత్రించరులతోడఁ ♦ బ్రతిఘటించితి గాని
తమ్ముఁడా! వెనుదీయఁ ♦ దలఁకవైతి
గీ॥ భూమిలోఁ గల యన్నద ♦ మ్ముల వితమునఁ
దమ్ముఁడా! సుంత జ్ఞాతి భా ♦ వమ్ము నెఱుఁగ
వైతి వీఁక నిన్ను విడిచి నా ♦ ప్రాణములను
విడువ కుందునె? తమ్ముఁడా! ♦ గడియ లోన.

(భరతుని పైఁ జేయి వేసికొని) తండ్రీ! భరతా!

గీ॥ అమ్మ నీ కిచ్చి నట్టి రా ♦ జ్యమ్ము నెల్ల
విడిచి మాతోడఁ గష్టముల్ ♦ గుడువఁ గాన
నమ్ములకు వచ్చి నా యాజ్ఞ ♦ నడిచి నావు
మఱతు మన్నను నీ భక్తి ♦ మఱపు రాదు.

(శత్రుఘ్నుని మూర్కొని) నాయనా శత్రుఘ్నా!

గీ॥ అన్న నోటను నే యాజ్ఞ ♦ రైన వింత
వచ్చునేమో? యటంచు నీ ♦ వచ్చు పడఁగ

నా మొగమ్మునె చూడుము ♦ వడచు చుండు
అకటకటా తండ్రి! నిను వీడి ♦ యేఁగఁగలనె?

(కోపముతో) ఛీ! నేనే యిట్లు పరితపించిన నికఁ లోక మేమున్నది?

మ॥ అనఘుల్ భక్తి పరాయణుల్ సకల వి ♦ ద్యాశాలులై నట్టి నా
యనుజన్మోత్తరులన్ గలంచితి కృత ♦ ఘ్నా! చూడు మీ జాములో
ఘన దుర్వార పరాక్రమ క్రమణ చం ♦ ఖ న్మమకీనాసి ధా
రను నీ ప్రాణముఁ దీసి పుచ్చెదను రా ♦ రా? నిల్వరా? వానరా!

యయా:—తండ్రీ! ఆంజనేయా! ముందు నే నేగి శ్రీరామచంద్ర హస్త స్పర్శ ప్రశస్త బాణపుంఖంబునకు లక్ష్యంబనై వీరస్వర్గముం గాంచెద. సెలవిమ్ము.

ఆంజ:—అమంగళము ప్రతిహత మగుఁగాక. నెచ్చెలీ! నా బొందిలోఁ బ్రాణములుండునంతవఱకు నీ విట్టి చేఁతలకుం గడంగ రాదు సుమా? నా వెనుక నే యుండుము. నీకు వచ్చిన భయము లేదు.

యయా:—చిత్తము. (వెనుక కేగుచున్నాఁడు.)

ఆంజ:—దేవా! మహానుభావా!

గీ॥ అన్నియును నా ప్రమోదంబు ♦ లడఁగిపోయె
నింక నీ ప్రాణములు మాత్ర ♦ మేటి కయ్య!
రమ్ము వెనుదీయ నీదు హ ♦ స్తమ్ములోనఁ
జచ్చితి నదేని మోక్షమ్ము ♦ వచ్చు నాకు.

రామ:— (భుజంగప్రయాతము.)

ఇదే వచ్చితిం జూడు ♦ మీ? దుర్మదాంధా!
త్వదావేగమున్ ద్రుంచె ♦ దన్ గాచుకొమ్మా?

ఆంజ:— ఎదెట్లైన నౌఁ గాక ♦ యింకీ యయాతిన్
మదీయాశ్రితున్ జచ్చి ♦ నన్ నేఁ ద్యజింపన్.

రామ:—ఇదే చచ్చితివి. (బాణము వేయుచున్నాఁడు.)

(ఆంజనేయుఁడు మూర్ఛిల్లుచున్నాఁడు)

రామ:—హా! దైవమా! యెంత విపరీతకాలము సంప్రాప్తించినది. ఆంజనేయా!

గీ॥ భక్తుఁడవు సద్గుణుండవు ♦ పరమ హితుఁడ
వన్నిటను మాకు నుపకారి ♦ వైన వాఁడ

విట్టి నినుఁ జేతులార నే ♦ నిట్లు గూల్చి
బ్రతికి యుంటిని జీవచ్ఛ ♦ వంబ నగుచు.

అయ్యో! యిట్టి పరమభక్తునిఁగూల్చిన నన్ను లోకు లెంత నిందింతురో కదా?

మ॥ అకటా? యింతటి సాహస క్రియను జే ♦ యన్ జిత్త మెట్లొప్పెనో?
సకలోర్వీతల నాయకుండ వయి నీ ♦ చ భ్రాంతిలో మున్గి మా
యకలంకంబగు వంశమున్ క్షణములో ♦ హా! యగ్గిలోఁ గూల్చినా
నిఁక నా ప్రాణము లేటి కీయవనిఁ దం ♦ డ్రీ! భక్త చూడామణీ!

విశ్వా:—(స్వ) అయ్యో దైవమా! నే నెంత దురాత్ముఁడను దీని కంతకును నేను గదా కారకుఁడను. ఇంక నా ప్రాణములు మాత్రము కాల్పనా? ఛీ! క్రోధ మెంత వారికిని దురతిక్రమ మైన పిశాచము గదా?

రామ:—(అందఱింజూచి) దుర్భరము దుర్భరము.

సీ॥ నా నిమిత్తమె కదా? ♦ వడి హోమ కుండంబు
అందుఁ గూలితిరి నా ♦ యాప్తులార!
నా నిమిత్తమె కదా? ♦ కాననాదులలోనఁ
బరిచరించితిరి నా ♦ భక్తులార!
నా నిమిత్తమె కదా? ♦ యా నిశాచరుల కృ
త్యముల సైఁచితిరి నా ♦ దాసులార!
నా నిమిత్తమె కదా? ♦ ప్రాణ హానికి నైన
సమ్మతించితిరి నా ♦ తమ్ములార!

గీ॥ నా నిమిత్తమె కాదె? య ♦ నూనక కష్ట
విధులకును లో నయితిరి నా ♦ బిడ్డలార!
మిమ్ము నెడఁ బాసి నేను జీ ♦ వమ్ముతోడ
ధాత్రిలో నుండఁ గలనె? నా ♦ తండ్రులార!

కటకటా? యిట్లు తమ్ములను వట్లు భక్తులను జంపుకొని నే నిట్లు మృతప్రాయుండనై నిలువం బడుటకంటె నీ ఖడ్గధారచే నిప్పుడే నా కంఠము నుచ్ఛేదించుకొని వీరి ఋణముం దీర్చుదుఁ గాక.

(ఖడ్గముఁ గంఠముపై కెత్తుకొనుచున్నాఁడు.)

విశ్వా:—అయ్యయ్యో! రామా! యాత్మహత్య మహాపాతకము సుమా. యాఁగు
మాఁగుము? (ఖడ్గముం బట్టుకొనుచున్నాఁడు.)

రామ:—ఆఁ. ఏమి? యీవ్యత్యాసము; ఈ విశ్వామిత్రుని యాజ్ఞ నెఱవేర్పకయే
నాప్రాణములు త్యజించుట యధర్మము కదా? ఓరీగురుద్రోహీ! యయాతీ!

ఉ॥ ఓరి ధరాధవాపశద! ♦ యోరి పరాక్రమహీన! దుష్కులా
చారముగా మహర్షి కప ♦ చార మొనర్చితె? చూడు మిప్పుడే
ధీరత నస్మదీయ పటు ♦ తీవ్ర తళత్తళ భాసమాన దు
ర్వార నవీన ధార కర ♦ వాలము నీ తలఁ ద్రుంప కుండునే?

(పరిక్రమించుచున్నాఁడు.)

యయా:—ఆంజనేయా! హా హతోస్మి. హా హతోస్మి.

ఆంజ:—(లేచి) రామా! నిలు నిలు. నాప్రాణములింకను మిగిలియున్నవి రమ్ము.

రామ:—(స్వ) ఈతఁడు బ్రతికి నందుకుఁ బ్రమోదము గలుగుచున్నయది కాని,
యింకను బోరు మాత్ర ముడుగలేదు. (ప్ర) వానరా! మరల బ్రతికితివా?

(మత్తకోకిల.)

కాచుకొమ్ము క్షణమ్ములో నినుఁ ♦ గత్తి పాలొనరించి యీ
నీచునిన్ గడ తేర్చెదన్ బయి ♦ నిన్ బ్రసంగము లేటికిన్.

ఆంజ:— ఈ చతుర్దశ లోక సంతతి ♦ నీవు కాదవఁడేనియున్
లేచి యాతనిఁ జంపఁ జాలరు ♦ నిక్క మియ్యది రాఘవా!

(ఆకాశములో) జగద్విలయము. జగద్విలయము.

రామ:—(పైనఁజూచి) దేవతలారా! అభయ మభయము. (క్షణమాఁగును)

ఆంజ:—దేవా! చాలించెద మేమి?

రామ:—ఓరీ! యింతటితో నిన్ను విడుతు ననుకొంటివా? ఇదే నాబాణమునకుఁ
గాచికొమ్ము. (విల్లెక్కు బెట్టుచున్నాఁడు.)

ఆంజ:—దేవా! కాచికొనుచున్నాఁడ. (దేహముఁ బెంచుచున్నాఁడు.)

(నేపథ్యములో)

రామచంద్రా! ఆఁగు మాఁగుము. ఆంజనేయా! నిలు నిలు.

(మహేశ్వర సాక్షాత్కారము.)

రామ:—ధన్యోస్మి ధన్యోస్మి. (కవిరాజ విరాజితము.)

సకల చరాచర సృష్టిలయాది వి ◆ చారణ నిర్భర సాధుమతీ !

అంజ:— వికలుష జంతు సమూహ వివర్ధన ◆ విశ్రుత కీర్తి త్రిలోకపతీ !

విశ్వా:— ప్రకటితవేద పురాణ నిరూఢి ని ◆ రంతర శక్తి సమాకలితా !

యయా:— సుకవి మనోంబుజ శుద్ధ నివాస వి ◆ శోభిత సంతత ధీకలితా !

(నమస్కరించుచున్నారు.)

మహే:— రామచంద్రా !

గీ॥ ఈవు విష్ణువు శాంభవు ◆ సృష్టి కర్త
యాంజనేయుఁడు మీర ల ◆ న్యోన్య మిట్లు
తలపడిన లోకములు నిల్వఁ ◆ గల వఁటయ్య !
చాలు నిఁక నింతసంరంభ ◆ మేల ? మీకు.

రామ:— దేవా ! అనివార్య ప్రతిజ్ఞల వలన నీకలహము సమకూడినది.

మహే:— విశ్వామిత్రా ! నీ ప్రతిజ్ఞ నింక మరలించుకొనుము.

విశ్వా:— (స్వ) ఇప్పట్ల నా కిదియే తగిన యుపాయము. (ప్ర) రామచంద్రా ! నీవింతటితో శాంతించి యయాతిని రక్షింపుము. లేనిచో నాయంతరంగమునకు సంతాపముం గూర్చినవాఁడ వగుదువు.

రామ:— స్వామీ ! యథేచ్ఛావర్తనులగు మీ యాన కొడంబడుదుఁ గాని నా చేసిన ప్రతిజ్ఞ యెట్లు నెఱవేఱవలయు ?

మహే:— రామా ! మున్నా ప్రతిజ్ఞకుం బురికొల్పిన గాధేయుం డిప్పు డీ ప్రాణ దానంబునకు నియోగించుచుండ నీకా సంశయంబు కూడదు.

(ఆకాశములో) సత్యముసత్యము.

మహే:— ధర్మదేవతల వాక్య మాలింపుము.

రామ:— మహాప్రసాదము

మహే:— మూర్ఛాక్రాంతులగు నీ భక్తానుజన్ము లిదిగో లేచుచున్నారు. ఓం ఫట్.

(విభూతిం జల్లుచున్నాఁడు.)

(అందఱు లేచి నమస్కరించుచున్నారు.)

మహే:—భూయాను ర్భవంతో దీర్ఘాయుష్మంతః

(అంతర్ధానము నొందుచున్నాఁడు.) (తెరపడుచున్నది.)

[గంధర్వమిథునము అంతరిక్షమునుండి దిగుచున్నది.]

నాథ:—ప్రేయసీ! నీ భయము తీఱినదా?

కాంత:—యుద్ధము తీఱిన వెనుక నా కింక భయ మేమి?

నాథ:—కలికీ! రామాంజనేయ యుద్ధ మెంత చమత్కారముగా నున్నది?

కాంత:—అన్నిఁటికన్న రామభక్తి విడనాడకుండ రామునితో యుద్ధముఁ జేసిన హనుమంతుని కౌశల్య మతిశ్లాఘనీయముగా నున్నది.

నాథ:—ఈ మూలమున మహేశ్వర సందర్శనము గావించి మనము గూడఁ గృతార్థులమైతిమి.

కాంత:—నాథా! వారందఱుగూడ నిట్లే వచ్చుచున్నారు. మనమింక నేగుదము.

(నిష్క్రమించుచున్నారు.)

[అందఱు ప్రవేశించుచున్నారు.]

ఆంజ:—(దోసిలొగ్గి)

క॥ స్వామీ! నీ పదదాసుఁడ
స్వామీ! కరుణింపు మయ్య! ♦ స్వామీ! నాపైఁ
బ్రేమమ్మున నపరాధము
లేమియు లెక్కింపఁ బోకు ♦ మీ శ్రీరామా!

(పాదములపైఁ బడుచున్నాఁడు.)

యయా:— (పంచచామరము.)

అనన్య సాధ్య మైన నీ మ ♦ హా ప్రభావముం గనుం
గొనంగ భాగ్య మబ్బె నాకు ♦ క్షోణి భాగమందు నా
యనూన కష్టముల్ ఫలించె ♦ నన్నిఁటన్ మహాత్మ! యిం
క నేదియుం గొఱంత లేదు ♦ గాదె? జానకీపతీ!

(పాదములపైఁ బడుచున్నాఁడు.)

జాంబ:—దేవా! నా తప్పు క్షమియింపుము. (పాదములపైఁ బడుచున్నాఁడు.)

సుగ్రీ:—స్వామీ! నన్ను మన్నింపుము. (పాదములపైఁ బడుచున్నాఁడు.)

అంగ:—రామా! నన్ననుగ్రహింపుము. (పాదములపైఁ బడుచున్నాఁడు.)

రామ:—నాయనా! సంతసించితి. లెండు లెండు.

(అందఱు లేచుచున్నారు.)

ఆంజ:—(ఆనంద పారవశ్యముతో)

సీ॥ ఆపదుద్ధారకా! ♦ యాశ్రితపాలకా!
గురువరా! శ్రీరామ ♦ శరణు శరణు

యయా:—అనుపమాన చరిత్ర! ♦ ఘన భక్త జన మిత్ర!
గురువరా! శ్రీరామ! ♦ శరణు శరణు

జాంబ:—కరుణా రసావాల ♦ శరణార్థితతిలోల!
గురువరా! శ్రీరామ ♦ శరణు శరణు

సుగ్రీ:—భూసమానక్షమా! ♦ దాసామరద్రుమా!
గురువరా! శ్రీరామ! ♦ శరణు శరణు

అంగ:— గీ॥ సురుచిరాకార! శ్రీరామ! ♦ శరణు శరణు

భర:— సజ్జనాధార! శ్రీరామ ♦ శరణు శరణు

లక్ష్మ:— సాధు గుణ ధామ! శ్రీరామ ♦ శరణు శరణు

శత్రు:— శాశ్వత ప్రేమ! శ్రీరామ! ♦ శరణు శరణు.

యయా:—దేవా! మీ యనుగ్రహము వలన నేను ధన్యుండనైతి.

మ॥ భవనాతీత చరిత్రులం బరమ స ♦ మ్మోదమ్మునం గంటి సం
స్తవనీయంబగు కీర్తిం బడసితిన్ ♦ జన్మంబు దీపించె ధ
ర్మవు లెల్లన్ ఫలియించెఁ దండ్రి చరణం ♦ బుల్ పట్టితిం గాన నా
కవశేషం బికఁ నేమిటం గలదు? వి ♦ శ్వామిత్ర మానీశ్వరా!

(నమస్కరించుచున్నాఁడు.)

విశ్వా:— నాయనా! యశోరాశీ! నిర్దోషుండవగు నీకు నేనాగ్రహానుగ్రహావిష్టుండనై యింతటి శ్రమలు గలుగఁ జేసితి. దీని నెంత మాత్రము నీ మదిలో నుంచుకొనకుము. చిరంజీవి వగుము.

రాము:— ఆంజనేయా! నీ దృఢ ప్రతిజ్ఞ కెంతయు సంతసమైనది. నీ కేమి వరము కావలయునో? కోరుము.

ఆంజ:— దేవా! నీ కటాక్షము కన్న నాకు వేరొక వర మేల?

(భరతవాక్యము.)

చ॥ కళకళలాడుచుండఁగ జ • గంబున నెందునఁ బాడి పంటలున్
గలిగి సమస్త భాగ్యములు • కాఁపురముం బొనరించుఁగాక ని
చ్చలు రఘురామచంద్ర పద • సారస భక్తి లభించుఁగాక ని
ర్మల కవితామృత మ్మనువ • మానగతిం బ్రవహించుఁ గావుతన్.

గద్య. శ్రీమత్పరమ పవిత్ర భారద్వాజస గోత్రాపస్తంబసూత్రి యజుశ్శాఖా
పాత్ర సీతారామ పుత్రి కనకాంబా గర్భ శుక్తి ముక్తాఫల
పరమేశ్వర ప్రసాద సముపలబ్ధ ఘటికాశత గ్రంథ
కవన సామ్రాజ్య చిదంబర కవీంద్ర ప్రణీత
శ్రీరామాంజనేయ నాటకము.
సప్తమాంకము.

శ్రీ
రామాంజనేయ
నాటకము
సంపూర్ణం

Sree Savitri Press, Jagannaickpur, Cocanada.